www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
శుక్రవారం 21 మార్చి 2025
సంపుటి :06 సంచిక : 291 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## ఏడాదిలోనే 59వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మాది

- కారుణ్యనియామకాలపై గతంలో నిర్లక్ష్యం చేశారు
- జాబ్ క్యాలెండర్‌తో పాటు..కారుణ్య నియామకాలు
- నిరుద్యోగులను మోసం చేసినందుకే బిఆర్ఎస్ ఓటమి
- మిస్ వరల్డ్ పోటీలతో హైదరాబాద్‌కు పేరుతో పాటు బిజినెస్
- బిల్డ్ నౌ పోర్టల్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్

**హైదరాబాద్,మార్చి20( వెలుతురు):** సీఎం పదవి చేపట్టడం కన్నా.. జడ్పీటీసీగా గెలిచినప్పుడే ఎక్కువ ఆనందం కలిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మొదటిసారిగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన 'ప్రజాపాలనలో కొలువుల పండగ' కార్యక్రమంలో ఆయన పాల్గొని 'బిల్డ్ నౌ పోర్టల్'ను ప్రారంభించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖల్లో కారుణ్య నియామకాలకు సంబంధించి 922 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ...కారుణ్య నియామకాలు క్రమం తప్పకుండా చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. కారుణ్య నియామకాలు మీ హక్కు. గత ప్రభుత్వం కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం వల్ల మీరు పదేళ్లు నష్టపోయారు. జాబ్ క్యాలెండర్‌తో పాటుగా కారుణ్య నియామకాలు కూడా ఇవ్వాల్సిందే. తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగుల పాత్ర మరువలేనిది. స్వరాష్ట్రం వచ్చినా నిరుద్యోగుల కల నెరవేరలేదు. పేదలు, బడుగుబలహీన వర్గాలవారే పోటీ పరీక్షలకు సిద్ధమవుతారు. నిరుద్యోగుల బాధలను ప్రజా ప్రభుత్వం గుర్తించింది. అందుకే ఏడాదిలోనే 59వేల ఉద్యోగాలు ఇచ్చాం అని వివరించారు. నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే భారాస ఓడిపోయింది. మాకు ఉద్యోగాలు




ఇవ్వని మీకు ఉద్యోగాలు ఎందుకని నిరుద్యోగులు భారాసను ఓడించారు. కారుణ్య నియామకాలపై మాట్లాడే హక్కు భారాసకు లేదన్నారు. నిరుద్యోగుల బాధలు నాకు తెలుసు. ఉద్యోగ ఖాళీలను పెండింగ్ పెట్టొద్దని ఆదేశాలిచ్చా. పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలోనే ఫలితాలు ఇచ్చాం. 30, 40 రోజుల్లో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 ఉద్యోగాల నియామకాలు పూర్తి చేస్తాం. ఉద్యోగాలు ఇచ్చినా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇదే సందర్భంలో విపక్షాల విమర్శలపై ధీటుగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, సీఎంపై ప్రజలు కోపంతో ఉన్నారని ప్రతిపక్షాలు చేస్తోన్న విమర్శలకు సీఎం రేవంత్ రెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. నా మీద వ్యతిరేకత, కోపం ఉందని కొందరు 2 లో..

## బండి సంజయ్‌కు హైకోర్టులో భారీ ఊరట

- జెహెచ్ఎంసి ఎన్నికల కేసు కొట్టివేత



2 లో..

## నేటి నుంచి తెలంగాణలో టెన్త్ పరీక్షలు

- ఉదయం 9.30 నుంచి ప్రారంభం
- 5 నిముషాల గ్రేస్ పీరియడ్ ప్రకటన
- పక్కాగా ఏర్పట్లు చేసిన విద్యాశాఖ

2 లో..



## వైశ్య కుల గురువు శ్రీ వామన శ్రమ మహా స్వామీజీ 21వ శ్రీ గురు పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు మార్చి 20:** ఆదిలాబాద్ లోని కన్యక పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న వైశ్య కుల గురువు శ్రీ వామన శ్రమ మహా స్వామీజీ 21వ శ్రీ గురు పట్టాభిషేక మహోత్సవం ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొన్నారు, ఈ సందర్భంగా స్వామీజీ వారి పాదాభివందనం చేసి ఆశీర్వాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ. ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉండన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో వైశ్య కులస్తుల పాత్ర అభినందనీయమని పేర్కొన్నారు. దేశంలో ఏ పుణ్యక్షేత్రానికి వెళ్లిన అక్కడ ఆర్యవైశ్యులు నిర్మించిన సత్రాలు కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు

- హరీష్ రావు,మాజీ డిసిపి రాధాకిషన్ రావుల కేసు కొట్టివేత



**హైదరాబాద్,మార్చి20( వెలుతురు):** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీష్ రావు , మాజీ డీసీపీ రాధాకిషన్ రావులకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఫోన్‌టాపింగ్ కేసులో ఎఫ్ఐఆర్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫోన్ టాపింగ్ కేసు నమోదు అయ్యింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు పోలీసులు. మాజీ మంత్రి హరీష్‌రావు, మాజీ డీసీప రాధాకిషన్ రావులను నిందితులుగా చేర్చారు. ఈ కేసులో ఇప్పటికే వాదనలు ముగియగా.. ఈరోజు హైకోర్టు తీర్పు వెలువరించింది. 2 లో..

## మిస్ వరల్డ్ 2025 పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం

- మే 7 నుండి 31వ తేదీ వరకు పోటీలు
- తెలంగాణ ఖ్యతి..పర్యాటకానికి మహర్దశ
- ప్రీ ఈవెంట్ వేడుకల్లో మంత్రి జూపల్లి వెల్లడి



2 లో..

## కంటోన్మెంట్ లో సీసీ రోడ్ల కు శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం

**(రాపర్తి భాస్కర్ గౌడ్) వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, మార్చి 20:**



రాష్ట్ర రాజధాని నగరంకంటోన్మెంట్ నియోజకవర్గంలో ప్రత్యేక అభివృద్ధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకు స్థాపన చేసిన హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్,కలెక్టర్ అనుదీప్ దురశెట్టి , కంటోన్మెంట్ జాయింట్ సీఈవో పల్లవి, ఇతర అధికారులు ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కంటోన్మెంట్ లో 9.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం అభినందనీయమన్నారు,అయితే పనులు వేగంగా ప్రారంభించాలని మంత్రి కోరారు,పెండింగ్ లో ఉన్న కమ్యూనిటీ హాల్స్ ,తాగునీటి సమస్య ,జిఎంఎస్ లోకి తీసుకోవడం. ఇతర సమస్యలు శాసన సభ వేదికగా ముఖ్యమంత్రి దగ్గర ఇతర మంత్రుల దగ్గర ఎమ్మెల్యే గణేష్ చర్చిస్తారని మంత్రి ప్రభాకర్ తెలిపారు,నియోజవర్గ సమస్యలు పట్టించుకున్నప్పుడే మన పనికి సార్థకత ఉంటుందన్నారు,ఆ పనిలో ఎమ్మెల్యే గణేష్ ముందుంటారని మంత్రి తెలిపారు,నియోజకవర్గ సమస్యలు ఎప్పటికీ కప్పుడు పరిష్కారం తీసుకుంటున్నారనీ ఆయన 2 లో..

## ఎస్సీల్లో బుడగజంగం కులం చేరిక



- ఎపి అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం...కేంద్రానికి నివేదిక
- దళితులకు పెద్దపీట వేసిన ఘనత టిడిపిదన్న బాబు

**అమరావతి,మార్చి 20( వెలుతురు):** బుడగజంగం కులాన్ని ఎస్సీలో చేర్చాలంటూ చేసిన తీర్మానాన్ని ఏపీ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. శాసనసభ తీర్మానాన్ని కేంద్రానికి పంపనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని గతంలోనే చెప్పాం.. ఆ మాట నిలబెట్టుకుంటున్నామని చంద్రబాబు అన్నారు. దళితులకు పెద్దపీట గతంలో వేశామని, ఇప్పుడూ అందుకు కట్టుబడి పనిచేస్తున్నా మని వెల్లడించారు. లోక్‌సభ స్పీకర్‌గా 2 లో..

## ఎస్సీవర్గీకరణ హీరోలు మందకృష్ణ, చంద్రబాబు

- వారిద్దరి వల్లనే వర్గీకరణకు న్యాయం దక్కింది
- మందకృష్ణ గుండె ధర్యంతో మాదిగలకు బలం
- ఎస్సీవర్గీకరణ చర్చలో పవన్ కళ్యాణ్

**అమరావతి,మార్చి 20( వెలుతురు):** ఎస్సీ వర్గీకరణ ఈ స్థాయి వరకు వచ్చిందంటే మందకృష్ణ మాదిగ, ఏపీ సీఎం చంద్రబాబు కారణమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదిగ అని చెప్పగలిగే గుండె ధైర్యం 2 లో..



## అధికారం పోయినా ప్రజల్లో అభిమానం పోలేదు

- విషప్రచారంతోనే బిఆర్ఎస్ అధికారం కోల్పోయింది
- అభివృద్ధి పనుల ముందు విషప్రచారమే గెలిచింది
- ప్రజల పక్షాన కొట్లాడుతున్న కార్యకర్తలు వీరులు
- సూర్యాపేట సభలో కెటిఆర్ ప్రసంగం



**సూర్యాపేట,మార్చి20( వెలుతురు):** ఓ సింగర్ చెప్పినట్లుగా...అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమికి అసూయ, ద్వేషం, ఆశ కారణమైనట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మూడింటి వల్లే బీఆర్ఎస్ పార్టీ అనుకున్నన్ని సీట్లు సాధించలేకపోయిందని ఆ సింగర్ చెప్పారని కేటీఆర్ తెలిపారు. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ సభలో కేటీ-ఆర్ పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మెడికల్ కాలేజీలు, దామరచర్ల విద్యుత్ ప్లాంట్, యాదాద్రి ఆలయంతో పాటు- ఎన్నో ప్రాజెక్టులు నిర్మించాం కదా.. ఎందుకు ఓడిపోయామని ఓ సింగర్‌తో అంటే.. ఆయన ఇలా సమాధానం చెప్పారు. అసూయ అంటే అధికార పార్టీలోకి రాగానే ఎమ్మెల్యేలు కొత్త కారు, కొత్త ఇల్లు కట్టుకున్నాడని ప్రచారం చేశారు. ఇది వరకు అంగి లేకుండా తిరిగినట్టు- ఇవాళ కొంత మంది నాయకులు కొత్త అంగి వేసుకున్నట్టు అసూయ పడ్డారు. మరో వైపు ద్వేషం..ఈ రాష్ట్రాన్ని కుటుంబం కోసం తెచ్చినట్టు.. దొర పాలన అని ప్రజల్లో ద్వేషం నిండే విధంగా అగ్ర నాయకత్వంపై ప్రచారం చేశారు. ఇక ఆశ.. కేసీఆర్ పదివేలు ఇస్తుండు.. నేను పదిహేను వేలు వేస్తా.. ఇద్దరికీ పెన్షన్లు ఇస్తా అని ఆశ పెట్టిండు. ఎతుల వెంకట్ రెడ్డి, కోతుల ఉత్తమ్ కుమార్ 2 లో..

## టీజీవోస్, టీజీపిఎస్సి నూతన సంవత్సర డైరి - 2025 ను ఆవిష్కరించిన చైర్మన్ బుర్ర వెంకటేశం ఐఏఎస్

**హైదరాబాద్ వెలుతురు మార్చి 20:** టీజీపిఎస్సి కార్యాలయంలో టీజీవోస్, టీజీపిఎస్సి నూతన సంవత్సర డైరి - 2025 గౌరవ చైర్మన్ బుర్ర వెంకటేశం ఐఏఎస్ గారు ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణలు గౌరవ సభ్యులు అమీరుల్లా ఖాన్, రామమోహన్ రావు, పాల్వాయి రజనీ కుమారి మరియు ఆర్ సుమతి కార్యదర్శి (FAC) గార్లు హజరైనారు, టీజీపిఎస్సి, టీజీవోస్ యూనిట్ కార్యవర్గం హజరైనారు, గండూరి వెంకటేశ్వర్లు హైదరాబాద్ సిటీ ప్రెసిడెంట్, ఎండీ కుయిదుద్దిన్, మల్లికార్జున్, ఎం. రామకృష్ణ, యశోద, సుశీల, ఆంజనేయులు, సత్యనారాయణ, ఇతరులు పాల్గొని డైరీ ఆవిష్కరణ కు గాను గౌరవ చైర్మన్ బుర్ర వెంకటేశం గారికి టీజీవోస్ తరుపున ధన్యవాదములు తెలిపారు

(మొదటి పేజీ తరువాయి..)

## బండి సంజయ్‌కు హైకోర్టులో భారీ ఊరట

**హైదరాబాద్,మార్చి20( వెలుతురు):**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గత జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచార సమయంలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగించారనే ఆరోపణలపై సికింద్రాబాద్ మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయనపై ఛార్జ్‌షీట్ కూడా దాఖలైంది. అయితే, తగిన ఆధారాలులేవన్న కారణంతో హైకోర్టు ఈ కేసును కొట్టివేసింది. జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా బీజేపీ నాయకుడు బండి సంజయ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని కొందరు వ్యక్తులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుతో స్పందించిన సికింద్రాబాద్ మార్కెట్ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేసి, విచారణ అనంతరం ఛార్జ్‌షీట్ కూడా దాఖలు చేశారు. బండి సంజయ్‌పై నమోదైన కేసు హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా బండి సంజయ్ తరఫున న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. బండి సంజయ్ మత విద్వేషాలను రెచ్చగొట్టారని నిరూపించే ఆధారాలు లేవని న్యాయవాది వాదించారు. ఆధారాలు లేకుండా రాజకీయం చేయడానికి కేసు నమోదయ్యిందని కోర్టుకు వివరించారు. కేవలం రాజకీయ కారణాల రీత్యా ఈ కేసును పెట్టారని, న్యాయపరంగా దీని ఆధారభూతతను పరిశీలించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ వాదనలను పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి, బండి సంజయ్‌పై నమోదు చేసిన కేసులో తగిన ఆధారాలు లేవని తేల్చారు. ఎలాంటి నేరపూరిత ప్రకటనలు లేకుండా కేసు నమోదు చేయడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించింది.అన్ని వాదనలు పరిశీలించిన తర్వాత, బండి సంజయ్‌పై నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. తగిన ఆధారాలేకుండా నేరపూరిత ఉద్దేశంతో కేసు నమోదు చేయడం సరికాదని కోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పుపై బండి సంజయ్ అనుచరులు హర్షం వ్యక్తం చేశారు. ఇది రాజకీయ కక్ష సాధింపుకు నిదర్శనమని, న్యాయం గెలిచిందని బీజేపీ నేతలు పేర్కొన్నారు.

## నేటి నుంచి తెలంగాణలో టెన్త్ పరీక్షలు

**హైదరాబాద్,మార్చి20( వెలుతురు):**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శుక్రవారం మార్చి 21నుంచి ప్రారంభంకానున్నాయి. మార్చి 21న ప్రారంభమై ఏప్రిల్ 4 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇంటర్మీడియట్ పరీక్షల మాదిరి పదో తరగతి పరీక్షలకు కూడా ఐదు నిమిషాల గ్రేస్‌-టైం ఇస్తున్నట్లు- విద్యాశాఖ ప్రకటించింది. అంటే ఉదయం 9:30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుండగా.. 9:35 వరకు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతిస్తామని, ఆ తర్వాత వచ్చే విద్యార్థులను మాత్రం ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు. ఇప్పటికే హాల్‌టికెట్లు విడుదల చేశామని, విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,650 సెంటర్లను ఏర్పాటు- చేశారు. మొత్తం 5, 09,403 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయబోతున్నట్లు- తెలిపారు. కాంపోజిట్ పేపర్లకు పరీక్షాసమయం మాత్రం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:50 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఏడాది తొలిసారిగా పదో తరగతి విద్యార్థులకు 24 పేజీల బుక్‌లెట్‌ను ఇస్తున్నారు. విద్యార్థులు ఆ బుక్‌లెట్‌లోని పేజీల్లోనే అన్సర్లు రాయాల్సి ఉంటుంది. అడిషనల్ కావాలంటే కూడా ఇస్తారు. పేపర్లు లీకేజీని అరికట్టేందుకు ప్రశ్నపత్రాలపై మొదటి సారిగా క్యూఆర్ కోడ్‌ను ముద్రిస్తున్నారు. అలాగే తొలిసారిగా ఒక్కో పేపర్‌పై ఒక యూనిక్ నంబర్‌ను సైతం ముద్రిస్తున్నారు. ఈ యూనిక్ నంబర్ ప్రశ్నపత్రంలోని అన్ని పేజీలపై ఉంటుంది. ఇక సైన్స్‌లో భౌతికశాస్త్రం, జీవశాస్త్రం పేపర్లకు పరీక్షలను వేర్వేరుగా రెండు రోజుల్లో నిర్వహిస్తారు. ఈ రెండు పరీక్షలను ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకే పరీక్ష జరుగుతుంది. గణిత పరీక్ష రోజున గ్రాఫ్ పేపర్ విడిగా ఇస్తారు. సీఎస్‌డీవో గదుల్లో సీసీ కెమెరాల నిఘాలోనే ప్రశ్నపత్రాల బండిట్స్ తెరుస్తారు. పరీక్షలకు సంబంధించి ఏమైనా సమస్యలు, సందేహాలుంటే 040-23230942 అనే ఫోన్ నంబరుకు ఫోన్ చేసి చెప్పాలని, అందుకు ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశామని అన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు

ఫోన్ ట్యాపింగ్ కేసును కొట్టివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు అయిన విషయం తెలిసిందే. పంజాగుట్ట పీఎస్‌లో నమోదైన రెండో ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలంటూ తెలంగాణ హైకోర్టులో హరీష్ రావు, రాధాకిషన్‌రావు వేసిన పిటిషన్‌పై సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. ఈ క్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదుపై పంజాగుట్ట పోలీసులు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేస్తూ న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఎఫ్ఐఆర్‌లో హరీష్‌రావుతో పాటు- రాధాకిషన్‌రావును నిందితులుగా చేర్చారు. ఇప్పటికే ఇరు వాదనలు పూర్తవడంతో తీర్పును వెలువరించింది న్యాయస్థానం. ఇద్దరిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తెలంగాణ హైకోర్టు కీలక తీర్పును వెల్లడించింది. అధికారంలో ఉన్న సమయంలో తన ఫోన్‌ను ట్యాప్ చేసి.. తనను ఇబ్బందులకు గురిచేశారని.. వారి వల్ల తనకు ప్రాణహానీ ఉందంటూ రియల్‌ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ కొంతకాలం క్రితం మీడియాతో మాట్లాడారు. చక్రధర్ ఇచ్చిన సమాచారం, ఆయన ఇచ్చిన ఎవిడెన్స్‌ను ఆధారంగా చేసుకుని పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ అందులో సరైన ఆధారాలు లేవని హరీష్ రావు తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. హరీష్‌రావు, రాధాకిషన్ వాదనలతో ఏకభవించిన హైకోర్టు.. పంజాగుట్టలో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది.

## కంటోన్మెంట్ లో సీసీ రోడ్ల కు శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం



పేర్కొన్నారు,హైదరాబాద్ మున్సిపాల్టీ ,మెట్రో వాటర్ వర్క్స్ నుండి ఎన్ని కావాలన్న వాటర్ ఇవ్వడానికి రెడీ గా ఉన్నామన్నారు, ఇది కంటోన్మెంట్ లో ఉండడం వల్ల స్టోరేజ్ కి తక్కువగా అవకాశం ఉంది మెట్రో వాటర్ వర్క్స్ ,కంటోన్మెంట్ అధికారులు కలిసి సమస్య పరిష్కారం చేద్దామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు,ఎమ్మెల్యే గణేష్ అడిగిన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి తరుపున 5 కోట్లు మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు,తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదన్నారు, 9.40 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జూన్ లోపు కంప్లీట్ చేయాలన్నారు,నేను చాలా సంవత్సరాలు కంటోన్మెంట్ లో ఉండేది.మా పిల్లలు ఇక్కడే చదువుకున్నారు,ఈ ప్రాంత అభివృద్ధికి ప్రజా పాలన ప్రభుత్వం కట్టుబడి ఉందనీ చెప్పారు,200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం ఈ నియోజకవర్గం లో  3500 ఇళ్లు మంజూరు చేశామనీ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు,ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ లకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా అప్లికేషన్ లు పెట్టుకోండి అంటూ మంత్రి యువకులకు విజ్ఞప్తి చేశారు, ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,సన్న వడ్ల కు 500 బోనస్ ,500 గ్యాస్ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు, టెన్త్ విద్యార్థులకు శుభాకాంక్షలు: మంత్రి పొన్నం రేపటినుండిపదవతరగతిపరీక్షలు జరుగుతున్నాయి,358 కేంద్రాలు హైదారాబాద్ జిల్లాల్లో ఉన్నాయి ఇది జీవితంలోకీలకం..తల్లిదండ్రులు సీరియల్ లు బంద్ చేయండి అని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు, ఎక్కడైనా పదవ తరగతి మార్కుల కీలకం ,ఎస్ ఎస్ సి పరీక్షలు రాసే విద్యార్థిని విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం పక్షాన శుభాకాంక్షలను మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు, అందరూ పరీక్షలు బాగా రాయాలి.. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశాం.. మీ ఉజ్వల భవిష్యత్కిఇదేప్రారంభం.. డ్రింకింగ్ వాటర్ లైటింగ్ ఏ ఇబ్బందీ రాకుండా చర్యలు తీసుకుంటున్నాం కంటోన్మెంట్ కి అండగా ఉంటాం..  వారి సమస్యలు పరిష్కారం చేస్తాం.. ప్రభుత్వం ప్రజా రంజక బడ్జెట్ ప్రవేశపెట్టింది,బడ్జెట్ లో అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చింది.. బడ్జెట్ పై ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితమనీ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు,

# ఏడాదిలోనే 59వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మాది

అంటున్నారు.. రైతు రుణ మాఫీ చేసినందుకు నాపై కోపంగా ఉన్నారా..? మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినందుకు కోపంగా ఉన్నారా..? మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ప్రయత్నం చేస్తున్నందుకు కోపంగా ఉన్నారా..? 59 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చినందుకు నాపై కోపంగా ఉన్నారా..? దేనికి ప్రజలు నాపై కోపంగా ఉంటారంటూ ప్రతిపక్షాలపై మండిపడ్డారు. అలాగే.. రేవంత్ రెడ్డికి పాలన మీద పట్టు రాలేదంటూ వస్తోన్న విమర్శలపైన ఆయన స్పందించారు. రేవంత్ రెడ్డికి పాలనపై పట్టు రాలేదని కొందరు అంటున్నారు. రాజయ్యను కారణం లేకుండా మంత్రి పదవి నుంచి తొలగిస్తే పట్టు వచ్చినట్టా..? సచివాలయానికి రోజు వెళ్లకపోతే పట్టు- వచ్చినట్టా అని ప్రశ్నించారు. ఏమి తెలియకుండానే ఈ స్థాయికి వచ్చానంటారా..? నల్లమల్ల నుంచి వచ్చా.. మానవ మృగాలు ఎలా ఉంటాయో నాకు తెలియదా అని హాట్ కామెంట్స్ చేశారు. కాకపోతే సీఎం అనేటోడికి విజ్ఞత ఉండాలని.. అందుకే నేను విజ్ఞతతో ప్రవర్తిస్తున్నానని అన్నారు. అందుకే ఇవాళ సామాన్యుడు కూడా సెక్రటేరియట్‌కు వస్తున్నారన్నారు. నేను ఆదేశాలు ఇస్తే కేటీఆర్ ఈపులు పగొలగొట్టరా..? కోదండరామ్ ఇంటి తలుపులు పగలగొట్టినోళ్లు కేటీఆర్ ఇంటి తలుపులు పగలకొట్టడం ఎంతసేపు.. వాళ్లలాగే మేం అణిచివేయాలనుకుంటే ఎంతసేపు అని హాట్ కామెంట్స్ చేశారు. ఇకపోతే టిటిడి వ్యవహారంపైనా ఘాటు వ్యాఖ్యలు చేశారు. వారికి టిటిడి ఉంటే మనకు వైటిడి, భద్రాద్రి ఉందన్నారు. వాళ్లను బతిలాడి దర్శనం కోసం పాకులాడాలా అని అన్నారు. మకు ఇక్కడ శివాలయాలు తక్కువా అని అన్నారు. మిస్ ఇండియా పోటీలు నిర్వహిస్తే కెటిఆర్‌కు వచ్చిన నొప్పేందని అన్నారు. ఫార్ములా కేసులోకోట్లు కొల్లగొట్టిన నీకు నాపై మాట్లాడే అర్హత లేదన్నారు. మిస్ ఇండియా పోటీలతో 3వేల ఛానల్స్ వస్తున్నాయని, ఫుడ్ ఇండస్ట్రీకి పెద్ద పండగని అన్నారు. కెసిఆర్ మందు డోర్ డెలివరీ చేస్తే..నేను ఇసుక డెలివరీ చేస్తున్నా..జానారెడ్డి లాంటి వారిని అవమానించారు. సిఎం అయినంత మాత్రాన టెంపర్ మారదని రేవంత్ స్పష్టం చేశారు.

# మిస్ వరల్డ్ 2025 పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం

(మొదటి పేజీ తరువాయి..)

**హైదరాబాద్,మార్చి20( వెలుతురు):**

హైదరాబాద్ మిస్ వరల్డ్ 2025 పోటీలకు ఆతిథ్యమిచ్చేందుకు సిద్ధమవుతోంది. మే 7 నుండి 31వ తేదీ వరకు జరగనున్న ఈ అంతర్జాతీయ అందాల పోటీల్లో సుమారు 140 దేశాలకు చెందిన అందాల భామలు పాల్గొనబోతున్నారు. తెలంగాణను అంతర్జాతీయంగా గుర్తింపును తెచ్చే ఈ వేదిక, రాష్ట్ర పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయనుంది. ఈ పోటీల సందర్భంగా, మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే అందాల భామలు మే నెలలో తెలంగాణలోని పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్నారు. తెలంగాణ సంస్కృతి, వారసత్వ సంపద, అభివృద్ధిని వీరు ప్రపంచానికి తెలియజేయనున్నారు. మిస్ వరల్డ్ పోటీలపై మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. మిస్ వరల్డ్ పోటీని హైదరాబాద్‌లో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు.ఈక్రమంలో బేగంపేట్ టూరిజం ప్లాజాలో గురువారం మిస్ వరల్డ్ పోటీలకు చెందిన ప్రీ ఈవెంట్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, టీ-జీటీడీసీ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, టూరిజం సెక్రటరీ స్మితా సబర్వాల్, మిస్ వరల్డ్ లిమిటెడ్ సీఈఓ జూలియా మోర్లీ, 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ పోటీలకు 140 దేశాల నుంచి అందాల భామలు వస్తారని తెలిపారు. ఇది మహిళా సాధికారతకు అద్దం పట్టే సంబరాలు అని, ప్రపంచ దేశాల నుంచి రాబోయే అతిథులకు తెలంగాణ సంస్కృతిని పరిచయం చేసేందుకు ఇదొక గొప్ప అవకాశం అని ఆయన వ్యాఖ్యానించారు. హైదరాబాద్ ఇప్పటికే ధనిక నగరాల్లో ఒకటిగా పేరు తెచ్చుకుంది, ఈ పోటీలతో అంతర్జాతీయంగా మరింత గుర్తింపు పెరుగుతుందని అన్నారు. తెలంగాణ కొత్త రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ప్రపంచ వేదికపై తక్కువగా ప్రాచుర్యం పొందింది. కానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్‌తో మిస్ వరల్డ్ 2025 పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు అవకాశం లభించింది. ఇది రాష్ట్రం యొక్క బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు సహాయపడనుంది. కొంతమంది ఈ ఈవెంట్‌ను రాజకీయ కోణంలో చూస్తున్నా, ఇలాంటి అంతర్జాతీయ వేడుకలు రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు, తెలంగాణ సంపదను ప్రపంచానికి పరిచయం చేయడానికి ఉపయోగపడతాయని మంత్రి స్పష్టం చేశారు. ఈ పోటీల్లో పాల్గొనే వారితో పాటు వేలాది మంది దేశ విదేశాలకు చెందిన వారు తెలంగాణకు వస్తారని అన్నారు. ఈ వేదిక వల్ల నిరంతరంగా పర్యాటక రంగానికి సంబంధించి రాబడి పెరుగుతుందని తెలిపారు. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించగలమని అన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు రూ.54 కోట్లు పెట్టు-బడి పెట్టామని చెప్పారు. అందులో సగమే ప్రభుత్వం కేటాయిస్తుందని..మరో సగం ప్రమోటర్‌ల నుంచి సేకరిస్తామని స్పష్టం చేశారు. ఇది చరిత్రాత్మక కార్యక్రమమని.. సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణ నెలవు అని వ్యాఖ్యానించారు. మహిళల అంతః సౌందర్యాన్ని సెలబ్రేట్ చేయడం మిస్ వరల్డ్ పోటీ-ల ఉద్దేశమని అన్నారు. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పదని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. తెలంగాణలో మహిళలకు అన్ని రంగాల్లో ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ప్రపంచానికి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారం, పర్యాటక అందాలను తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పుకొచ్చారు. సౌత్ కొరియా స్క్విడ్ గేమ్, బీటీ-ఎస్ బ్యాండ్ లాంటివి దేశ ఎకానమికి ఎంతో ఉపయోగపడ్డాయని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ పేరు ప్రఖ్యాతులతో పాటు- ఆర్థికంగానూ వృద్ధి సాధిస్తుందని భావిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, ప్రపంచ స్థాయి పెట్టు-బడులు ఆకర్షించేందుకు ఇది మంచి అవకాశమని తెలిపారు రాష్ట్ర ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. ఈ అందాల పోటీ-లను మహిళా సాధికారతకు ప్రతీకగా చూడాలని చెప్పారు. ప్రభుత్వాన్ని విమర్శించేందుకు, రాజకీయ కోణంలో ఈ పోటీలను చూడటం సరికాదని మంత్రి జూపల్లి కృష్ణారావు హితవు పలికారు. బేగంపేట్ టూరిజం ప్లాజాలో ఇవాళ జరిగిన ప్రీ ఈవెంట్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా పాల్గొని సందడి చేశారు. నమస్తే ఇండియా అంటూ 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా పలకరించింది. అతిథులు చాలా గొప్పగా స్వాగతం చెప్పారని అన్నారు. తన ప్రయాణంలో, తన హృదయంలో భారతదేశానికి చాలా ప్రాధాన్యత ఉందని తెలిపారు. భారత కల్చర్, ఆర్ట్స్ చాలా గొప్పగా ఉంటాయని వివరించారు. భారతదేశం చాలా ఇన్‌స్పైరింగ్ అని తెలిపారు. భారత్ విలువలను బోధిస్తుందని.. భిన్నత్వంలో ఏకత్వానికి ఎంతో గొప్ప భావన ఉందని చెప్పుకొచ్చారు. ఎన్నో భాషలు ఉన్నా అంత ఒక్కటిగా ఉండటం భారతదేశం స్ఫూర్తి అని తెలిపారు. మిస్ వరల్డ్ పోటీ-లు కూడా అంతే భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని చెప్పారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించడం మంచి అనుభూతిని ఇచ్చిందని క్రిస్టినా పిజ్కోవా పేర్కొన్నారు. తెలంగాణ త్రిలింగ దేశంగా ప్రాముఖ్యత కలిగిందని తెలంగాణ పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్ తెలిపారు. ఈ ప్రాంతానికి 2500 ఏళ్ల చరిత్ర ఉందని ఉద్ఘాటించారు. రాష్ట్రం ఏర్పడిన 11 ఏళ్లలో ఎంతో వృద్ధి సాధించామని చెప్పారు. రామప్ప, వేయి స్థంభాల ఆలయం, చార్మినార్, గోల్కొండ కోట లాంటి ఎన్నో గొప్ప కట్టడాలు ఇక్కడ ఉన్నాయని అన్నారు. మే నెలలో జరుగనున్న మిస్ వరల్డ్ పోటీ-లను తెలంగాణ సంస్కృతి ప్రతిభింభించేలా నిర్వహించనున్నామని చెప్పారు. మెడికల్ టూరిజంలో తెలంగాణకు ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. సినిమా, ఆహార రంగాల్లో తెలంగాణకు పెట్టింది పేరని చెప్పారు. అత్యంత సురక్షిత పర్యాటక ప్రాంతం తెలంగాణ అని స్మితా సభర్వాల్ పేర్కొన్నారు.

# ఎస్సీల్లో బుడగజంగం కులం చేరిక

బాలయోగిని, అసెంబ్లీ స్పీకర్‌గా ప్రతిభా భారతిని చేశామని, ఆ ఘనత తెలుగుదేశం పార్టీదని అన్నారు. అసెంబ్లీలో ఆయన ఎస్సీ వర్గీకరణపై మాట్లాడారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే సమస్య పరిష్కారం అవుతుందని గతంలోనే చెప్పాను. జిల్లాల వారీగా కేటగిరి విభజన చేయాల్సి ఉంటుంది. జనగణన తర్వాత మరోసారి జిల్లాల వారీగా కేటగిరిల విభజన చేసేందుకు సిద్ధంగా ఉన్నాం అన్నారు. ఏబీసీడీ కేటగిరి విభజన కోసం 1996లో కమిటీ- వేశాం. ఉమ్మడి ఏపీలో రేషనలైజేషన్, కేటగిరిలపై 2000 సంవత్సరంలో చట్టం చేశాం. ఆ చట్టాన్ని కోర్టు కొట్టివేసింది. ఎస్సీ వర్గీకరణ జరగాల్సిందే నని ఉషా మెహ్రా కమిషన్ నివేదిక ఇచ్చింది. స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్లపై కూడా కమిటీ- అధ్యయనం చేసింది. ఎస్సీ వర్గీకరణ సాకారం కావడంలో నా ప్రయాణం కూడా సుదీర్ఘంగా సాగింది. మొదట కమిటీ- వేసినప్పటి నుంచి సుప్రీంకోర్టు తీర్పు వచ్చేవరకు ఉండటం నా అదృష్టం. సామాజిక న్యాయం కోసం పరితపించిన మహనీయుడు ఎన్టీఆర్. పేదల కోసం శాశ్వత గృహనివాస పథకం తీసుకొచ్చిన మొదటి వ్యక్తి ఆయన. ఎస్సీల పట్ల వివక్ష ఇంకా కొనసాగుతుండటం బాధాకరం. అంటరానితనం నిషేధానికి జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను నేనే వేశా. అంటరానితనం రూపుమాపడానికి ఎన్నో జీవోలు జారీ చేశాం. ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి ఎస్సీ, ఎస్టీ సెల్ ఏర్పాటు చేశాం. హోటళ్లు, మంచినీటి బావుల వద్ద వివక్ష పాటించకుండా చట్టపరంగా చర్యలు తీసుకున్నాం. సాంఘిక సమానత్వంపై ఎన్నో అవగాహన సదస్సులు నిర్వహించాం అని వివరించారు. లోక్‌సభ స్పీకర్‌గా ఒక దళితుడిని చేసిన పార్టీ తెలుగుదేశం అంటూ.. స్పీకర్‌గా బాలయోగి ఎంతో బాగా రాణించారు. దళిత మహిళ ప్రతిభాభారతిని స్పీకర్ చేసిన ఘనత కూడా తెలుగుదేశానిదేనన్నారు. ఎస్సీ అయిన కాకి మాధవరావును రాష్ట్ర సీఎస్‌గా చేసింది తెదేపానే. నేను యునైటె-డ్ ఫ్రంట్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఎస్సీ అయిన కేఆర్ నారాయణన్‌ను రాష్ట్రపతిని చేశాం. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కూడా ఎస్సీ, ఎస్టీలకు కీలక పదవులు ఇచ్చింది. గతంలో ఎస్సీ అయిన రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిగా చేశారు. ఇప్పుడు ఎస్టీ అయిన ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతిగా చేసిందని అన్నారు. ఎస్సీ కోసం రూ.8,400 కోట్లతో ఆర్థిక చేయూత పథకాలు తీసుకువచ్చాం. గతంలోనూ మాల, మాదిగ సామాజిక వర్గాలకు దామాషా ప్రకారం నిధులు కేటాయించాం. ఎస్సీ వర్గీకరణకు కట్టు-బడి ఉన్నా. నా రాజకీయ జీవితమంతా పేదలకు న్యాయం చేసేందుకే కృషి చేశాను. ఎస్సీ వర్గీకరణ అంశంలో మాకు సహకరించిన పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నా. రాష్ట్రంలో మౌలిక వసతులు పెంచేందుకు గతంలో పీపీపీ విధానం తీసుకువచ్చాను. కొత్తగా ఈ నెలలో పీ4 విధానం తీసుకురానున్నాం. ఆర్థికంగా బాగున్న వారు సమాజానికి ఎంతోకొంత తోడ్పాటు నందించాలి. పేదరికంలో ఉన్న 30లక్షల కుటు-ంబాలను దత్తత తీసుకునే ఏర్పాట్లు- చేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు.

## అధికారం పోయినా ప్రజల్లో అభిమానం పోలేదు



రెడ్డి ఆశలు పెట్టి మోసం చేశారు. కాంగ్రెసోడు, బీజేపోడు అభివృద్ధి గురించి మాట్లాడలేదు. మెడికల్ కాలేజీ, ఎస్పీ ఆఫీసు గురించి మాట్లాడలేదు. కొత్త మండలాలు, కొత్త గ్రామ పంచాయతీల గురించి చెప్పలేదు. అసూయ, ద్వేషం, ఆశ నింపి ఓడగొట్టారని కేటీఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో భూముల ధరలు పెరిగాయి. దాంతో అందరి సంపద పెరిగింది. టీఆర్ఎస్ సంపద పెరగొద్దు.. కానీ కాంగ్రెస్, బీజేపీ సంపద పెరగాలట. కేసీఆర్ దొర అని యూట్యూబ్‌లో పనికిమాలిన చెత్త మాట్లాడి తిట్టని తిట్లు- తిట్టి విషప్రచారం చేసి అధికారంలోకి వచ్చిండు. ఇవాళ అదే యూట్యూబ్ వాళ్లను గుడ్డలుడదీసి కొడుతాడట. ఆయన కాడికి వస్తే అన్ని గుర్తుకు వస్తున్నాయి. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిండు రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలుగువారి ఆత్మ గౌరవాన్ని దేశానికి చాటింది మొదట ఎన్టీఆర్.. ఆ తరువాత కేసీఆర్ అని తెలిపారు. గులాబీ జెండా లేకపోతే తెలంగాణ రాష్ట్రమే లేదు అని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీగా కూడా సమర్థవంతంగా నిలబడింది.. విజయవంతంగా ఉద్యమం, సమర్థవంతమైన పాలన అందించింది బీఆర్ఎస్ పార్టీ.. తమ పాలన తెలంగాణ రాష్ట్రానికి అవసరం.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తరువాత బీఆర్ఎస్ పని అయిపోయిందని మాట్లాడుతున్నారని కేటీఆర్ అన్నారు. అయితే, బీఆర్ఎస్ పార్టీకి పోయింది అధికారమే.. ప్రజల అభిమానం కాదు అని కేటీ-ఆర్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణకు ఏనాటికైనా శత్రువే.. బీజేపీ నేతలు సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడరు.. కిషన్ రెడ్డి, బండి సంజయ్ రేవంత్ పై ఈగ వాలకుండా కాపాడుతున్నారని ఆయన ఆరోపించారు. బండెనక బండి కట్టి.. ఏప్రిల్ 27న వరంగల్ సభకు ప్రజలు కదిలి రావాలి.. అసెంబ్లీ లో జగదీష్ రెడ్డి మంట్లడిందాంట్లో తప్పులేదు.. స్పీకర్ కు కులం ఆపాదించడం దురదృష్టకరం.. గడ్డం ప్రసాద్ స్పీకర్ కావాలని బీఆర్ఎస్ పోటీ కూడా పెట్టలేదు.. అసెంబ్లీనీ గాంధీభవన్ తో పోల్చిన ఎంఐఎంపై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్ కు లేదు అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను, జగదీశ్ రెడ్డి పదేండ్లు మంత్రిగా పని చేశాం. ఇక్కడున్న వారిలో చాలా మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు.. ఇలా రకరకాల పదవులు వచ్చాయి. ఇవాళ బీఆర్ఎస్ పార్టీ కొట్లాడుతున్నది మన కోసం కాదు.. ప్రజల కోసం. టీ-ఆర్ఎస్ పుట్టు-క చరిత్రలో అనివార్య పరిస్థితిలో వచ్చింది. ఇవాళ కూడా బీఆర్ఎస్ అధికారం కోరుకోవడం.. తెలంగాణకు చారిత్రక అవసరం. కర్కశ కాంగ్రెస్ పాలన పీడ వదిలించుకోవాలంటే గులాబీ జెండాతోని అయితదని ప్రజలు గుర్తించారని కేటీ-ఆర్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒక్క సూర్యాపేట గెలిచింది. పార్లమెంట్‌లో ఓడిపోయాం. చాలా మంది అన్నారు అయిపోయింది వీళ్ల పని అని. పార్టీ మూతపడుతది అని మాట్లాడారు. ఒక ఫినిక్స్ పక్షిలాగా ఆకాశాన్ని అందుకునే విధంగా అద్భుతంగా తన పోరాట పటిమతో ముందుకు సాగుతదో.. అదే విధంగా ఇవాళ కదం తొక్కి అటు- కాంగ్రెస్‌కు, ఇటు- బీజేపీకి కాళరాత్రులు చూపెడుతున్న మీ అందరికి శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నాం. మేం ఒక్క నిరసనకు పిలుపునిస్తే కేసులు పెట్టినా భయపడకుండా పోరాడుతున్న మీ అందరికీ హృదయపూర్వకంగా మనస్కారం చేస్తున్నా. మీరు గొప్ప పోరాటం చేస్తున్నారు అని కేటీఆర్ ప్రశంసల వర్షం కురిపించారు. సమావేశంలో జగదీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీవర్గీకరణ హీరోలు మందకృష్ణ, చంద్రబాబు

కలిగిన వ్యక్తి మందకృష్ణ. ఆ కులానికి వన్నె తెచ్చిన ఆయనను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై చాలా చర్చలు జరిగాయి. గుర్తింపు లేని కులాలపైనా విస్తృతంగా చర్చలు జరిగాయి. సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టి రాజీవ్ రంజన్ మిశ్రాతో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశారు. కమిషన్ ఇచ్చిన నివేదిక చాలా అద్భుతంగా ఉంది. ఇది అందరికీ మేలు చేస్తుందని ఆశిస్తున్నట్లు పవన్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ చేసిన చంద్రబాబుకు పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో అందరికీ మేలు జరుగుతుందని ఆశిస్తున్నట్లు- ఆయన తెలిపారు. మాదగ కులానికి వన్నె తెచ్చిన మందకృష్ణకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై చాలా చర్చలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. అసమానతలపై ఇంకా పోరాటం చేయాల్సి ఉందన్నారు. సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. వర్గీకరణపై ఇచ్చిన మాట సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని అన్నారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ.. కమిషన్ నివేదిక ప్రకారం జిల్లాల వారీగా దామాషా ప్రకారం రిజర్వేషన్ విధానం అమలు చేయాలని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు చొరవతో దళితులు అగ్రపథాన నిలిచారని గుర్తు చేశారు. దళిత వాడల్లో సంపద సృష్టి జరిగిందని వివరించారు. 800 ఎకరాలు దళితుల భూములు ఇడుపులపాయ ఎస్టేట్‌లో జగన్‌రెడ్డి కుంటుంబం ఆక్రమించుకుందని ఆయన ఆరోపించారు. టీడీపీ మరో ఎమ్మెల్యే కొండ్రు మురళీ మోహన్ మాట్లాడుతూ.. జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఎస్సీలకు సంబంధించిన అనేక పథకాలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ కోసం టీడీపీ మొదటి నుంచీ కట్టు-బడి ఉందని ఆయన గుర్తు చేశారు. అంతకుముందు ఎస్సీ వర్గికరణపై ఏక సభ్య కమిషన్ నివేదికను మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి ఉభయ సభల ముందు ప్రవేశపెట్టారు. దీనిపై స్వల్పకాలిక చర్చ జరిగింది. అందులోభాగంగా ఈ అంశంపై సీఎం చంద్రబాబు నాయుడితోపాటు- డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ తదితరులు సభలో మాట్లాడారు.

## ఉపాధి హామీ పని పట్టణ ప్రాంతాలకు పెట్టడానికి బడ్జెట్లో నిధులు కేటాయించాలి

- ఇండ్ల స్థలాలకు కొనుగోలుకు సామాజిక పెన్షన్ 4000 లకు మహిళలకు 2500 బడ్జెట్లో నిధులు కేటాయించాలి



**హైదరాబాద్ వెలుతురు మార్చి 20:** ఆర్భాటంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు లక్షల 49 65 కోట్లతో రాష్ట్ర బడ్జెట్ లో పట్టణ ప్రాంతాలకు ఉపాధి పనిని విస్తరింపజేసి 150 రోజుల పని కలిగిస్తామని సామాజిక పెన్షన్లు 2000 నుండి 4 వేలకు పెంచుతామని ఇండ్ల స్థలాలు లేని పేదలకు భూములు కొని ఇస్తామని కౌలు రైతులకు 15000 రైతు భరోసా ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానంలో అమలు గురించి బడ్జెట్లో ప్రస్తావించలేదు ఈ బడ్జెట్ను సవరించి 6 గ్యారంటీల అమలుకు పేదల సంక్షేమానికి బడ్జెట్ ప్రతిపాదనల పెట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య ఒక ప్రకటనలో కోరారు వ్యవసాయ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని బడ్జెట్లో సవరణలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు భూమి లేని వ్యవసాయ కూలీలకు నిధులు పెంచాలన్నారు గృహ నిర్మాణానికి మరిన్ని నిధులు కేటాయించాలని రాష్ట్రంలో లక్షలాదిమంది పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని బడ్జెట్లో వారి ప్రస్తావనే లేదని ఉపదామి చట్టాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరింప చేయాలని 150రోజులు పనులు కల్పించి రోజుకు 400 రూపాయల వేతనం ఇవ్వాలని ఇది కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం అని ఆయన అన్నారు బడ్జెట్లో సవరణ చేసి వ్యవసాయ కార్మికులకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు



**విద్వేషపూరిత ప్రసంగం కేసులో హైకోర్టు లో బండి సంజయ్ కి ఊరట**

**జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా విద్వేష పూరిత ప్రసంగం చేశారంటూ కేసు నమోదు చేసిన పోలీసులు**

**కేసు ను కొట్టివేస్తూ తుది తీర్పు ఇచ్చిన హైకోర్టు**

హైదరాబాద్ వెలుతురు మార్చి 20:

## ఫుడ్స్ కార్పొరేషన్ అధికారులతో చైర్మన్ సమీక్ష సమావేశం



**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, మార్చి 20:** తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ అధికారులతో చైర్మన్ ఎం.ఏ. ఫహీమ్ గురు వారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించారు.నాచారంలోని తెలంగాణ ఫుడ్స్ కార్యాలయంలో ఎండి చంద్రశేఖర్ రెడ్డి తో కలిసి తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ ఎం.ఏ. ఫహీమ్ సమీక్ష సమావేశం నిర్వహించి.అధికారులకు పలు సూచనలు సలహాలను చేశారు. ఇటీవల జిల్లాల్లోని పలు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన సందర్భంగా.. అక్కడి పరిస్థితులు, గర్భిణీ స్త్రీలకు, చిన్నారులకు అందించే బాలామృత్రం తయారీకి సంబంధించి నాణ్యతల గురించి చర్చించారు.ఈ సమీక్ష సమావేశంలో తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ కు సంబంధించిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

## చేనేత రంగానికి ఈ బడ్జెట్ లో 371 కోట్ల రూపాయలు

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, మార్చి 20:** రాష్ట్రంలోని చేనేత, మరమగ్గాల కార్మికుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం చేనేత అభయ హస్తం పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు,ఈ పథకం ద్వారా తెలంగాణ నేతన్న పొదుపు (పొదుపు నిధి), తెలంగాణ నేతన్న భద్రత (నేతన్న బీమా), తెలంగాణ నేతన్నకు భరోసాలను అమలు చేస్తున్నామనీ భట్టి పేర్కొన్నారు, ఈ బడ్జెట్ లో చేనేత రంగానికి 371 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు,విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యం. ముఖ్యంగా, పేద మరియు వెనుకబడిన తరగతులకు చెందిన పిల్లల సురక్షిత భవిష్యత్తుకి విద్య ఒక దారినిచూపుతుంది.డా.బి.ఆర్.అంబేద్కర్ కలలు కన్న విద్యావ్యవస్థను మేము సృష్టించబోతున్నాము. దీనికోసమే రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 58 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి 11,600 కోట్ల రూపాయలుకేటాయించి అనుమతులు మంజూరు చేయడం జరిగిందని భట్టి విక్రమార్క చెప్పారు, మేము తీసుకున్న ఈ నిర్ణయం ఒక చారిత్రాత్మకం. ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒక యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ను ప్రారంభిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు,

# బిల్డ్ నౌ ద్వారా సత్వర సేవలు

- సీఎం రేవంత్ రెడ్డి

- రవీంద్ర భారతి లో జరిగిన కార్య క్రమం లో బిల్డ్ నౌ పోస్టర్ల ను ఆవిష్కరించిన సీఎం, ఇతరులు

(రాపర్తి భాస్కర్ గౌడ్)




**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, మార్చి 20:** గత పదేళ్ల కాలంలో బాధ్యత లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఉత్పన్నమైన సమస్యలను తమ ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకు వెళుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. సంక్షేమం, అభివృద్ధితో పాటు పారదర్శకమైన "తెలంగాణ మోడల్" పరిపాలన అందించడం తమ ధ్యేయమని స్పష్టం చేశారు. భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతుల మంజూరులో పూర్తి ఆన్‌లైన్‌లో సత్వర సేవలను అందించే విధంగా మున్సిపల్ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన బిల్డ్‌నౌ పోర్టల్‌ను రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. తర్వాత నగరంలో ఇంటి నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ముగ్గురికి ఈ సందర్భంగా అనుమతి పత్రాలను అందించడం ద్వారా బిల్డ్‌నౌ సేవలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, పూర్తి పారదర్శకంగా సమాజంలో పెద్ద చిన్న అన్న తారతమ్యం లేకుండా అందరికీ సమాన, సత్వర సేవలు అందించాలన్న లక్ష్యంతో భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతులకు ఆన్‌లైన్ ద్వారా అందించాలన్న ఉద్దేశంతో ఈ పోర్టల్ తీసుకొచ్చినట్టు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. "గతంలో మాన్యువల్‌గా జరిగినప్పుడు అనేక అవకతవకలకు, అక్రమాలకు ఆస్కారం ఉండింది. కొందరు పెద్దవాళ్లకు ఆన్‌లైన్ విధానం అమలు చేయడం వల్ల కొంత బాధ ఉండొచ్చు. ఏదైనా ఒక సంస్కరణ తీసుకొచ్చినప్పుడు కచ్చితంగా కొందరికి ఇబ్బంది ఉంటది. ఇప్పుడు పేదోడు, పెద్దోడు అన్న తేడా లేదు. అందరూ పబ్లిక్ డొమైన్‌లోదరఖాస్తుచేసుకోవలసిందే. అనుమతుల కోసం బిల్డ్‌నౌలో అప్‌లోడ్ చేయాల్సింది. పారదర్శకంగా ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ యాప్ తీసుకొచ్చాం" అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, వీర్ల పల్లి శంకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, దాన కిషోర్ తదితరులు పాల్గొన్నారు,

# రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తో జర్మనీ దేశ ప్రతినిధి బృందం భేటీ





(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, మార్చి 20:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,ఎపిసి & ప్రభుత్వ కార్యదర్శి, వ్యవసాయ డైరెక్టర్, మార్కెటింగ్ డైరెక్టర్ మరియు ఇతర ఉన్నతాధికారులు రేబెక్కా రిడ్డర్, డివిజన్ హెడ్- ఆసియా, బీఎంఏఎల్ ఆధ్వర్యంలో జర్మనీ నుండి వచ్చిన ప్రతినిధుల బృందంతో సచివాలయంలో సమావేశమయ్యారు.దఈ సమావేశంలో వ్యవసాయ రంగంలో నూతన సాంకేతికతల అన్వయం, మార్కెటింగ్, డిజిటల్ వ్యవసాయ అభివృద్ధి వంటి ముఖ్య అంశాలపై విస్తృతంగా చర్చించడం జరిగింది.సిరిసిల్ల జిల్లా వేములవాడలో పైలట్ ప్రాతిపదికన HHI, జర్మనీ సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న పరిశోధన గురించి మంత్రిగారికి బృందసభ్యులు వివరించడం జరిగింది. ఈ పరిశోధనలో భాగంగా 3 FPOల నుండి 55 మంది రైతులను ఎంపిక చేసి, ఉత్పత్తి ఖర్చులను తగ్గించడం, సాంకేతికతను ఉపయోగించి కూలీ ఖర్చు తగ్గించడం, డిజిటల్ వ్యవసాయం, పంట దిగుబడులను పెంచడం, డ్రోన్లను ఉపయోగించి నేల యొక్క సారాన్ని పరీక్షించడం, వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేయడానికి వాతావరణ స్టేషన్ ను నిర్వహిస్తూ, రైతులకు ఎప్పటికప్పుడు వాతావరణ సంబంధిత సమాచారాన్ని అందచేయడం జరుగుతుందని గౌరవ మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు స్పందిస్తూ,దభారత-జర్మనీ ప్రభుత్వాల సహకారంతో వ్యవసాయ రంగం అభివృద్ధికి నూతన ప్రణాళికలు చేపట్టాల్సిన అవసరాన్ని తెలిపారు. ప్రస్తుత ప్రాజెక్టను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని, తద్వారా తెలంగాణలోని అందరు రైతులు ఈ ప్రయోజనాలను పొందగలుగుతారని తెలిపారు.వ్యవసాయ విశ్వవిద్యాలయం & AGHUB డిజిటల్ వ్యవసాయంపై దృష్టి సారించి, తెలంగాణ రైతులను ఆధునిక వ్యవసాయం సాంకేతికతలను వినియోగించే విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పండించే పంటలు అంతర్జాతీయ ఎగుమతి ప్రమాణాలకు అనుగుణంగా పండించేవిధంగా రైతులను ప్రోత్సహించాలని, దీనివలన ఎగుమతులు పెరిగి రైతులకు అధిక ధరలు పొందుతారని తెలిపారు. దీనికి జర్మనీ ప్రభుత్వంతో కలిసి వ్యవసాయ అనుబంధ శాఖ, AGHUB, వ్యవసాయ విశ్వవిద్యాలయం కలసి ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతి అవకాశాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను అందించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.నూతన వ్యవసాయ పద్ధతులు, ఆధునిక యంత్రాలు ఉపయోగించడం ద్వారా కూలీల కొరతను అధిగమించడమే కాకుండా, అధిక దిగుబడులు రైతులు పొందే విధంగా సాంకేతికతను అనుసంధానం చేయాలన్నారు. ప్రస్తుతం దేశంలో జర్మన్ సహకారంతో రాజస్థాన్, ఒడిశా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో వివిధ ప్రాజెక్ట్ లు ప్రగతిలో ఉన్నాయని బృంద సభ్యులు వివరించగా, తెలంగాణ ప్రభుత్వం నుండి ఒక అధ్యయన బృందాన్ని ఈ రాష్ట్రాలకు పంపి వాటియొక్క ఫలితాలను అధ్యయనం చేసి తెలంగాణ రైతులను కూడా అక్కడికి పంపించి వారికి శిక్షణ ఇచ్చి, పంట ఉత్పత్తులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తి చేసి, ఎగుమతి చేసే విధంగా చూడలన్నారు. పీజేటీఏ , అగూబ్ వంటి సంస్థలు, డిజిటల్ వ్యవసాయాన్ని తెలంగాణ రైతులకు అందించేందుకు ప్రముఖంగా పనిచేయలన్నారు.అక్రాట్ ప్రాజెక్ట్ ద్వారా తెలంగాణ రైతులకు అధునాతన వ్యవసాయ విధానాల ప్రయోజనాలు అందించేందుకు ఇది ఒక గొప్ప అవకాశమని మంత్రి తెలిపారు. ఫ్రాన్హోఫర్ బృందంతో రాష్ట్ర స్థాయి వ్యవసాయ శాఖ మరియు యూనివర్సిటీలు మరింత సమిష్టిగా పనిచేయాలన్నారు. ఏఐ మరియు ఐఓటీ వంటి సాంకేతికతలను ఉపయోగించి అధిక దిగుబడి, ఆహార ప్రాసెసింగ్, మార్కెట్ లింకేజెస్ వంటి అంశాలను అభివృద్ధి చేయాలని సూచించారు. అక్రాట్ ప్రాజెక్ట్ ద్వారా వచ్చిన అనుభవాలను విస్తృతంగా చేసేందుకు వ్యవసాయ శాఖ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు.బీఎంఏఎల్ప్రతినిధులు, తెలంగాణ వ్యవసాయ రంగ అభివృద్ధికి ఫుడ్ ప్రాసెసింగ్, అంతర్జాతీయ మార్కెట్ లింకేజెస్ వంటి రంగాల్లో మరింత సహకారం అందిస్తామన్నారు.ఈ సమావేశం ఇండో-జర్మన్ వ్యవసాయ సహకారాన్ని బలోపేతం చేసేందుకు, తెలంగాణలో స్థిరమైన వ్యవసాయ అభివృద్ధికి దోహదపడే కీలక ముందడుగు అని తెలుపుతూ, సాంకేతికతను ఉపయోగించి వ్యవసాయ రంగాన్ని లాభదాయకంగా చేయాలని మంత్రి పేర్కొన్నారు,ఈ సమావేశంలో జర్మన్ ప్రతినిధులైన డా. రఘు చలిగంటి, శాస్త్రవేత్త (డిజిటల్ అగ్రికల్చర్), ఫ్రాన్హోఫర్-HHI, డా. సెబాస్టియన్, హెడ్-టెలికమ్యూనికేషన్స్, ఫ్రాన్హోఫర్-HHI, శ్రీ మార్టిన్, ప్రాజెక్ట్ మేనేజర్, BMEL, శ్రీ స్వెన్, డైరెక్టర్, IAK కన్సల్టింగ్ మరియు రాష్ట్రం నుండి డా. బి. గోపీ, వ్యవసాయ డైరెక్టర్, సురేంద్ర మోహన్ IAS, మార్కెటింగ్ డైరెక్టర్, శ్రీ ఎన్. శ్రీధర్, APC & కార్యదర్శి, ప్రొ. అల్దాస్ జనయ్య, గౌరవ వైస్ చాన్సలర్, PJTAU, డా. డి. రాజిరెడ్డి, వైస్ చాన్సలర్, SKLTSHU, డా. బాలరాం, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, డా. రాములు, డైరెక్టర్ - ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్, PJTAU, డా. కల్పనా శాస్త్రి, MD, AgHub, శ్రీ విజయ్ నడిమింటి, CEO, AgHub లు పాల్గొన్నారు.

## కోహెడ లో హోల్ సేల్ చేపల మార్కెట్ ఏర్పాటు: ఉప ముఖ్యమంత్రి భట్టి

- 47 కోట్ల వ్యయం తో ఏర్పాటు కానున్న చేపల మార్కెట్

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, మార్చి 20:** రంగారెడ్డి జిల్లా కోహెడ లో రాష్ట్ర ప్రభుత్వం 47 కోట్ల రూపాయలతో హోల్ సేల్ చాపల మార్కెట్ ను ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు, రాష్ట్రంలో భారీగా చేపల ఉత్పత్తి ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అందులో భాగంగా రంగారెడ్డి జిల్లాలోని కోహెడ లో చేపల మార్కెట్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు, ఈ విషయమై రాష్ట్ర శాసన సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర రాజధానికి అతి సమీపంలో ఉన్న కోహెడ లో హోల్ సేల్ చేపల మార్కెట్ ను ఏర్పాటు చేస్తున్నామని దీన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని అన్నారు, అలాగే స్థానిక ప్రజలకు ఈ మార్కెట్ ద్వారా మంచి ఉపాధి దొరుకుతుందని తెలిపారు, అలాగే ఇక్కడ ఏర్పాటు అయ్యే ఫ్రూట్ మార్కెట్ ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంను విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు, కాగా కోహెడ లో హోల్ సేల్ చాపల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించడం తో రంగారెడ్డి జిల్లా వాసులు హర్షం వ్యక్తంచేశారు,



# సంపాదకీయం..

## రాజకీయ సంస్కరణలు రావాలి !


రాజకీయ సంస్కరణలు లేకుండా భారత్మనుగడ సాధ్యం అయ్యేలా కనిపించడం లేదు. ఎంతసేపు సీట్లు, ఓట్లు,నాయకుల జీతాలు, భత్యాలు, పెన్షన్లు, ఉచిత పథకాలు వంటివాటి చుట్టే రాజకీయం సాగుతోంది. దీనికి ఎక్కడో ఒక చోట ముగింపు రావాల్సి ఉంది. చైనా లాంటి దేశాలు ఆర్థికంగా పురోగమిస్తుంటే భారత్ మాత్రం కేవలం రాజకీయ నాయకుల స్వార్థం కారణంగా కుంటుతోంది.

ఇంకా సీట్లు పెంచుకోవాలి...తమకు అవకాశాలు పెంచుకోవాలన్న దురాలోచన తప్ప ప్రజల సమస్యలు తీర్చడం, ఆకలి బాధలు తీర్చడం, సౌకర్యాలు పెంచడం వంటివన్నీ పక్కకు పోతున్నాయి. ప్రజల ఎజెండా ముందుకు రావడం లేదు. డీలిమిటేషన్తో తమ సీట్లు తగ్గుతాయని గొడవ చేస్తున్న స్టాలిన్ లాంటి వారు దీనికి సమాధానం చెప్పాలి. ఆయనకు వ్తాసు పలుకుతున్న వారు కూడా సమాధానం చెప్పాలి. అలాగే పదేళ్లుగా అధికారంలో ఉన్ మోడీ ముందుగా సమాధానం చెప్పాలి. ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందా లేదా..ధరలు అదుపులోకి వచ్చాయా లేదా..నిరుద్యోగం తగ్గిందా లేదా అన్నది చట్టసభల్లో చర్చించడం లేదు. ప్రజలకు అవసరం లేని ఎజెండాలు తెరపైకి తెచ్చి, తమ పబ్బం గడుపుకునే రాజకీయాలు సాగుతున్నాయి. భారత జనాభా 140 కోట్లకు చేరిన క్రమంలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరడం లేదు. ఇంకా జనాభా పెరగాలని కొందరు ప్రాంతీయ పార్టీల నేతలు ముఖ్యంగా స్టాలిన్, చంద్రబాబు లాంటి వారు ప్రచారం చేయడం సిగ్గుచేటు. ఉన్న ప్రజలకు సరైన ప్రాథిమిక సౌకర్యాలు కలిగించకుండా తమ రక్షణ కోసం వందలకోట్లు వెచ్చిస్తున్న వీరు ప్రజలను రక్షిస్తారనుకోవడం అత్యాశే కాగలదు. మారుతున్న కాలానుగుణంగా పాలకుల్లో మార్పులు రావడం లేదు. ఇకపోతే ఒకే పార్టీలో ఉంటున్న కొందరు రాజకీయ గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారు. పాలనలో వారు, వారి కుటుంబ సభ్యులే నిరంతరంగా ఉండే విధంగా రాజకీయాలను తమకు అనుకూలంగా మార్చేసుకుంటున్నారు. పార్లమెంట్, అసెంబ్లీలకు ఒక్కరినే నిరంతరంగా ఎన్నుకునే విధానం కూడా మంచిది కాదు. ఈ క్రమంలో రాజకీయాల్లో మార్పులు రావాలి. అమెరికా తరహాలో కేవలం రెండు పర్యాయాలు మాత్రమే ఎన్నికల్లో పోటీచేసే విధానం రావాలి. ఒక్కరే ఏళ్లతరబడి ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా ఉండకుండా కేవలం రెండు టర్మ్ల కాలాన్ని మాత్రమే నియంత్రించాలి. ఈ మేరకు రాజ్యాంగంలో సవరణలు తీసుకుని రావాల్సి ఉంది. ప్రజలు ఈ ఎజెండాతో ముందుకు రావాలి. అప్పుడే యువతకు అవకాశం వస్తుంది. ముువత రాజీకాయల్లోకి వస్తే మార్పులు కూడా వస్తాయి. ఎన్నికల్లో పోటీ చేసేవారికి అర్హతలను కూడా నిర్ణయించాలి. ఇలా అర్హతలు లేకపోవడం వల్లనే స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య ఫలాలు అందరికీ అందడం లేదు. కొందరే పాలకులుగా ఉంటూ..ప్రజల ఆకాంక్షలను విస్మరిస్తున్నారు. అందుకే పేదలు పేదలుగానే ఉన్నారు. ఆకలి కోసం అలమటిస్తున్న వారు అలాగే ఉన్నారు. రాజకీయ నేతలు పేదల పేరు చెప్పి పబ్బం గడుపుకుంటున్నారు. పాలకుల నిర్లక్ష్యం,విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేయడం,ఉచిత పథకాలను ప్రవేశ పెట్టడం వంటివన్నీ తగ్గాలి. మనం వేసే ఓటు సక్రమంగా పనిచేస్తుందా లేదా అన్నది ప్రజలు ఆలోచన చేయాలి. మన ఓటుతో గెలిచిన నేతలు సక్రమంగా పనిచేస్తున్నారా లేదా అన్నది కూడా ప్రజలే ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలి. మన ఓటును ఆయుధంగా చేసుకుని దేశాన్ని సక్రంగా ముందుకు తీసుకుని వెళుతున్నారా లేదా అన్న ఆలోచన చేయాలి. ఏదో ఓటేశామన్న నిర్లిప్త ధోరణి కారణంగా పాలకులు రాజకీయాలను వ్యాపారంగా మార్చుకుని, అధికారం చేతబట్టి శాసిస్తున్నారు. ప్రజలను ఓటుబ్యాంకుగా తయారుచేసుకుని వారిని మభ్యపెట్టడం అలవర్చుకున్నారు. ఎన్నికల అక్రమాల్లో ఆరితేరిన నేతలంతా పాలకులుగా పెత్తనం చెలాయిస్తున్నారు. ఓట్లను కొనుగోలు చేయడం ఎలాగో నేర్చుకున్నారు. మనం ఓటుకు అమ్ముడు పోవడం వల్లనే ఇలా జరుగుతోందని గుర్తించాలి. తమకు అనుకూలమైన ఎన్నికల అధికారులను, పోలీస్ అధికారులను అడ్డం పెట్టుకుని ఓట్లను వేయించుకుని ఎన్నికవుతున్నారు. ఈ విధానం పోవాలంటే ఎన్నికల్లో భారీ సంస్కరణలు రావాలి. ఒక్కరే నిరంతరంగా సర్పంచ్ నుంచి ఎంపి వరకు ఎల్లవేళలా ఎన్నికయ్యే పద్ధతికి స్వస్తి పలకాలి. చట్టసభల్లో అమెరికా లాగా కేవలం రెండు పర్యాయాలు మాత్రమే పోటీచేసే అవకాశం మాత్రమే ఉండాలి. ఎంపి, లేదా ఎమ్మెల్యేగా గెలిచిన వారు రెండు టర్మ్లకు మించి పనిచేయకుండా చట్టబద్ధ విధానం అమల్లోకి తీసుకుని రావాలి. జీవితాంతం ఒక్కరే ఎంపిగా లేదా ఎమ్మెల్యేగా ఉండే విధానం పోవాలి. దీనికి తక్షణ రాజ్యాంగ సంస్కరణ అవసరం. అప్పుడు ప్రజల్లో ఎక్కువ మందికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం వస్తుంది. కొందరు నాయకులు మాత్రమే నిరంతరంగా అధికారాన్ని అడ్డం పెట్టుకునే ఆగత్యం ఉండదు. అలాగే కుటుంబంలో ఒక్కరికి ఒకే పదవి అన్న విధానం కూడా రావాలి. వారసత్వ రాజకీయాలను అడ్డుకోవడానికి ఇది దోహద పడగలదు. దేశంలోని యువత, మేధావులు దీనిపై చర్చచేయాలి. అలాగే రాజకీయ నాయకుల అవినీతిపై తక్షణం విచారణ జరిగేలా చట్టాలు రావాలి. సామాన్యులకు ఎలా అయితే చట్టబద్ధ విచారణ సాగి, శిక్షలు పడుతున్నాయో రాజకీయాల ను, పాలనను అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా కోట్లు గడిస్తున్న నాయకులకు కూడా అలాగే విచారణ జరగాలి. శిక్షలు పడాలి. ఇలాంటి సంస్కరణలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి. అక్రమంగా వేలకోట్లు సంపాదిస్తున్న వారంతా మహా నేతాలుగా చలామణి అవుతున్నారు. ఇకపోతే రాష్ట్రాల్లో అధికారం లో ఉండగా అవినీతికి పాల్పడిన నేతలను విచారించి కఠినచర్యలు తీసుకునే అధికారం కేంద్రప్రభుత్వానికి ఉండాలి. కేంద్రంలో అవినీతి జరిగితే కూడా నేతలను తక్షణం విచారించే రాజ్యాంగ వ్యవస్థ రావాలి. రాజకీయ నేతల అవినీతిపై తక్షణం లోక్పాల్ ఏర్పాటు అత్యావశ్యకం. ఎప్పటికప్పుడు సంస్కరణలు చేసుకుంటూ.. రాజ్యాంగాన్ని సవరించుకుంటున్న మనం ఈ విషయంలో కూడా సవరణలకు పూనుకోవాలి. ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి రావడం వల్ల ఆయా నేతల కారణంగా ఎక్కువ శాతం అవినీతికి ఆస్కారం ఏర్పడింది. అలాంటి వారి పనిపట్టే చట్టబద్ధ వ్యవస్థ ఉండాలి. రాజకీయ పార్టీల నేతల అవినీతిపై సత్వర విచారణకు సుప్రీం సూచించినా అడుగు ముందుకు పడడం లేదు. అవినీతి కేసులు ఉన్నా ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా చలామణి అవుతున్నారు. రాజకీయ అవినీతిని నిరోధించేలా రాజ్యాంగ సంస్కరణలకు శ్రీకారం చుడితేనే మన ప్రజాస్వామ్యానికి అర్థం ఉంటుంది.

# పక్కా ఓటర్ కార్డుకు అడుగు పడాలి

- ఆధార్ మాదిరి ప్రత్యేక ఓటర్ కార్డు రావాలి
- ఎన్నికల సంస్కరణలపై ఇసి దృష్టి పెట్టాలి

**న్యూఢిల్లీ,మార్చి20( వెలుతురు):**




ఏటా ఓటరు దినోత్సవం జరుపుకుంటున్నా.. ఓటు విషయంలో పక్కా ప్రణాళికలు అమలు కావడం లేదు. ఆధార్, పాన్కార్డు పక్కాగా ఉంటున్నా...ఓటరు కార్డును నేటికీ పక్కాగా రూపొందించుకోవడం లేదు. తాజాగా వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆధార్తో ఓటును అనుసంధానం చేస్తామని ఎన్నికల సంఘం ప్రకటించింది. నిజానికి ఈ పని ఎప్పుడో చేయాలి. ఓటు అన్నది ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎంతో విలువైనది. దీనిపై నిర్లక్ష్యం తగదు. ఓటర్ల నమోదు నుంచి దొంగ ఓట్ల వరకు ..ఎక్కడ లోపం ఉందో ఎన్నికల సంఘం ఆలోచించడం లేదు. ఎన్ని ప్రకటనలు గుప్పించినా నేటికీ పక్కాగా ఓటు నమోదు కార్యక్రమాలు జరగడం లేదు. ఓటును ఆధార్కు అనుసంధానం చేయాలన్న సంకల్పం నెరవేరడం లేదు. అలాగే పర్మినెంట్ ఓటర్ ఐడి కార్డు నంబర్ ఉంటే తప్ప దొంగ ఓట్లకు స్వస్తి చెప్పలేము. ఓట్లను తొలగించారన్న ఆందోళనలూ తప్పుతాయి. ఈ రెండు అంశాలను ప్రజలు, మేధావులు విస్తృతంగా చర్చించాలి. ఇకపోతే తమ ఓటు పదిలం అన్న భరోసా ప్రజల్లో రావడం లేదు. ఎన్నికల సంఘం ఈ మేరకు అనేక కార్యక్రమాలతో ప్రజల్లో ఓటు చైతన్యానికి కృషి చేయాలి. అయితే సంస్థాగతంగా ఉన్న లోటుపాట్లపై మాత్రం కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించడం లేదు. ఓటర్ల నమోదు మొదలుకుని దొంగ ఓట్ల వరకు అనేక అనర్థాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఓటు వేసేందుకు వెళ్లే వరకు ఓటు ఉంటుందో లేదో తెలియడం లేదు. ఆధార్ నమోదు చేసుకున్నట్లుగానే పర్మినెంట్ నంబర్ ఉండాలి. పాన్ కార్డు నమోదయితే పర్మినెంట్ నంబర్ ఉంటుంది. ఓటుకు పర్మినెంట్ నంబర్ రావాల్సి ఉన్నా ఎందుకనో ప్రభుత్వం లేదా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవడం లేదు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేయడం ద్వారా ఓటును కూడా పర్మినెంట్ చేయాలి. ఇదే సందర్భంలో ఓటుకు కూడా ఆధార్ లాగా పర్మినెంట్ నంబర్ కూడా కేటాయిస్తే మరీ మంచిది. అప్పుడు బోగస్ అన్నదానికి చెక్ పెట్టగలం. ఎన్నికల సంస్కరణలను ఆషామాషీగా కాకుండా పక్కాగా అమలు చేస్తేనే మంచిది. ఓటుకు కూడా ఆధార్ లాగా పర్మినెంట్ నంబర్ ఉంటే ఇలాంటి తొలగింపు అవకాశాలు ఉండవు. ఎలాంటి లోటుపాట్లు లేని ఓటరు నమోదుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఎన్నికల సంఘం గుర్తించడం లేదు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ వ్యవస్థగా ఉన్న ఎన్నికల సంఘం ఈ మధ్య అనేక వివాదాల్లో చిక్కుకుంటోంది. విపరీతమైన అధికారాలు కలిగి ఉన్నా సమర్థత ప్రదర్శించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికలు ప్రాణప్రదమైనవి. ఓటర్ల జాబితాలు ఎంత స్వచ్ఛంగా, దోషరహితంగా ఉంటే ఎన్నికలు అంత సవ్యంగా జరుగుతాయి. కానీ ఇప్పుడదే వివాదంగా మారింది. ఓటర్ల నమోదు, తొలగింపు ఓ ప్రహసనంగా మారంది. పక్కా కార్యాచరణ జరగడం లేదు. శేషన్ లాగా బూజు దులిపి హంటర్ చేతబట్టిన వారు తరవాతి కాలంలో రాలేదు. ఓటర్ల నమోదు, తొలగింపు, నిర్వహణ అంతా వివాదాల్లో నడుస్తోంది. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్ప క్షపాతంగా నిర్వహించడం ఈ సంస్థ నైతిక బాధ్యత. ఓటర్ల జాబితాలలో అనేక అవక తవకలు బయటపడుతున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల కమిషన్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి పైనా, రాష్ట్రప్రభుత్వ సిబ్బంది పైనా ఆధారపడి చర్యలు తీసుకోవలసి ఉంటుంది. రాష్ట్ర అధికారులు సహజంగానే అధికారపార్టీకి విధేయంగా ఉంటారు. అటువంటప్పుడు అధికారపార్టీ బుద్ధిపూర్వకంగా రకరకాల ఎన్నికల అక్రమాలకు ఒడిగట్టితే వాటిని ఎన్నికల కమిషన్ ఏవిధంగా నివారించగలదనే సందేహం కలుగుతోంది. ఏటా జాతీయ ఓటరు దినోత్సవం జరుపుకుంటున్న వేళ ఓటర్ల సవరణపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు వచ్చిన ఆరోపణలను గమనించి సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. ఓటర్ల తొలగింపు ఇప్పుడు పెద్ద సమస్యగా పరిణమించింది. దీనిని ఏ విధంగా చక్కదిద్దుతారో తెలియడం లేదు. ఓటరు ఐడి కార్డు పట్టుకుని వెళితే జాబితాలో పేర్లు ఉండడం లేదు. దీనికి పక్కా విధానం అమలు కావాల్సి ఉంది. దొంగ ఓట్ల విషయంలో కూడా ఇసి సరైన చర్యలు తీసుకోవడం లేదు. ఓట్ల నమోదులో కొన్ని రాజకీయ పక్షాలు అదే పనిమీద ఉంటాయి. అధికార పార్టీ నేతలు బోగస్ ఓట్లను చేర్పించేందుకు ప్రత్యేక కార్యక్ర మాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు అన్నచోట్లా వున్నాయి. సర్వేల పేరిట జరుగుతున్న తతంగం కూడా అధికార పార్టీ నేతల పర్యవేక్షణలోనే సాగుతోందని ప్రతిపక్షాలు అంటున్నాయి. రెవెన్యూ అధికారులు ఎటువంటి విచారణ లేకుండానే బోగస్ ఓటర్లను నమోదు చేసుకుంటున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి. దొంగ ఓట్లు ఫలానా ప్రాంతంలో ఉన్నాయనీ, దర్యాప్తు జరిపించి నిజం నిగ్గు తేల్చాలనీ ఎన్నికల ప్రధానాధికారి జిల్లా ఎన్నికల అధికారిని ఆదేశిస్తే చక్కదిద్దు తారన్న భరోసా లేదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఇసి సక్రమంగా ముందుకు వెళ్లగలదు. అధికారుల పరిశీలనలో దొంగ ఓట్లు నమోదైనట్టు రుజువైతే తప్ప చర్యలకు ఉపక్రమించడం లేదు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా నామినేషన్ వేయడానికి గడువు ముగిసే క్షణం వరకూ కొత్త ఓట్లను చేర్చుకునే పక్రియ కొనసాగుతోంది. ఇకపోతే రాజకీయ పార్టీల ప్రమేయంతో ఓట్ల తొలగింపు జరుగుతోందన్న వాదన ఉంది. దీనిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. దొంగ ఓట్లను తొలగించాలనే పట్టుదల కేంద్ర ఎన్నికల కమిషన్కు నిజంగా ఉంటే అందుకోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి. అంకిత భావంతో పనిచేసే సిబ్బందిని తగినంతగా సమకూర్చాలని రాష్ట్రపతిని అభ్యర్థించాలి. నామినేషన్ల గడువు ముగియడానికి ముందు ఉన్న ఓట్లకు పదిహేను లేదా ఇరవై శాతం కొత్త ఓట్లు నమోదు చేస్తున్నారు. నామినేషన్లు ముగిసిన తర్వాత దొంగ ఓట్లను గుర్తించి, తొలగించడానికి తగిన సమయం ఉండటం లేదు. అక్రమాలు జరిగినట్టు తెలుసుకొని ఎన్నికల పక్రియ ముగిసిన తర్వాత అధికారులపైన ఎటువంటి చర్య తీసుకున్నా లాభం ఉండదు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్లకు మంచి పేరు ఉన్నప్పటికీ ఎన్నికలలో ధన ప్రభావం విపరీతంగా పెరిగింది.

అక్రమాలకు అంతులేకుండా పోతున్నది. అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం యథావిధిగా జరుగుతోంది. గతానుభవాను దృష్టిలో పెట్టుకుని పక్కాగా ఓటరు నమోదు కార్యక్రమం ఉండాలి. అవసరమైతే సాంకేతి కతను మరింతగా ఉపయోగించు కోవాలి. ఎన్నికలలో అవకతవకలకు పాల్పడిన అధికారులు ఎంతవారైనా వారిపైన చర్యలు తప్పవన్న హెచ్చరికలు కఠినంగా అమలు కావాలి. అప్పుడే భయం ఏర్పడుతుంది. అందుకు ఎన్నికల సంఘం ముందుకు వస్తుందా అన్నది చూడాలి. ఆధార్తో ఓటర్ ఐడీ అనుసంధానం ద్వారా దాన్ని పరిష్కరించడానికి అవకాశం ఏర్పడు తుంది. అయితే ఆధార్ కార్డు లాగానే ఓటరు ఐడికి కూడా పర్మినెంట్ నంబర్ ఉంటే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఓటును కోల్పోవడం లేదా..బోగస్ను నివారించవచ్చని అంటున్నారు. ఆధార కార్డు మాదరిగా ఓటర్ ఐడికి నంబర్ ఉంటే మంచిదని అంటున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా.. ఓటు పరమపవిత్రంగా ఉండేలా...ఒకరి ఓటు మరొకరు వేయకుండా..ఓటును అకారణంగా తొలగించకుండా కూడా గట్టి చర్యలు తీసుకోవాలి. ఓటరు దినోత్సవం జరుపుకుంటున్న వేళ కఠిన సంస్కరణలతో ఎన్నికల సంఘం ముందుకు సాగాల్సి ఉంది.

# పథకాల పేర్లు మార్పులు

- రాజకీయ రచ్చ చేస్తున్న నేతలు

**విశాఖపట్టణం,మార్చి20( వెలుతురు):**




ఆంధ్రప్రదేశ్లో పేర్లమార్పు వివాదం మరోసారి రాజకీయరచ్చ రేపుతోంది. మొన్న హెల్త్ యూనివర్సిటీ– ..నిన్న కడప జిల్లా..తాజాగా విశాఖ క్రికెట్ స్టేడియం..ఇలా పేర్లను తొలగించడంపై వైరాపా ఆందోళనలకు దిగుతోంది. ఇందులో విశాఖ స్టేడియం ఇప్పుడు పేరు మార్చుకుంది. గతంలో హెల్త్ వర్సిటీకి ఎన్నో ఏళ్లుగా ఎన్టీఆర్ పేరు ఉండేది. జగన్ దానిని కెటికి వైఎస్ పేరు తగిలించారు. కడప జిల్లాను కేవలం వైఎస్సార్ జిల్లాగా చేశారు. ఇక్కడ ప్రజల సెంటిమెంట్ను దెబ్బతీసారు. జగన్ అధికారంలోకి రాగానే కూల్చవేతలతో మొదలు పెట్టారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భవనాన్ని కూల్చారు. ఇలా ప్రభుత్వాలు ప్రజల సొమ్ముతో ఆడుకుంటున్నాయి. ఇష్టారాజ్యంగా పేర్లు మారుస్తున్నారు. దీనికి స్వస్తి పలకాల్సి ఉంది. అందుకే ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం వైఎస్సార్ కడప జిల్లాగా మార్చింది., ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ పేరును యథాతథంగా మార్చేసింది. ప్రభుత్వం. అటు– పథకాలకు..ఇటు– కట్టడాలకు దివంగత సీఎం వైఎస్ పేరు తొలగించడంపై వైసీపీ మండిపడుతోంది... ప్రభుత్వ తీరును నిరసిస్తూ విశాఖలో ఆందోళనకు పిలుపునిచ్చింది.. దీంతో అక్కడ వైఎస్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన కార్యకర్తలు వైఎస్ పేరును కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇటీవలే వైయస్ఆర్ జిల్లా పేరును వైయస్ఆర్ కడప జిల్లాగా..వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ– పేరును తాడిగడప మున్సిపాలిటీగా మార్పు చేస్తూ ఏపీ కేబినెట్ నిర్ణయం తీసుకుంది... ఇప్పుడు తాజాగా విశాఖలోని డాక్టర్ వైఎస్ఆర్ ఏసీబీ వీడీసీఎం స్టేడియం పేరులో..వైఎస్ఆర్ పేరు మాయమయింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాగార్జున యూనివర్సిటీలో వైఎస్ విగ్రహాన్ని తొలగించారని.. బాపట్లలో వైఎస్సార్ విగ్రహాన్ని తగలబెట్టారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు.. విశాఖలోని స్టేడియంకు వైఎస్ఆర్ పేరును తొలగించడాన్నినిరసిస్తూ నేడు స్టేడియం దగ్గర ఆందోళనకు దిగారు. ఏపీలో అధికారం మారినప్పుడల్లా పేర్ల మార్పుపై రాజకీయ రచ్చ కొనసాగుతోంది. గతంలో విజయవాడ లోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ– పేరును వైసీపీ ప్రభుత్వం వైయస్సార్ హెల్త్ వర్సిటీగా మార్చింది. ఇది కావాలని చేసి లేని రచ్చను చేసింది. అధికారంలోకి రాగానే తిరిగి ఎన్టీఆర్ పేరును హెల్త్వర్సిటీకి పెట్టింది కూటమి ప్రభుత్వం. విశాఖ సీతకొండ హిల్వ్యూ పాయింట్ను గత వైసీపీ ప్రభుత్వం.. వైయస్ పేరు పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనికి అబ్దుల్ కలామ్ వ్యూ పాయింట్గా పేరు మార్చింది. 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ హయాంలో అమలైన పలు పథకాల పేర్లను మార్చేసింది జగన్ ప్రభుత్వం.. జగనన్న, వైఎస్ఆర్ పేర్లతో పథకాలను అమలు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగన్, వైఎస్ఆర్ పేర్లతో ఉన్న పథకాలకు కొత్త పేర్లు పెట్టింది. జగనన్న అమ్మఒడి పేరును తల్లికి వందనంగా మార్చగా.. జగనన్న విద్యా కానుక పథకాన్ని 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' అని పేరు పెట్టారు. అలాగే, జగనన్న గోరుముద్దను 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం'గా మార్పు చేశారు. జగనన్న ఆణిముత్యాలును 'అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారం'గా మార్చింది ప్రభుత్వం. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనల పథకాల పేర్లను 'పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్'గా మార్చారు. జగనన్న విద్యాదీవెన పథకం 'అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి'గా మార్చింది కొత్త ప్రభుత్వం. అలాగే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేరు కాస్తా.. ఎన్టీఆర్ ఆరోగ్య భరోసాగా మారింది. రాష్ట్రంలో వైఎస్ పేరు కనిపిస్తే కూటమి పార్టీలకు భయం పుడుతోందని..అందుకే ఇలాంటి చర్యలకు దిగుతున్నారని వైసీపీ మండిపడుతోంది.

(ఆధ్యాత్మికం )

## స్వార్థం పతన హేతువు !

**తిరుమల,జనవరి24( వెలుతురు):**

స్వార్థం ఎంతటికైనా పురిగొల్పుతుంది. మానవుడిలో పశు ప్రవృత్తి కనిపిస్తుంది. మృగంగా తయారు చేస్తుంది. మానవజీవన పురోగతికి, ఉత్తమ సమాజ నిర్మాణానికి స్వార్థ గుణం పెద్ద అవరోధం. ఏ విధమైన వికాసం జరగడానికైనా ముఖ్యమైన అడ్డంకి కాగలదు.ఆస్తి కోసం తల్లిదండ్రులను, అన్నదమ్ములను కడతేర్చేలా చేస్తుంది. తనకు మాత్రమే అన్న ధోరణి వాంఛనీయం కాదు. ఎవరికైనా కొంత వరకూ స్వార్థం ఉండవచ్చు. ఆ స్వార్థం వారికి కొంతవరకు ఉపయోగపడచ్చు. కానీ.. ఆ గుణం ఎక్కడ శ్రుతి మించుతుందో అక్కడ మానవసంబంధాలు, మానవవిలువలు విధ్వంసానికి గురవుతాయి. భాగవతంలో కంసుని విషయంలో ఇదే జరిగింది. సోదరి దేవకీదేవిని, వసుదేవుని వారి వివాహానంతరం తానే సారథిగా మారి రథంలో తీసుకెళ్తుండగా.. అశరీరవాణి మాటలు విన్న కంసుడు తన సోదరిని, వసుదేవుని సంహరించే ప్రయత్నం చేశాడు. చివరకు వారి వినతి కారణంగా బంధించాడు. తాను పూర్వం కాలనేమినని, తనను విష్ణువు సంహరించాడని తెలుసుకున్న కంసుడు విష్ణుద్వేషంతోనే తన జీవితాన్ని గడిపాడు. కన్న తండ్రినే కారాగారంలో బంధించి శూరసేన రాజ్యపాలన మొదలుపెట్టాడు. తాను మాత్రమే రాజుకావాలన్న స్వార్థం బాంధవ్యాన్ని కూడా విస్మరించేలా చేసింది. మిక్కిలి స్వార్థబుద్ధితో తమ తల్లిదండ్రులను, సోదరులను, ఒక్కోసారి పుత్రులను, అవసరమైతే స్నేహితులను, సఖీజనాన్ని కూడా వధించడానికి వెనకాడరు. అదే విషయాన్ని పోతన మహాకవి భాగవతలో వివరించారు. కేవలం తన స్వార్థం కోసం ఆత్మీయులను కూడా చంపాలన్న యోచన ఎంత అమానుషమో భాగవతం చెబుతుంది. పరమ స్వార్థపరుడు కనుకనే కంసుడు యదువంశీయులతో వైరం పెంచుకొని ఇతర రాక్షస రాజులు, బాణుడు, భౌముడు, జరాసంధుడు మొదలైన వారి సాయంతో వారితో కయ్యం కొనసాగిస్తూ వచ్చాడు. శ్రీమహావిష్ణువే మరోచోట పుట్టి పెరుగుతున్నాడన్న సమాచారం తెలియగానే.. ప్రలంబుడు, బకుడు, చాణూరుడు, తృణావర్తుడు, అఘాసురుడు, ముష్టికుడు, అరిషుడు, ద్వివిదుడు, పూతన, కేశి, ధేనుకుడు మొదలైనవారిని ప్రయోగించడం అతనిలోని క్రూరత్వానికి పరాకాష్ట. అతడి స్వార్థమే అతడి సర్వనాశనానికి దారి తీసింది.

## రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా పై సమీక్ష సమావేశం

- రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్



**వెలుతురు, రంగారెడ్డి జిల్లా, మార్చి 20:**
గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డిఆర్ఓ సంగీతతో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా యొక్క నిరంతరధృవీకరణ, వాటి సమర్పణ, 20.03.2025 నాటికి పెండింగ్‌లో ఉన్న 6,7 & 8 ఫారమ్‌లు, బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకం వంటి పలు అంశాలపైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ CEO సూచనల మేరకు అసెంబ్లీ స్థానాలల్లో పోలింగ్ కేంద్రాలు, వాటికి కేటయించిన బూత్ లెవల్ఆఫీసర్లకు సంబంధించిన వివరాలను వివరించారు. యల్.బి.నగర్,మహేశ్వరం, రాజేంద్రనగర్, శేర్‌లింగంపల్లి, చేవేళ్ళ, షాద్నగర్, కల్వకుర్తి, ఇబ్రహింపట్నం నియోజక వర్గాలలోని గ్రామీణప్రాంతంలో 1065, పట్టణ ప్రాంతంలో 2436 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. వీటికి మొత్తంగా 3501 బూత్ లెవల్ పోలింగ్ ఆఫీసర్లను ఇంతకముందునియమించామన్నారు. లింగ ప్రాతిపాదికన 20.03.2025 నాటి వరకు మొత్తం 8 నియోజకర్గాల్లో పురుషులు 1889115, స్త్రీలు 1785501,ట్రాన్స్ జెండర్ 434 గా ఉండగా మొత్తం ఓటర్లు 36,75,050 ఉన్నారన్నారు. ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న ఫాం 6,7,8 ఫామ్ లను త్వరగా క్లియర్ చేయడంజరుగుతుందన్నారు. గతంలో పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చులపెండింగ్ వాటి పై మాట్లాడుతూ ఇప్పటికి అందజేయని అభ్యర్థులుత్వరగాఅందించాలన్నారు. వీటిపై ఎలక్షన్ కమీషన్ చర్యలు తీసుకోవడంజరుగుతుందన్నారు. అదే తరుణంలో రాజకీయ పార్టీల నుండి నియమించాల్సిన బూత్ లెవల్ ఏజెంట్లను త్వరగా నియమించాలని, వారి వివరాలను ఇఆర్ఓలకు పార్టీ నాయకులు త్వరాగా అందజేయాలని తెలియజేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపియం, సిపిఐ, బిఎస్పి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాస్ట్, ఇన్ కమ్ సర్టిఫికెట్లను వెంటనే మంజూరు చేయాలి

- అంబర్ పేట తహశీల్దార్ మీరాబాయిని కలిసి వినతి పత్రం అందజేసిన శంభుల ఉష్శ్రీ, శ్రీకాంత్ గౌడ్



**వెలుతురు,హైదరాబాద్ మార్చి 20 :**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం నిమిత్తం క్యాస్ట్ , ఇన్ కమ్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసు కున్న లబ్ధిదారులకు వెంటనే సర్టిఫికెట్లను వెంటనే మంజూరు చేయాలని టిపిసిసి సెక్రటరీ శంభుల శ్రీకాంత్ గౌడ్, బాగ్ అంబర్ పేట్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ శంభుల ఉష్శ్రీ కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని, దీనికి క్యాస్ట్ సర్టిఫికెట్, ఇన్ కమ్ సర్టిఫికెట్లు జత చేయాల్సి ఉందని అందుకుగాను లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న యువతకు ఒకరోజు సమయంలో వాటిని మంజూరు చేయాలని కోరుతూ.. అంబర్ పేట్ ఎమ్మారో మీరాబాయిని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మార్వో మీరాబాయి వెంటనే స్పందించి లబ్ధిదారులు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసి తనకి స్వయంగా ఇస్తే ఒక్కరోజు సమయంలో సర్టిఫికెట్లను మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని వివరించారు. నిరుద్యోగ యువతకు యువవికాసం పథకంలో 50 వేల నుండి రూ. 4 లక్షల వరకు లోన్ ఇవ్వడం జరుగుతుందని, దీనిలో 60 నుండి 80 శాతం వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. యువత యువ వికాసం పథకాన్ని సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ ,బిసి, మైనారిటీ వర్గాలు దరఖాస్తు చేసుకునే వీలుందనీ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్య ప్రజలు కూడా అభివృద్ధి చెందాలని లక్ష్యంతో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజ్ కిరణ్, మహేందర్, అనిల్, శ్యామ్, శివ తదితరులు పాల్గొన్నారు.

## తూప్రాన్ పేట్ వద్ద కేటీఆర్ కు స్వాగతం పలికిన బీఆర్ ఎస్ నేతలు

**వెలుతురు, రంగారెడ్డి జిల్లా, మార్చి 20:**
సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి వెళ్తూ మార్గ మధ్యలో యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ మండలం తూప్రాన్ పేట్ గేట్ వద్ద రాష్ట్ర బీ ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (కల్వకుంట్ల తారకరామారావు) ను కలిసి నాగలిని బహుకరించి సంతకం చేయించిన రంగా రెడ్డి జిల్లా బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచి రెడ్డి కిషన్ రెడ్డి, ఈ సందర్భంగా బీఆర్ ఎస్ పార్టీ నాయకులు, జై తెలంగాణ జై కేసీఆర్, జై కేటీఆర్ అంటూ నినాదాలు చేశారు, అయితే కేటీఆర్ భారీ కారు ర్యాలీ తో సూర్యా పేట కు బయలుదేరి వెళ్ళారు,



# మెరుగైన విద్యను అందించడమే డ్రీమ్స్ స్కూల్ లక్ష్యం

- డ్రీమ్స్ స్కూల్ లో వైభవంగా యూకేజీ గ్రాడ్యుయేషన్ డే వేడు కలు
- ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు అంద జేసిన స్కూల్ ప్రిన్సిపల్ వేణుగో పాల్,



**వెలుతురు, హైదరాబాద్ మార్చి 20 :**
విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే డ్రీమ్స్ స్కూల్ లక్ష్యం అని ప్రిన్సిపాల్ ఎన్.వేణుగోపాల్ అన్నారు. అంబర్ పేటలోని డ్రీమ్స్ కిడ్స్ అప్పర్ ప్రైమరీ స్కూల్ యూ కేజి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 35 మంది యూకేజి విద్యార్థులు.. గ్రాడ్యుయేషన్ డ్రెస్ లో తమ తల్లిదండ్రుల సమక్షంలో ఉత్సా హంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమా నికి ము ఖ్యఅతిథిగా పాల్గొన్న స్కూల్ ప్రిన్సిపల్ వేణుగోపాల్, కరస్పాండెంట్ సంతోషిలక్ష్మి చేతుల మీదుగా చిన్నారులకు గ్రాడ్యుయే షన్ సర్టిఫికె ట్లు అందజేసి, మాట్లా డుతూ.. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరు కోవాలంటే క్రమశిక్షణ, అంకిత భా వం, పట్టుదల ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం అనే ది ఒక మధు రానుభూతి అని అ లాంటి బాల్యదశలో ప్రీ ప్రైమరీ దశ ను పూర్తిచేసుకుని ప్రైమరీ స్థాయికి వెళుతున్న విద్యార్థులందరికి అభి నందనలు తెలియజేశారు. నేటి బా లలే రేపటి పౌరులని, చక్కని పౌరు లుగా మారే అవకాశం కేవలం వి ద్యార్థి దశలోనే జరుగుతుందని, ఈ దశలో విద్యార్థులు తల్లిదండ్రులు,




గురువులు చెప్పిన మాటలను గౌర వమిస్తూ దేశ ప్రగతికి చక్కని బాట వేయాలని వారు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతి క ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు విద్యా ర్థులు, ఉపా ధ్యాయులు పాల్గొన్నా రు.

# రవాణా కార్మికులందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

**వెలుతురు, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా, మార్చి 20:**
మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా పరిధిలో మల్కాజ్ గిరి చౌరస్తా నందు చలో పార్లమెంట్ వాల్ పోస్టర్లు ఆవిష్కరణ కార్యక్రమం ను నిర్వహించారు,సీఐటీయూ ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (AIRTWF) సిఐటియు ( అనుబంధం). యూనియన్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బాధ్యులుబంగారునర్సింగరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం (AIRTWF - CITU) అండగా ఉంటుందన్నారు. రవాణా రంగంలో వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా అర్హులైన వాళ్లందరికీ సంక్షేమ పథకాలు అందించాలని. ప్రమాద భీమా , మరియు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి. నాన్ లోకల్పర్మిట్లనునియంత్రించాలి. ప్రైవేట్ ఓలా, ఉబర్, రాపిడోయాప్ లను నియంత్రించి, దోపిడిని అరికట్టాలి. 2019 మోటార్ వెహికల్ సవరణచట్టాన్ని ఉపసంహరించుకోవాలి. 29 లేబర్ కోడ్ లను పునరుద్ధరించాలి. నాలుగు లేబర్ కోడ్ లు రద్దుచేయాలి. తెలంగాణ రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ రెండు దఫాలుగా ట్రాన్స్పోర్ట్ యూనియన్ నాయకులతో చర్చలు జరిపారు. రవాణా రంగ కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాను వాగ్దానం చేశారు. ట్రాన్స్పోర్ట్ కార్మికులకు ఇచ్చిన



వాగ్దానాన్ని అమలు పరచలేదు, దీనికి నిరసనగా ఈనెల 21వ తేదీన రవాణా రంగం కార్మికులతో ఇందిరా పార్క్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఈ ధర్నాకార్యక్రమంలో ఆటో, ట్రాలీ, లారీ, డీసీఎం, బస్సు మొదలగు రవాణా రంగంలో పనిచేస్తున్న ప్రతిఒక్కడ్రైవరు, హెల్పరు, వర్కరు పాల్గొనాలి. అదేవిధంగా మార్చి 24వ తేదీన చలో పార్లమెంటు దేశవ్యాప్త కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు. ఆటో డ్రైవర్ల అందరికీ సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి. అర్హులైన పేదలకు డబల్ బెడ్రూమ్ ఇల్లు ఇవ్వాలి. ఆటో స్టాండ్ అడ్డా కోసం పార్కింగ్ స్థలాన్ని కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఆర్టిఏ, ట్రాఫిక్ పోలీసుల వేధింపులు అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మల్కాజ్గిరి మండల కమిటీ నాయకురాలు కృష్ణమ్మ తో పాటు ట్రాలీ డ్రైవర్స్ భాష, వెంకటేష్, అంజన్న, ఆంజనేయులు, శంకర్, రాజు,తదితరులుపాల్గొన్నారు,

## చట్టసభల్లో బిసి వర్గీకరణ బిల్లు మరియు జిహెచ్ఎంసి కి మూడు వేల 101 కోటి రూపాయలు నిధులు

**హైదరాబాద్ వెలుతురు మార్చి 20:**
గురువారం రోజున చట్టసభల్లో బిసి వర్గీకరణ బిల్లు మరియు జిహెచ్ఎంసి కి మూడు వేల 101 కోటి రూపాయలు ఇవ్వడంతో హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ కార్యకర్తలతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి గారికి పాలాభిషేకం చేసి మరియు కేక్ కట్ చేసి అందరితో సంబరాలు నిర్వహించడం జరిగింది.



# బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి ఘన స్వాగతం



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ మార్చ్ 20 :**
భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు గారు సూర్యాపేట జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి వెళుతుండగ చౌటుప్పల్ పట్టణకేంద్రంలో గురువారం రోజున మునుగోడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు . ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతిగారు, PACS చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గిరికంటి నిరంజన్ గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి పెద్దింటి బుచ్చిరెడ్డి, కర్నాటి వెంకటేశం, BRTU జిల్లా అధ్యక్షులు ఢిల్లీమాధవరెడ్డి, కొత్త పర్వతాలు యాదవ్, ముప్పిడి శ్రీనివాస్ గౌడ్, చిన్నం బాలరాజు కురుమ, మెట్టు మహేశ్వర్ రెడ్డి, గుండెబోయిన వెంకటేష్ యాదవ్, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, ఉడుగు మల్లేష్ గౌడ్, గుండెబోయిన అయోధ్య యాదవ్, సుర్వి మల్లేష్ గౌడ్, మునుకుంట్ల నరసింహ గౌడ్, బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, md హాతర్ పాషా, నలపరాజు రమేష్, మున్నా, చెక్క రాములు, చెవకొని మహేష్, జువ్వి శివ, బాలగోని శ్రీనివాస్, బండ్ల శ్రీకాంత్, దోర్నాల నరేష్ తదితరులు పాల్గొన్నారు .

## హయత్ నగర్ లో సత్యం ను సన్మానించిన సీపీఐ నాయకులు



**వెలుతురు, హయత్ నగర్, మార్చి 20:**
సిపిఐ ఎమ్మెల్సీ గా ఎన్నికైన నెల్లికంటి సత్యం సీపీఐ పార్టీ నాయకులు హయత్ నగర్ లో గురు వారం నాడు సన్మానం చేశారు,హైదరాబాద్ నుండి నల్లగొండకు వెళ్తున్న ఎంఎల్ సి సత్యం ను హయత్ నగర్ లో కలిసి చిరు సన్మానంను సీపీఐ నాయకులు చేశారు, ఈకార్యక్రమంలోఏఐటియుసి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, సిపిఐ పార్టీ మాజీ కౌన్సిలర్ అజ్మీరా హరి సింగ్ నాయక్ ,బి ఓ సి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దాసరి ప్రసాద్, ఆర్ ఎన్ ఆర్ -2 కాలనీ సహాయ కార్యదర్శి ధూపం నిరంజన్ , తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి నరసింహ, చౌటుప్పల్ సీపీఐ కార్య దర్శి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థిని, విద్యార్థులకు శుభాకాంక్షలు

**- బీసీ నేత జాజుల లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు మార్చి 20:**
పరీక్షల వేల విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి,ఆందోళనకు గురి గాకుండా ధైర్యంగా,ప్రశాంతంగా ఆత్మవిశ్వాసంతో జీవితంలో తొలిమెట్టు అయిన పదవ తరగతి పరీక్షలు రాసి ప్రతి ఒక్కరూ గొప్ప ఫలితాలు సాధించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ శుభాకాంక్షలు తెలియజేశారు.పరీక్షలంటే భయం అనే మానసిక రోగాన్ని విడనాడి మంచి ప్రణాళికతో చదవాలని అన్నారు

# రాజీవ్ యువ వికాస్ పథకంలో నిరుద్యోగ యువతకు చిక్కులు

- రేషన్ కార్డ్ లేకపోవడంతో అర్హత కోల్పోతున్న యువత.
- ప్రభుత్వం తక్షణమే స్పందించి నిబంధనలు మార్చాలి.
- రిషారియా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియదర్శిని మేడి



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 20**

రాజీవ్ యువ వికాస్ పథకంలో నిరుద్యోగ యువతకు చిక్కులు పడుతున్నారు అని రిషారియా ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియదర్శిని మేడి అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులకు అవకాశం కల్పించకపోవడంతో, 12 సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకునే అవకాశం లేక పెళ్లిళ్లు జరిగి వేరుగా నివాసం ఉంటున్న ఎందరో యువకులు ఇంకా తల్లిదండ్రులు రేషన్ కార్డులోనే కొనసాగుతూ వచ్చారు.కానీ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించడంతో, నిబంధనలు ప్రకారం పాత రేషన్ కార్డులు డిలీట్ అయితేనే కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునే పరిస్థితి ఉండడంతో, పలువురు యువకులు డిలీట్ ఆప్షన్ ద్వారా పాత రేషన్ కార్డులు డిలీట్ అయ్యారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు యువతకు చేయూతనందించేందుకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని తీసుకొని వచ్చింది.ఎంతో ఆశగా శిక్షణతో పాటుగా సబ్సిడీ రుణాలు లభిస్తాయని ఉపాధి పొందవచ్చు. అని ఆశతో ఈ పథకాన్ని దరఖాస్తు చేసుకోవడానికి ఈ సేవా సెంటర్లకు వెళ్తే అక్కడ నిర్వాహకులు వివరాలు నమోదు చేసిన క్రమంలో రేషన్ కార్డ్ ఆప్షన్ వచ్చేసరికి ఇంతకుముందు పాత కార్డు డిలీట్ అయిన కారణంగా ఆ నెంబర్ కొడితే దరఖాస్తులు రిజెక్ట్ అవుతున్నాయని చెప్పడంతో యువకలు చాలా మంది నిరుత్సాహ పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ప్రియదర్శిని మేడి సూచించారు.

# ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

- బి కె యం యు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్

**కరీంనగర్ వెలుతురు మార్చి 20:**

ఉపాధిహామీ కూలీలు పని చేస్తున్న పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించి కూలీలకు రక్షణ కల్పించాలని బి కె యం యు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ కోరారు గురువారం రోజున బి కె యం యు ఆధ్వర్యంలో ఉపాధిహామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ డి ఆర్ డి వో శ్రీధర్ గారికి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో పని చేస్తున్న మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు, మౌళిక వసతులు లేక తీవ్ర ఎండ ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పని ప్రదేశాల్లో మంచినీటి సౌకర్యం, నీడ సౌకర్యం ఏర్పాటు చేయాలని,మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని, వో ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణి చేయాలని, దూర ప్రదేశాలకు వెళ్లే కూలీలకు రవాణా సౌకర్యం కల్పించాలని అన్నారు. గ్రామ సభలో గుర్తించిన పని ప్రదేశాలు కూలీలకు అనువుగా లేక పోవడం వల్ల మేటి పెట్టిన కొలుతలకు అనుగుణగా పని చేయలేక పోతున్నారని, గడ్డ పారలతో తవ్విన మట్టి రావడం లేదని దీనివల్ల రోజుకు 100 రూపాయలు కూలీ



పడడం లేదని అన్నారు.కూలీలకు గడ్డపార, పార పదును చేయించడానికి డబ్బులు చెల్లించాలని, అధికారుల పర్యవేక్షణ ఎల్లవేళలా ఉండాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ రెట్లను 600 రూపాయలకు పెంచాలని, 200 రోజులు కూలీలకు పని కల్పించాలని సృజన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు బోయిని అశోక్ జిల్లా ఉపాధ్యక్షులు ఎగుర్ల మల్లేశం నాయకులు నల్లగొండ శ్రీనివాస్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశం ఎన్నికల విధానంలో సమూల మార్పులు జరగాలి




**కరీంనగర్ వెలుతురు మార్చి 20:**

భారతదేశ ఎన్నికల విధానంలో ఒకే దేశం ఒకే ఎన్నిక ( జమిలి ఎన్నికలు) విధానం అత్యవసరమని నగర పశ్చిమ జోన్ వన్ నేషన్, వన్ ఎలక్షన్ వర్క్ షాప్ కన్వీనర్ నరహరి లక్ష్మారెడ్డి అన్నారు నగర పశ్చిమ జోన్ పరిధిలోని డివిజన్ల రాష్ట్ర, జిల్లా ,జోన్ల బిజెపి నాయకులు, శక్తి కేంద్రం ఇంచార్జీలు, బూత్ అధ్యక్షులతో వన్ నేషన్ వన్ ఎలక్షన్ వర్క్ షాప్ వెస్ట్ జోన్ కన్వీనర్ నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు, సమావేశంలో బిజెపి నాయకులు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో, పార్లమెంటుకు శాసనసభకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఎన్నికల ఖర్చు బాగా తగ్గుతుందని, తరచుగా వివిధ కారణాలతో ఎన్నికలు జరగడం వల్ల దేశం ,రాష్ట్రం అభివృద్ధిలో కుంటు పడుతుందని, ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఒకే దేశం, ఒకే ఎన్నిక విధానంలో ఎన్నికలు నిర్వహించాలని అన్నారు, ఇట్టి ఎన్నిక విధానంపై అన్ని డివిజన్లకూడలిలో సమావేశాలు నిర్వహించి ప్రజలకు తెలియజేయాలని అన్నారు, సమావేశంలో ఒకే దేశం ఒకే ఎన్నిక జిల్లా కన్వీనర్ సాయిని మల్లేశం, నాయకులు దూబాల శ్రీనివాస్, జాడి బాల్ రెడ్డి, బండ రమణారెడ్డి,ఎన్నం ప్రకాష్, వాసు, కో కన్వీనర్ ఎలకపల్లి రమేష్, తిరుమల్ రెడ్డి, ప్రసన్నారెడ్డి సిద్ధి సంపత్, ఉప్పరపల్లి శ్రీనివాస్, పర్వత మల్లేశం, కర్ర ప్రభాకర్ రెడ్డి ,నరోత్తం రెడ్డి, బండారి శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు



# యువత రాజకీయాల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో పీఎం నరేంద్రమోదీ కొత్త చట్టాల అమలుకు వారిని భాగస్వాములు చేస్తున్నారు.

\- ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు మార్చి 20:**

ఆదిలాబాద్ లోని నలంద కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వన్ నేషన వన్ ఎలక్షన్ వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ రెండు రోజుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారి తో పాటు వివిధ కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారు మాట్లాడుతూ... పార్లమెంట్ చట్టాలు రూపొందిస్తే పాలకులకు తప్ప ప్రజలకు తెలిసేది కాదన్నారు. యువత రాజకీయాల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో పీఎం నరేంద్రమోదీ కొత్త చట్టాల అమలుకు వారిని భాగస్వాములు చేస్తున్నారన్నారు. ఒకే సారి అన్ని ఎన్నికలు నిర్వహిస్తే సమయంతో పాటు వందల, వేల కోట్ల ప్రజల ధనం వృథా కాకుండా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు వన్నేషన్ వన్ ఎలక్షన్కు మద్దతు తెలిపాలన్నారు. . ఈ కార్యక్రమంలో ఎన్వైకే అధికారి సుశీల్ బర్డ్, కళాశాల ప్రిన్సిపల్ పున్నరావ్, వైస్ ప్రిన్సిపాల్ విజయ్ గోపాల్, విశ్రాంత అధ్యాపకులు విజయ్ బాబు. బిజెపి నాయకులు ముకుందరావు అశోక్ రెడ్డి శివ త తదితరులు పాల్గొన్నారు









# రక్షణ శాఖలో ఉద్యోగాన్ని సాధించిన చేనేత కార్మిక ని కుమారుడు



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు మార్చ్ 20:**

నిరుపేద పద్మశాలి కుటుంబం చేనేత కార్మికుడైన తండ్రి ఏలే నరసింహ తల్లి పారిజాత లకు ఒక కూతురు, ఒక కుమారుడు అతడే ఏలే సుభాష్ చిన్నంతనం నుండి చదువులో ముందు వరుసలో ఉండేవాడు. బి.టెక్ అనంతరం ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా వివిధ ఉద్యోగ పరీక్ష లకు ప్రిపేర్ అయ్యేవాడు.మొదటగా ఉత్తమ ఎస్.ఎస్.సి - ఎం.టి.స్ పూవాస్తు శాఖ లో ఉద్యోగాన్ని సాధించాడు.ఆర్.ఆర్ బి గ్రూప్ డి లో మరో ఉద్యోగాన్ని సంపాదించాడు. పోస్టల్ డిపార్ట్మెంట్ లో అసిస్టెంట్ పోస్ట్ ఆఫీసర్ గా కొన్నాళ్ళు చౌటుప్పల్ లో విధుకు నిర్వహించాడు. అనంతరం రాష్ట్ర పరిధిలో నిర్వహించిన గ్రూప్ 4 లో ఉద్యోగాన్ని సాధించి ప్రస్తుతం చౌటుప్పల్ మున్సిపాలిటీలో ఉద్యోగీగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ గురువారం రోజు వచ్చిన ఎస్.ఎస్.సి లో సి.జి.ఎల్ లో 6467 ర్యాంక్ రావడం తో కేంద్ర రక్షణ శాఖ పరిధిలో పనిచేసే ఆడిటింగ్ అధికార విభాగం లో ఉద్యోగాన్ని సాధించడం తో సుభాష్ తల్లిదండ్రులు ఆనందంలో మునిగిపోయారు. మిత్రులు, గ్రామస్తులు అభినందించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన కాంగ్రెస్ నాయకులు



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు మార్చ్ 20:**

సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన గుంటోజు వెంకటాచారి కి మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ 25వేల రూపాయల చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేయడం జరిగింది. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని సీఎం సహాయనిది పేదలకు పెన్నిధి అని అన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్క అర్హునికి సీఎం సహాయనిధి చెక్కు అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గడ్డం రవి,మాజీ ఎంపిటిసి సభ్యులు బెల్లంకొండ శంకరయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ కైసర్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం మల్లయ్య, ఎర్ర లక్ష్మయ్య,గడ్డం యాదగిరి,యువజన కాంగ్రెస్ మండల నాయకులు నాతి లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో స్టేషన్ ఘనపూర్ సబ్ రిజిస్ట్రార్

***20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన రామ కృష్ణ***




**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, మార్చి 20:**

జనగాం జిల్లా స్టేషన్ ఘనపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇంచార్జ్ అధికారి రామ కృష్ణ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రైవేట్ అసిస్టెంట్ రమేష్ లు ఓ ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయడానికి 20 వేల రూపాయల లంచం డిమాండ్ చేస్తూ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు, ఒక వ్యక్తి తన ఫ్యామిలీ నుంచి గిఫ్ట్ డీడ్ ను చేసుకోవడానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించగా 20 వేల లంచం డిమాండ్ చేశాడని దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయగా ఏసీబీ అధికారులు గురు వారం నాడు వల వేసి వారిని పట్టుకున్నారు , ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేశారు,

# ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వాలు పనిచేయాలని, రాజకీయాలు ఎన్నికల సమయంలోనే మాత్రమే

\- ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు మార్చి 20:**



ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వాలు పనిచేయాలని, రాజకీయాలు ఎన్నికల సమయంలోనే మాత్రమే అని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు, గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో కేంద్రంలో ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఎవరి సహాయం లేకుండా భవిష్యత్తులో ఆడపిల్లల పెళ్లి చేసే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. అలా రావాలంటే ప్రభుత్వాలు అనేక విధాలుగా ప్రజలకు సహకారం అందించాలన్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాలలో ప్రజా సమస్యలపై ప్రస్తావించడం జరిగిందని పేర్కొన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు వెంటనే లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. లబ్ధిదారులు మధ్య దళారులను నమ్మవద్దని సూచించారు. అలాంటిది ఉంటే తనకు సమాచారం ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించడం జరుగుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అర్బన్ 130, రూరల్ 19, మావల 19, జైనథ్ 30 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సివిఎన్ రాజు, తాసిల్దారులు శ్రీనివాస్, రాజేశ్వరి తదితరులు ఉన్నారు

# పాదయాత్రకు సిద్ధం అవుతున్న కెటిఆర్

## వచ్చే యేడాది ప్రారంభిస్తానని వెల్లడి




**హైదరాబాద్,మార్చి20( వెలుతురు):**
భారాసను అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా వచ్చే ఏడాది నుంచి పాదయాత్ర చేయనున్నట్టు– ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. సూర్యాపేటలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పాదయాత్రపై కసరత్తు జరుగుతోందని, తాను సిద్ధమవుతున్నానని తెలిపారు. అధినేత అనుమతితో వచ్చే ఏడాది నుంచి చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం జిల్లాల పర్యటనలు ప్రారంభించానన్న కేటీ–ఆర్.. డిసెంబరు వరకు పార్టీ బలోపేతం చేసే కార్యక్రమాల్లో నిమగ్నం అవుతామని చెప్పారు. భారాస రజతోత్సవాలతో పాటు– శిక్షణా తరగతులు, సభ్యత్వ నమోదు, కమిటీ–ల ఏర్పాటు– సంస్థాగత కార్యక్రమాలపై దృష్టి పెట్టినట్లు– వివరించారు. పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు అద్భుత స్పందన వస్తోందని, సూర్యాపేట కార్యక్రమానికి బహిరంగసభ తరహాలో జనం తరలివచ్చారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో భారాస అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ తెలిపారు.పాదయాత్ర చేస్తే ముఖ్యమంత్రి అయిపోతారన్న నమ్మకం రాజకీయ నాయకుల్లో బలపడిపోయింది. అందుకే పాదయాత్ర చేయడానికి సిద్ధంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాదయాత్రకు సిద్ధమయ్యారు. వచ్చే ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. బీఆర్ఎస్‌ను అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పాదయాత్ర సాగుతుందని ఆయన అన్నారు. కేటీఆర్ పాదయాత్ర ప్రకటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కేటీఆర్ పాదయాత్ర చేసి పార్టీని గెలిపించి, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారనే పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఉమ్మడి ఎపిలో తొలుత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2003, ఏప్రిల్ 9వ తేదీన పాదయాత్ర చేపట్టారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నుంచి ఈ పాదయాత్ర ప్రారంభం అయింది. మొత్తం 60 రోజుల పాటు– 1,500 కిలో మీటర్లు పాదయాత్ర చేశారు. రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, పశ్చిమ, తూర్పుగోదావరి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల మీదుగా 11 జిల్లాల్లో పర్యటించారు. శ్రీకాకుళంలోని ఇచ్ఛాపురం వద్ద పాదయాత్ర ముగిసింది. మరుసటి సంవత్సరం 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు.టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 'వస్తున్నా.. మీకోసం' పేరిట పాదయాత్ర చేశారు. 62 ఏళ్ల వయసులో 7 నెలల పాటు– కుటుంబానికి దూరంగా ఉంటూ వేల కిలోమీటర్లు నడిచారు. 2012 అక్టోబర్ 2వ తేదీన మహాత్మా గాంధీ జయంతి రోజు ప్రారంభించారు. అంతకుముందు రేవంత్ రెడ్డి కూడా పాదయాత్ర చేశారు. భట్టి విక్రమార్క కూడా చేపట్టారు.

# చిరంజీవికి యూకె పార్లమెంట్ సన్మానం

- లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పుస్కారం అందచేత
- చిరుకు తమ్ముడిగా పుట్టినందుకు గర్విస్తున్నా
- అన్నయ్యకు అభినందనలు తెలిపిని పవన్ కళ్యాణ్

**హైదరాబాద్,మార్చి20( వెలుతురు):**



ప్రముఖ నటుడు చిరంజీవిని హౌస్ ఆఫ్ కామన్స్ యూకే పార్లమెంట్‌లో ఘనంగా సత్కరించారు. లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు. నాలుగున్నర దశాబ్దాలుగా సినిమాల ద్వారా కళారంగానికి, సమాజానికి చేసిన సేవలకుగానూ చిరంజీవికి ఈ గౌరవం దక్కింది. యూకే



అధికార లేబర్ పార్టీ ఎంపీ నవేందు మిశ్రా ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. పార్లమెంట్ సభ్యులు సోజన్ జోసెఫ్, బాబ్ బ్లాక్‌మాన్ తదితరులు పాల్గొన్నారు. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు వైరల్ అవుతున్నాయి. గతేడాది.. చిరంజీవికి గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు, ఏయన్నార్ జాతీయ పురస్కారం, ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ (ఐఫా)– 'అవుట్ స్టాండింగ్ అఛీవ్‌మెంట్ ఇన్ ఇండియన్ సినిమా' గౌరవం దక్కిన సంగతి తెలిసిందే. 156 సినిమాలు, 537 పాటలు, 24 వేల స్టెప్పులతో ప్రేక్షకులను విశేషంగా అలరించినందుకు ఆయన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. అక్కినేని నాగేశ్వరరావు శత వసంతాల వేడుకల్లో భాగంగా ఆ అవార్డును స్వీకరించారు. గతేడాదే.. దేశంలో రెండో అత్యున్నతమైన పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. యూకే పార్లమెంట్‌లో ఘనంగా సత్కరించిన విషయం తెలిసిందే. సినీ, సేవా రంగాల్లో విశేష కృషి చేసిన చిరంజీవికి జీవిత సాఫల్య పురస్కారం అందించింది. చిరుకు ఈ పురస్కారం రావడంపై పవన్‌కల్యాణ్ ఆనందం వ్యక్తంచేశారు. ఆయనకు తమ్ముడిగా పుట్టినందుకు గర్వంగా ఉందన్నారు. ఈ పురస్కారం చిరంజీవి కీర్తిని మరింత పెంచిందన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. సాధారణ మధ్యతరగతి ఎక్సైజ్ జ్ కానిస్టేబుల్ కుమారుడిగా జీవితం మొదలుపెట్టి.. స్వశక్తితో, కళామతల్లి దీవెనలతో మెగాస్టార్‌గా ఎదిగారు. నాలుగున్నర దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా అభిమానులను అలరిస్తున్నారు. ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్నారు. ఆయనకు తమ్ముడిగా పుట్టినందుకు ఎప్పుడూ గర్వంగా ఉంది. ఆయన్ని అన్నయ్యగా కంటే తండ్రి సమానుడిగా భావిస్తాను. నేను జీవితంలో ఏం చేయాలో తెలియక, అయోమయం లో ఉన్న పరిస్థితుల్లో నాకు మార్గం చూపించిన వ్యక్తి మా అన్నయ్య. నా జీవితానికి హీరో చిరంజీవి. తన సేవాగుణంతో ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. తాను ఎదగడమే కాకుండా తన కుటుంబంతో పాటు మరెంతోమంది ఎదుగుదలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సాయం చేశారు ప్రతిభ ఉంటే ఎవరైనా ఏ రంగంలోనైనా రాణించవచ్చు అనడానికి ఉదాహరణగా నిలిచారు. చిరంజీవి సమాజానికి అందించిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారం కూడా అందించింది. తనకు యూకే పార్లమెంట్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించిన వార్త నాకెంతో సంతోషాన్ని కలిగించింది. ఈసందర్భంగా చిరంజీవికి నా అభినందనలు తెలియజేస్తున్నాను. భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకొని మా అందరికీ మార్గదర్శిగా ఉండాలని కోరుకుంటు–న్నాను. ఆ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించిన యూకే అధికార లేబర్ పార్టీ ఎంపీ నవేందుమిశ్రాకు ప్రత్యేక ధన్యవాదాలు' అని పవన్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# లెక్క తప్పిన బడ్జెట్ అంచనాలు

- గత బడ్జెట్ నిధుల ఖర్చుపై పొంతన ఏదీ
- నియోజకవర్గానికి 3550 ఇల్లు ఎక్కడ
- మాజీమంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ప్రశ్న

**హైదరాబాద్,మార్చి20( వెలుతురు):**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ వాస్తవానికి దూరంగా ఉన్నదని, అది తూతూ బడ్జెట్ అని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గురువారం సికింద్రాబాద్‌లోని తహసిల్దార్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సరం బడ్జెట్‌లో ప్రకటించిన నిధులలో ఎంత మేర ఖర్చు పెట్టారో కూడా ప్రజలకు స్పష్టం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలనే కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ లో పొందుపర్చడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు గత బడ్జెట్ లో కూడా ప్రకటించారని, ఎక్కడ ఇచ్చారో చూపిస్తారా అని ప్రశ్నించారు. అధికారం కోసం అనేక రకాల హామీలు ఇచ్చి ప్రజలకు లేనిపోని ఆశలు కల్పించారని, అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా హామీలు అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. వరద ముంపు సమస్య పరిష్కారం కోసం నాలాలలో పూడిక తొలగింపు పనులకు తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకు పూడిక తొలగింపు పనులు ప్రారంభించలేదని, ఇంకెప్పుడు చేపడతారని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరంలో విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, త్రాగునీటికి కటకట ఏర్పడిందని, ట్యాంకర్ లే దిక్కు అన్నట్లు–గా పరిస్థితి మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రభుత్వం ఊక దంపుడు ప్రసంగాలను మానుకోవాలని హితవు పలికారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని అన్నారు. ఇప్పటి–కై–నా ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని చెప్పారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని, ప్రజలు ఎదురు చూస్తున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. సికింద్రాబాద్, అమీర్‌పేట తహసిల్దార్ మండలాల పరిధిలోని 69 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల క్రింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. సికింద్రాబాద్ తహసిల్దార్ పరిధిలో 37 చెక్కులలో 20 కళ్యాణలక్ష్మి, 17 షాదీముబారక్, అమీర్ పేట తహసిల్దార్ పరిధిలో 15 మందికి కళ్యాణలక్ష్మి కింద చెక్కులను పంపిణీ చేశారు. చెక్కుల కోసం వచ్చిన పలువురు లబ్దిదారులు తులం బంగారం ఎప్పుడు ఇస్తారు సారూ అని అధికారులను ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటినా ఇప్పటి వరకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల వెంట ఇస్తామన్న తులం బంగారం హామీ అమలుకు నోచుకోలేదని, లబ్దిదారులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని తలసాని చెప్పారు. అంతేకాకుండా మహిళలకు 2500 రూపాయల ఆర్థిక సహాయం కూడా అమలు కావడం లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని, లేకుంటే ప్రజల నుండి ప్రభుత్వంపై పెద్ద ఎత్తున వ్యతిరేకత ఎదురు కానున్నదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు కొలన్ లక్ష్మి బాల్ రెడ్డి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, సికింద్రాబాద్ తహసిల్దార్ పాండు నాయక్, అమీర్ పేట తహసిల్దార్ కార్యాలయ అధికారులు కిరణ్ కుమార్, కుమార స్వామి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్ గౌడ్, నాయకులు ప్రేమ్ కుమార్, శేఖర్, లక్ష్మిపతి, కూతురు నర్సింహ, రాజేష్ ముదిరాజ్, ఆంజనేయులు, మహేష్ యాదవ్, బలరాం, జమీర్, నోమాన్, వనం శ్రీనివాస్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కండేయ ప్రతిష్ట సాంప్రదాయబద్ధంగా చేశారు

## భక్తి ద్వారమే మోక్ష ద్వారం మాధవానంద స్వామి



**వెలుతురు నారాయణఖేడ్ మార్చ్ 20 .**
సంగారెడ్డి జిల్లా భక్తి ద్వారమే మోక్ష ద్వారమని రంగంపేట పీఠాధిపతి మాధవానంద స్వామీజీ అన్నారు. గురువారం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అనుగ్రహ బాషా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.నారాయణఖేడ్ పట్టణంలో మార్కండేయ ప్రతిష్ట కార్యక్రమాన్ని, భోజన వ్యవస్థని సాంప్రదాయపద్ధంగా నిర్వహించారని రంగంపేట పీఠాధిపతి మాధవానంద స్వామీజీ అన్నారు. నారాయణఖేడ్ పట్నంలో పద్మశాలీలు భక్తి మార్గంలో మార్కండేయ స్థాపనతో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఎంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు కొనసాగిస్తే భగవంతుడు భక్తులను అంత పెద్దగా ఆశీర్వదిస్తారని చెప్పారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ మలమంచి గురురాజు శర్మ, పురోహితులు భక్తుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రయాణికులకు దక్షిణమధ్య రైల్వే శుభవార్త

- వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక రైళ్లు



**హైదరాబాద్,మార్చి20( వెలుతురు):**
ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. వేసవి సందర్భంగా 26 స్పెషల్ వీక్లీ –ట్రైన్స్‌ను నడిపించనున్నట్లు– ప్రకటించింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టు–కొని చర్లపల్లి–కన్యాకుమారి–చర్లపల్లి మధ్య వీక్లీ రైళ్లను నడిపించనున్నట్లు– పేర్కొంది. చర్లపల్లి నుంచి కన్యాకుమారి (07230) రైలు ఏప్రిల్ 2వ తేదీ నుంచి జూన్ 26 వరకు ప్రతి బుధవారం అందుబాటు–లో ఉంటు–ందని చెప్పింది. ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త చెప్పింది. వేసవి సందర్భంగా 26 స్పెషల్ వీక్లీ –ట్రైన్స్‌ను నడిపించనున్నట్లు– ప్రకటించింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టు–కొని చర్లపల్లి–కన్యాకుమారి–చర్లపల్లి మధ్య వీక్లీ రైళ్లను నడిపించనున్నట్లు– పేర్కొంది. చర్లపల్లి నుంచి కన్యాకుమారి (07230) రైలు ఏప్రిల్ 2వ తేదీ నుంచి జూన్ 26 వరకు ప్రతి బుధవారం అందుబాటు–లో ఉంటు–ందని చెప్పింది. అదే రోజు రాత్రి 9.50 గంటలకు రైలు బయలుదేరి.. రెండోరోజు ఉదయం 2.30 గంటలకు గమ్యస్థానం చేరుకుంటు–ందని.. కన్యాకుమారి–చర్లపల్లి (07229) రైలు ఏప్రిల్ 4 నుంచి జూన్ 27 వరకు ప్రతి శుక్రవారం రాకపోకలు సాగిస్తుందని తెలిపింది.

# కోలపల్లి వద్ద రోడ్డు ప్రమాదం


- ఇద్దరురు మహిళలు మృతి




**మెదక్,మార్చి20( వెలుతురు):**
మెదక్ జిల్లా పెద్దశంకరం పేట మండలం కోలపల్లి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. కోలపల్లి వద్ద ఆగి ఉన్న పర్యాటకుల బస్సును ఓ డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతిచెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అయితే బస్సులో ఉన్నవారు కిందకు దిగడంతో భారీ ప్రాణనష్టం తప్పింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం నుంచి 40 మంది పర్యాటకులు టూరిస్టు బస్సులో తీర్థయాత్ర చేస్తున్నారు. ఈ క్రమంలో షిర్డీ నుంచి శ్రీశైలం వెళు_న్నారు. అయితే గురువారం తెల్లవారుజామున బస్సు డ్రైవర్ చాయ్ తాగేందుకు కోలపల్లిలో ఓ హోటల్ వద్ద బస్సు నిలిపారు. వెనుకనుంచి వచ్చిన ఓ డీసీఎం.. బస్సుపైకి దూసుకెళ్లింది. దీంతో బస్సు వద్దే నిల్చున్న ఓ మహిళ అక్కడికక్కడే మరణించారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను జోగిపేటలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అయితే చికిత్స పొందుతూ మరో మహిళ చనిపోయారు. మిగిలినవారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మృతులను నారాయణమ్మ (50), సూరప్పమ్మ (62)గా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్లో 22మంది మావోల హతం

- నక్సల్స్ ముక్త భారత్‌లో పెద్ద విజయమన్న అమిత్ షా



**న్యూఢిల్లీ,మార్చి20( వెలుతురు):**

ఛత్తీస్‌గఢ్‌లోజరిగిన కాల్పుల్లో (22 మావోయిస్టులు మృతి చెందారు. దీంతో మావోలకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవలి ఎన్‌కౌంటర్లలో పదుల సంఖ్యలో మావోలు హతమవుతున్నారు. ఈ ఘటనపై కేంద్రమంత్రి అమిత్ షా స్పందించారు. భారత్‌ను నక్సల్ రహిత దేశంగా మార్చేందుకు చేపట్టిన ఆపరేషన్‌లో ఇది మరో పెద్ద విజయమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నక్సలైట్ల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తోందని పేర్కొన్నారు. అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తున్నా కొందరు నక్సలైట్లు- లొంగిపోవడం లేదు. అలాంటి వారి పట్ల మోదీ సర్కార్ కఠిన వైఖరి అవలంబిస్తోంది. మన సైనికులు 'నక్సల్ ముక్త్ భారత్ అభియాన్' దిశలో మరో పెద్ద విజయాన్ని సాధించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాంకెర్‌లలో మన భద్రతా దళాలు నిర్వహించిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో 22 మంది నక్సలైట్లు- హతమయ్యారు. 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితంగా మారుతుంది' అని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా అమిత్ షా పేర్కొన్నారు. కాగా.. ఒకే రోజు బీజాపూర్, కాంకెర్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఈ కాల్పుల్లో 22 మంది నక్సలైట్లు- ప్రాణాలు కోల్పోయారు. ఈ ఎదురు కాల్పుల్లో ఓ జవాను అమరుడయ్యారు. ఈ విషయాన్ని అధికారులు వెల్లడించారు. బీజాపూర్ - దంతెవాడ జిల్లాల సరిహద్దులో ఉన్న గంగలూరు పరిధి అండ్రి అడవుల్లో నక్సల్స్ నక్కినట్లు- నిఘా సమాచారం వచ్చింది. దీంతో జిల్లాల నుంచి సంయుక్త బలగాలు గురువారం ఉదయం నుంచి అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య భారీ ఎదురుకాల్పులు జరిగాయి. ఈ నేపథ్యంలోనే స్పందించిన అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు.

## వరుషికొండ భవనాలపై ఆలోచన చేస్తున్నాం

- ఎసి సద్దాంగా ఊహించుకున్న జగన్
- అందుకే 700 కోట్లతో భవనాల నిర్మాణం
- జగన్‌పై మంత్రి లోకేశ్ విమర్శలు

**విజయవాడ,మార్చి20( వెలుతురు):**

వైసీసీ నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తనను తాను ఏపీ సద్దాం హుస్సేన్ గా ఊహించుకున్నారని మంత్రి లోకేశ్ మండిపడ్డారు.. 30 ఏళ్ల పాటు- పదవిలో కొనసాగుతానని కలలు కన్నారంటూ లోకేష్ ఎద్దేవా చేశారు. రుషికొండలో నిర్మించిన విలాసవంతమైన ప్యాలెస్ పై స్పందిస్తూ.. పైవిధంగా వ్యాఖ్యానించారు. రుషికొండ ప్యాలస్ గురించి నారా లోకేష్ మాట్లాడుతూ.. 'తొలుత ఇది ఏపీ ప్రభుత్వ పర్యాటక శాఖ ప్రాజెక్ట్.. తర్వాత అది శిశ్ మహల్ గా మారింది. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తనను తాను ఏపీ సద్దాం హుస్సేన్ గా భావించారు. అందుకే మరో 30 ఏళ్ల పాటు తానే పదవిలో ఉంటానని నమ్మి.. అంత విలాసవంతమై భవనాన్ని నిర్మించారని చెప్పుకొచ్చారు. లోకేష్ మాట్లాడుతూ.. 'మా తాత, నాన్న ఇద్దరు ముఖ్యమంత్రులుగా పని చేశారు. కానీ వారి హయాంలో నేను ఇంత విలాసవంతమైన భవనాన్ని, ఇంత పెద్ద గదులను చూడలేదు. శిశ్ మహల్ నిర్మాణం కారణంగా పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ రాష్ట్ర ప్రభుత్వం మీద 200 కోట్ల రూపాయల జరిమానా విధించింది' అని తెలిపారు. 'వైసీపీ అధ్యక్షుడిది చాలా చిన్న కుటుంబం. ఆయన తల్లి, సోదరిలను కుటుంబం నుంచి పంపించి వేశారు. ప్రస్తుతం ఆయన, భార్య, పిల్లలు మాత్రమే ఉన్నారు. కేవలం నలుగురు కుటుంబ సభ్యుల కోసం 700 కోట్ల రూపాయల ఖర్చు చేశారు. ఆఖరికి ప్రధాన మంత్రి కూడా ఇంత పెద్ద ఇంట్లో నివాసం ఉండరని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం ఆ భవనాన్ని ఎలా వినియోగించుకోవాలి అనే అంశంపై ఆలోచనలు చేస్తుంది అని తెలిపారు.

## ప్రజాప్రతినిధుల సాంస్కృతిక ప్రదర్శన

- ఆకట్టుకున్న రఘురామ దుర్యోధన పాత్ర
- బాలచంద్రు వేషధారణలో మంత్రి కందుల దుర్గేశ్
- చప్పట్లతో అభినందించిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్



**విజయవాడ,మార్చి20( వెలుతురు):**

విజయవాడఏ కన్వెన్షన్‌లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు గురువారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలను స్వయంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, తదితరులు హాజరయ్యారు. క్రీడా, సాంస్కృతిక పోటీల విజేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు బహుమతులను అందజేసారు. దుర్యోధనుడు వేషధారణలో ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు ఆకట్టుకున్నారు. ఏమంటివి ఏమంటివి అంటూ ఎన్టీఆర్ డైలాగ్స్‌తో రఘురామకృష్ణంరాజు ఏకాపాత్రాభినయం చేశారు. రఘురామకృష్ణంరాజు డైలాగ్స్‌కు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి సహా సభ్యులంతా చప్పట్లు కొట్టారు. కేరింతలతో ప్రాంగణం మార్మోగింది. తమ తమ స్థానాల్లో నిలబడి రఘురామను మంత్రులు , ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభినందించారు. దానవీరశూర కర్ణ సినిమాలోని ఎన్టీఆర్ డైలాగ్స్‌తో రఘురామ ఏకపాత్రాభినయం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరావులు హాస్య నటనతో ఆకట్టుకున్నారు. ఇరువురు ఎమ్మెల్యేలు పాటలతో హాస్యం పండించారు. ఎమ్మెల్యేల నటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ తదితరులు కడుపుబ్బా నవ్వుకున్నారు. పల్నాటి బాలచంద్రుడి వేష ధారణలో మంత్రి కందుల దుర్గేష్ అదరగొట్టారు. వేషధారణ, అద్భుతమైన డైలాగ్‌లతో అందరినీ ఆకర్షించారు. దుర్గేష్ ప్రదర్శనకు సభ్యుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి.

# 2016లో బెట్టింగ్ యాప్ యాడ్ చేశా

- తరవాత వారితో ఒప్పందం రద్దు చేసుకున్నా
- దానితో తనకు ఎలాంటి సంబంధం లేదు
- నటుడు ప్రకాశ్ రాజ్ వీడియో విడుదల



**హైదరాబాద్,మార్చి 20( వెలుతురు):**

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ యాప్‌ల వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది. వాటికి ప్రచారకర్తలుగా ఉన్న సినీ నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్‌పై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణకు పిలుస్తున్నారు. ఈ జాబితాలో సీనియర్ నటుడు ప్రకాశ్‌రాజ్ పేరు కూడా ఉంది. ఈ వ్యవహారం తన దృష్టికి రావడంతో ప్రకాశ్‌రాజ్ స్పందించారు. ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేశారు. ప్రస్తుతం నేను ఒక విలేజ్‌కు షూటింగ్ కోసం వచ్చాను. ఆన్‌లైన్ గేమింగ్ యాప్ కేసుల గురించి, నేను చేసిన యాడ్ గురించి చర్చ జరుగుతోందని ఇప్పుడే నాకు తెలిసింది. అందరినీ ప్రశ్నించే నేను సమాధానం చెప్పాలి కదా! 'అలాంటి ప్రకటన ఎలా చేస్తార'ని అందరూ నన్ను ప్రశ్నిస్తున్నారు. 2016లో ఆ యాడ్ నా దగ్గరకు వచ్చింది. చేసిన మాట నిజం. అది తప్పని కొద్ది నెలల్లోనే తెలుసుకున్నా. 2017లో నా అగ్రిమెంట్ పొడిగిస్తానని వాళ్లు అడిగితే, 'ఆ యాడ్ తెలియక చేశాను. ఏడాది కోసం అగ్రిమెంట్ అయిపోయింది కాబట్టి, వెంటనే దాన్ని ఆపమని మీకు చెప్పలేకపోయా. ఇక ఆ యాడ్‌ను ప్రసారం చేయొద్దు. నేనూ నటించను' అని చెప్పాను. దాని తర్వాత ఏ గేమింగ్ యాప్‌లకు ప్రచారకర్తగా పనిచేయలేదని తెలిపారు. 2021లో లో ఆ కంపెనీ ఇంకో కంపెనీకి అమ్మేస్తే, ఏదో సోషల్‌మీడియా వేదికలో నా ప్రకటన వాడారు. అందుకు వాళ్లకు లీగల్ నోటీ-సులు పంపాను. ఆ ప్రకటన తొలగించాలని వాట్సాప్ ద్వారా కూడా సంప్రదించాను. వెంటనే వాళ్లు ఆపేశారు. ఇప్పుడు మళ్లీ అది లీకైంది. అందువల్లే ఈ సమాధానం చెబుతున్నా. ఇప్పటివరకూ పోలీస్‌శాఖ నుంచి నాకు ఎలాంటి సందేశం రాలేదు. వస్తే, వాళ్లకు వివరణ ఇస్తా. 9ఏళ్ల కిందట అదీ, ఏడాది కాంట్రాక్ట్ కోసం పనిచేసిన మాట వాస్తవం. మళ్లీ ఆ యాడ్ చేయలేదన్నది నిజం. ఈ సందర్భంగా మీ అందరికీ ఒక విషయం చెప్పాలనుకుంటు-న్నా. గేమింగ్ యాప్స్ ఒక వ్యసనం. యువత దీనికి దూరంగా ఉండండి. మీ జీవితం కోల్పోకండని ప్రకాశ్‌రాజ్ తెలిపారు.

## అడిషనల్ కలెక్టర్ తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

- రాజకీయాల గురించి మాట్లాడవద్దని హితవు

**జగిత్యాల,మార్చి 20( వెలుతురు):**

పలు సందర్భాల్లో అధికారుల మధ్య వివాదాలు తలెత్తడం అరుదుగా చూస్తుంటాం. ప్రోటోకాల్‌తో పాటు- కార్యక్రమాల ఏర్పాటు సంబంధిత విషయాల్లో అధికారులు, ఎమ్మెల్యేల మధ్య చిన్నపాటి వివాదాలు చెలరేగిన సందర్భాలు ఉన్నాయి. ఎమ్మెల్యేల మాటలను లెక్క చేయకుండా తమ ఇష్టానుసారంగా ప్రవర్తించిన అధికారులపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటనలు ఉన్నాయి.తాజాగా జగిత్యాల జిల్లాలోనూ ఇలాంటి ఘటన ఒకటి చోటు చేసుకుంది. జగిత్యాల అడిషనల్ కలెక్టర్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య నెలకొన్న వివాదం పెను దుమారాన్ని రూపుతోంది. జగిత్యాల అడిషనల్ కలెక్టర్ వర్సెస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నట్లుగా పరిస్థితులు మారాయి. ఓ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీలత చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఓ అధికారిగా ఉంటూ ఇలాంటి కామెంట్స్ తగదని అన్నారు. యువతకు చెడు సంకేతాలు వెళ్తాయంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనంగా మారాయి. దేశంలో పొలిటికల్ పొల్యూషన్ ఎక్కువైందని అడిషనల్ కలెక్టర్ శ్రీలత అన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అంశంపై మాట్లాడుతూ శ్రీలత ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే అడిషనల్ కలెక్టర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక బాధ్యతగల అధికారి ఇలా మాట్లడకూడదని సూచించారు. సీరియస్ అంశాన్ని జనరలైజ్ చేసి మాట్లాడకూడదని అన్నారు. ఈ వ్యాఖ్యల వల్ల యువతకు చెడు సంకేతాలు వెళ్తాయని చెప్పుకొచ్చారు. బాధ్యత గల అధికారిగా ఉంటూ రాజకీయ నేతలా మాట్లాడవద్దని అడిషనల్ కలెక్టర్ శ్రీలతకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హితవుపలికారు. ప్రస్తుతం ఎమ్మెల్యే చేసిన ఈ వ్యాఖ్యలు హాట్‌టాపిక్‌గా మారాయి.

## బ్యాంకులకు వరుసగా నాలుగురోజులు సెలవులు

- యధావిధిగా ఆన్‌లైన్ సేవలు




**న్యూఢిల్లీ,మార్చి 20( వెలుతురు):**

బ్యాంకులు వరుసగా నాలుగు రోజుల పాటు మూతపడనున్నాయి. వారాంతంతో పాటు బ్యాంకుల సమ్మె ఇందుకు కారణం. వచ్చే వారం దేశవ్యాప్తంగా బ్యాంకులు సమ్మెబాట పట్టనున్నాయి. తమ డిమాండ్ల పరిష్కారం కోసం యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ సమ్మెకు పిలుపునిచ్చింది. మార్చి 23వ తేదీన అర్ధరాత్రి నుంచి మార్చి 25 వరకు సమ్మె కొనసాగనుంది. దీంతో ఆ రెండు రోజుల పాటు బ్యాంకు సేవలు నిలిచిపోనున్నాయి. డిమాండ్ల పరిష్కారం కోసం ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ తో జరిగిన చర్చలు విఫలమవడంతో యూఎఫ్‌బీయూ సమ్మెకు పిలుపునిచ్చింది . రెండు రోజుల పాటు బ్యాంకుల సమ్మెతో భారత ఆర్థిక రంగం స్తంభించిపోనుంది ఈ సమ్మెలో ప్రభుత్వ, ప్రైవేట్‌రంగ బ్యాంకులతో పాటు- ప్రాంతీయ, గ్రామీణ బ్యాంకు సిబ్బంది కూడా పాల్గొననున్నారు. అయితే వచ్చే వారంలో బ్యాంకుల సమ్మె అయినప్పటికీ ముందు నుంచే అంటే మార్చి 22 నుంచే బ్యాంకు సేవలు నిలిచిపోనున్నాయి. మార్చి 22న నాల్గవ శనివారం, తరువాత ఆదివారం బ్యాంకులకు సెలవులు. ఆపై మార్చి 24, 25 సోమ, మంగళవారం బ్యాంకుల సమ్మె నేపథ్యంలో దాదాపు నాలుగు రోజుల పాటు- బ్యాంకు సేవలకు అంతరాయం కలుగనుంది. బ్యాంకు సేవలు నిలిచిపోనున్నప్పటికీ ఆన్‌లైన్ సేవలు మాత్రం అందుబాటు-లో ఉండనున్నాయి. అలాగే ఏటీఎం సేవలు కూడా అందుబాటులో ఉంటాయని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. రెండు రోజుల పాటు సెలవులు, రెండు రోజుల పాటు- సమ్మె కారణంగా నగదు లావాదేవీలు, చెల్లింపులు, అడ్వాన్సులు వంటి బ్యాంకింగ్ సేవలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. తాత్కాలిక ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించడం, అన్ని బ్యాంకులకు ఐదు రోజుల పని దినాలను అమలు చేయడం, పనితీరు సమీక్షలను ఉపసంహరించుకోవడం, దాడుల నుంచి బ్యాంకు అధికారులు, సిబ్బందికి భద్రత కల్పించడం. గ్రాచ్యుటీ చట్టాన్ని సవరించడం వంటి డిమాండ్లతో బ్యాంకులు సమ్మె బాట పడుతున్నాయి.

## అర్హత ఉన్నవారు భరణం కోరడం తగదు

- భరణం కేసులపై ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,మార్చి 20( వెలుతురు):**

ఇటీవల కాలంలో విడాకులు, తప్పుడు కేసులను పేర్కొంటూ భర్తల్ని హింసించే భార్యల కేసులు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో పాటు పరిస్థితులకు అనుగుణంగా లేని భరణాన్ని డిమాండ్ చేస్తున్నారు. వీటిపై ఇటీవల సుప్రీంకోర్టుతో పాటు- పలు హైకోర్టులు కీలక వ్యాఖ్యలు చేశాయి. తాజాగా, ఢిల్లీ హైకోర్టు మహిళ దాఖలు చేసిన భరణం పిటిషన్‌పై కామెంట్స్ చేసింది. సంపాదించే సామర్థం ఉన్న, అర్హత కలిగిన మహిళలు తమ భర్తల నుంచి మధ్యంతర భరణాన్ని కోరకూడదని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. గురువారం ఓ కేసులో జస్టిస్ చంద్రధారి సింగ్ మాట్లాడుతూ.. సీఆర్‌పీసీ లోని సెక్షన్ 125(భార్యలు, పిల్లలు, తల్లిదండ్రుల పోష) జీవిత భాగస్వాముల మధ్య సమానత్వాన్ని కొనసాగించడానికి, భార్యలు, పిల్లలు, తల్లిదండ్రులకు రక్షణ కల్పించడానికి ఈ సెక్షన్ ఉద్దేశమని, 'పని చేయకుండా ప్రోత్సహించేందుకు కాదు' అని అన్నారు. దీంతో విడిపోయిన భర్త నుంచి మధ్యంతర భరణాన్ని నిరాకరిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ని హైకోర్టు కొట్టివేసింది. ఆస్ట్రేలియా నుంచి మాస్టర్స్ డిగ్రీ, దుబాయ్‌లో పనిచేసిన అనుభవం కలిగిన మహిళ భరణాన్ని డిమాండ్ చేయడాన్ని కోర్టు తప్పుపట్టింది. పిటిషనర్‌గా ఉన్న మహిళలకు ప్రపంచ వ్యవహారాలపై విస్తృత అవగాహన ఉందని, బలమైన విద్య నేపథ్యం ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. జీవనోపాధి కోసం భాగస్వాములపై ఆధారపడే మహిళల మాదిరిగా కాకుండా, ఆమె స్వయంగా సంపాదించే అవకాశం ఉందని, భరణంపై ఆధారపడకుండా ఉద్యోగం వెతుక్కోవాలని కోర్టు ఆమెకు సూచించింది.




# ఐపిఎస్ అభిషేక్ మహంతికి ఊరట

- క్యాట్ ఆదేశాలపై 24 వరకు హైకోర్టు స్టే



**హైదరాబాద్,మార్చి20( వెలుతురు):**

ఐపీఎస్ అధికారి అభిషేక్ మహంతికి హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఏపీలో రిపోర్టు చేయాలంటూ డీవోపీటీ జారీ చేసిన ఉత్తర్వులపై ఈనెల 24 వరకు స్టే విధించింది. తెలంగాణలో ఐపీఎస్‌గా విధులు నిర్వహిస్తోన్న అభిషేక్ మహంతిని ఏపీలో రిపోర్టు చేయాలని గత నెలలో డీవోపీటీ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ అభిషేక్ మహంతి కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ క్యాట్‌ని ఆశ్రయించారు. స్టే ఇచ్చేందుకు నిరాకరించిన క్యాట్.. డీవోపీటీ-, తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలకు నోటీ-సులు జారీ చేస్తూ విచారణ వాయిదా వేసింది. డీఓపీటీ- ఉత్తర్వుల మేరకు ఈనెల 20వ తేదీలోపు ఏపీలో రిపోర్టు చేయాల్సి ఉండగా.. అభిషేక్ మహంతి హైకోర్టును ఆశ్రయించారు. డీఓపీటీ ఉత్తర్వులపై క్యాట్ స్టే ఇవ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. తెలుగు రాష్ట్రాల విభజన సందర్భంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కేటాయించారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. తెలంగాణకు చెందిన అభిషేక్ మహంతిని నిబంధనలకు విరుద్ధంగా ఏపీకీ కేటాయించారని ఆయన వాదించారు. గతంలో ఈ కేటాయింపులపై డీఓపీటీకి హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసిందని, అఖిల భారత సర్వీసు అధికారుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని మళ్లీ కేటాయింపులు చేయాలని ఆదేశించినట్లు- తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు అభిషేక్ మహంతి తన స్థానికతతో పాటు-... సర్వీసు వివరాలన్నీ డీఓపీటీ-కి సమర్పించారని, వీటిని పరిగణనలోకి తీసుకోకుండా మళ్లీ ఏపీకీ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. పిటీ-షనర్ వాదనలు విన్న హైకోర్టు డీఓపీటీ- తో పాటు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు నోటీ-సులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.

## తిరుమల క్యూలైన్ వద్ద ఘర్షణ

- పరస్పరం వాగ్వాదంలో ఒకరికి గాయాలు

**తిరుమల,మార్చి 20( వెలుతురు):**

తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చిన భక్తుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అది కాస్తా ఘర్షణగా మారింది.చివరకు ఓ భక్తుడు ఆసుపత్రి పాలయ్యాడు. గురువారం తిరుమలలోని సీఆర్వో కార్యాలయం వద్ద భక్తులు క్యూ లైన్‌లో నిల్చున్నారు. ఆ క్రమంలో తన కుమారుడిని తోసిన వ్యక్తిపై అతడి తండ్రి ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆ క్రమంలో ఇద్దరి మధ్య మాట మాట పెరిగింది. దీంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అదే సమయంలో క్యూ లైన్‌లోని వ్యక్తులంతా కలిసి... యువకుడి తండ్రిని కొట్టారు. దీంతో ఆగ్రహించిన ఆ తండ్రి.. తన చేతిలోని గాజు బాటిల్‌తో ఎదుటి వ్యక్తిపై దాడి చేశాడు. తలకు తీవ్ర గాయం కావడంతో.. తోటి భక్తుడు ఆసుపత్రి పాలయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న టీటీడీ విజిలెన్స్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ క్రమంలో జరిగిన ఘటనపై ఆరా తీశారు. అనంతరం గాజు సీసాతో దాడి చేసిన వ్యక్తిని వారు అదుపులోకి తీసుకున్నారు. అయితే దాడి కారణంగా ఆసుపత్రిలో చేరిన వ్యక్తికి ప్రాణాపాయం లేదని.. అయితే బలమైన గాయం అయితే అతడికి తగిలిందని వైద్యులు వెల్లడించారు.

## కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన మంత్రి సీతక్క

**మహబూబాబాద్,మార్చి20( వెలుతురు):**

కొత్తగూడ మండలంలో బాలికల గురుకుల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రభుత్వం కల్పించిన అవకాశాలను విద్యార్థులు వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సీతక్క సూచించారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నట్లు- పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం కొత్తగూడ మండలకేంద్రంలో చలివేంద్రం ప్రారంభించారు. కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

## వైభవంగా ఖాద్రి నారసింహుడి బ్రహ్మోత్సవాలు

**కదిరి,మార్చి20( వెలుతురు):**

శ్రీ సత్యసాయి జిల్లా ఖాద్రీ లక్ష్మీనర సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లోభాగంగా గురువారం కదిరిలో ఖాద్రీ లక్ష్మీనారసింహుడి బ్రహ్మరథోత్సవం జరిగింది. ఇందు కోసం అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఉచిత రవాణా, భోజనం, తాగునీరు తదితర ఏర్పాట్లను అధికారులు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కదిరి పట్టణంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాలికల కళాశాల ఆవరణలో నిర్వహించిన పౌరాణిక ప్రదర్శనకు వేలాది మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన చింతామణి, సత్యహరిశ్చంద్ర, రామాంజినేయుద్ధం నాటకాలు ఆకట్టు-కున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన కళాకారులు తమ ప్రదర్శ నతో ఆకట్టుకున్నారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సహకారంతో నిర్వహించిన ఈ పౌరాణిక నాటక ప్రదర్శన, హరికథా కాలక్షేపం ఆకట్టుకొంది.

# చికెన్, మటన్ లలో కల్తీ...



**హైదరాబాద్, మార్చి 20, ( వెలుతురు)**

ఆదివారం వచ్చిందంటే చాలు చాలా మందికి ముక్కలేనిదే ముద్ద దిగదు. మాంసాహారులకు ఇష్టమైన చికెన్, మటన్, చేపలు వీటిలో ఏదో ఒకటి ఆ రోజు ఇంట్లో ఉడకాల్సిందే. ఆదివారం వచ్చిందంటే మాంసం ప్రియులు ఉదయం నుంచే ఆ దుకాణాలు ముందు బారులుదీరుతుంటారు. కొన్ని చోట్ల అయితే పొడవాటి క్యూలు దర్శనం ఇస్తుంటాయి. ఇటీవల బర్డ్ ఫ్లూ భయం ఎక్కువగా ఉండడంతో చాలా మంది చికెన్ కు బదులు మేక మాంసం కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీనిని సొమ్ము చేసుకునేందుకు కొందరు వ్యాపారులు కనీస ప్రమాణాలు పాటించకుండానే మాంసం విక్రయిస్తున్నారు. అసలు ఆ జీవాలు సురక్షితమేనా.. పోనీ కోసిన మటన్ అన్నా ఫ్రెష్ దేనా అన్నది వినియోగదారులు ఓ సారి పరిశీలించాలి.మాంసాహారులకు ఇష్టమైన చికెన్, మటన్లను కల్తీ చేస్తూ కొంతమంది ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇలాంటి వారి షాపులపై జీహెచ్ఎంసీ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. పలుమార్లు హెచ్చరించినప్పటికీ నిబంధనలు పాటించని షాపులను అధికారులు సీజ్ చేస్తున్నారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో లైసెన్స్ లేకుండా మాంసం దుకాణాలు నిర్వహిస్తున్న వాటిని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల బృందం కొన్ని చోట్లు భారీ ఎత్తున మాంసాన్ని పట్టుకుని సీజ్ చేశారు.బర్డ్‌ఫ్లూ భయం పెరిగిపోవడంతో ప్రజలు జీవాలు, చేపల మీద ఆసక్తి చూపిస్తున్నారు. అదే అదునుగా కొందరు రూల్స్ అతిక్రమించి విక్రయాలు చేస్తున్నారు. కిలోకు ఏకంగా ధర రూ.100-200 పెంచేశారు. ఎక్కడో కోసి నగరానికి తీసుకొచ్చి దుకాణాల్లో విక్రయిస్తున్నారు.అసలు అవి బతికి ఉన్నాయా.. లేక చనిపోయిన వాటిని తెచ్చి అమ్ముతున్నారా అన్న విషయం కూడా గోప్యమే.హైదరాబాద్ మంగళహాట్ చిస్తీ చమాన్ లో ఓ మేక మాంసం దుకాణం పై సౌత్ వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్, జీహెచ్ఎంసీ సర్కిల్ 14 ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి మహమ్మద్ అఫ్రోజ్ (40)అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద పాయ, తలకాయ, బ్రెయిన్, కిడ్నీ, మేక గొర్రె లివర్ సుమారు 12 టన్నుల బీఫ్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.8లక్షల వరకు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. అఫ్రోజ్ చెడిపోయిన మేక గొర్రెల మాంసాన్ని చిస్తీ చమాన్ లోని దుకాణం లో ఫ్రిజ్ లో నిల్వ చేసి తక్కువ ధరకే హెటళ్లు, శుభకార్యాలకు సప్లై చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# సజ్జలకు జగన్ వార్నింగ్




**విజయవాడ, మార్చి 20, ( వెలుతురు)**

వైసీపీ ప్రస్తుత ఉన్న పరిస్థితికి కారణం వైయస్ జగన్ తో పాటుగా సజ్జల రామకృష్ణారెడ్డి అనేది రాజకీయ వర్గాల్లో ఉన్న అభిప్రాయం. 2019లో 151 స్థానాలతో అత్యంత ఘనవిజయం సాధించిన పార్టీ.. 2024 ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితం కావడాన్ని వైసిపి కార్యకర్తలు అసలు జీర్ణించుకోవడం లేదు. అటు వైసీపీ నేతలకు కూడా ఈ ఓటమి ఇంకా మింగుడు పడటం లేదని చెప్పాలి. 2010 నుంచి కష్టపడి 2019లో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన వైయస్ జగన్.. అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు, మాట్లాడిన మాటలు వైసీపీని బాగా ఇబ్బంది పెట్టాయి.దానికి తోడు పార్టీ నేతలు కూడా ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం.. పార్టీని మరింత ఇబ్బందులకు గురిచేసిందని చెప్పాలి. ఇంకా పార్టీ నేతలను జగన్ కు దూరం చేయడం కూడా వైసిపి పతనానికి కారణమనే అభిప్రాయాలు చాలామంది నుంచి వినిపించాయి. ముఖ్యంగా వైసీపీ కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డి.. వైయస్ జగన్ కు పార్టీ కార్యకర్తలకు మధ్య వారధిగా వ్యవహరిస్తూ.. జగన్ ను కార్యకర్తలకు, పార్టీ నాయకులకు దూరం చేశారనే అభిప్రాయాలు అప్పట్లో చాలా వరకు వైసిపి నేతల నుంచే వినిపించాయి.ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు ఏం చేయాలన్నా సరే సజ్జల రామకృష్ణారెడ్డి అనుమతి ఉండాల్సిన పరిస్థితి తీసుకొచ్చారు అప్పట్లో. ఇక వైసిపి సోషల్ మీడియా కూడా విజయసాయిరెడ్డి నుంచి సజ్జల రామకృష్ణారెడ్డి లాక్కున్నారు. వైసీపీలో రామకృష్ణారెడ్డి ఆయన కుమారుడు భార్గవ్ రెడ్డి పెత్తనమే ఎక్కువగా కనపడింది. దీనితో విజయసాయిరెడ్డి విసిగిపోయి జగన్ కు దూరమయ్యారు. సాయిరెడ్డి రాజకీయాల నుంచి తప్పుకోవడానికి ప్రధాన కారణం అదే. ఈ విషయాన్ని స్వయంగా విజయ సాయి రెడ్డి వెల్లడించారు.అయితే ఇప్పుడు సజ్జల రామకృష్ణారెడ్డి విషయంలో వైయస్ జగన్ జాగ్రత్త పడుతున్నట్లు సమాచారం. పార్టీ కార్యక్రమాలకు రామకృష్ణారెడ్డిని దూరంగా ఉంచాలని జగన్ భావిస్తున్నారట. పార్టీ నేతలతో కూడా ఎటువంటి సమావేశాలు నిర్వహించొద్దని.. పార్టీ నేతలతో కూడా టచ్ లో ఉండవద్దని సజ్జల రామకృష్ణారెడ్డికి.. జగన్ స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. గతంలో ఆయన సాక్షిలో కీలకపాత్ర పోషించారు. ఇప్పుడు కూడా సాక్షికి పరిమితం కావాలని జగన్ చెప్పినట్లు సమాచారం. సాక్షిలో ఎడిటర్ గా సజ్జల వైసీపీ అనుకూలంగా ఎన్నో కథనాలు రాసేవారు.పార్టీ ప్రజల్లోకి వెళ్ళడానికి ఇది బాగా ఉపయోగపడేది. ఇప్పుడు దానికి మాత్రమే ఆయన పరిమితం కావాలని.. కొన్నాళ్లపాటు పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటే మంచిది అని జగన్ సున్నితంగా హెచ్చరించినట్లు సమాచారం. అలాగే తాడేపల్లి నివాసంలో కూడా సజ్జల రామకృష్ణారెడ్డి ఉండకూడదు అని జగన్ చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. విజయసాయిరెడ్డి వ్యవహారంతో కంగుతిన్న వైయస్ జగన్.. మరిన్ని ఇబ్బందులు రాకుండా ఉండేందుకు రామకృష్ణారెడ్డిని దూరంగా పెడుతున్నట్లు సమాచారం.

# గజ్వేల్ లోనూ రచ్చ....

**మెదక్, మార్చి 20, ( వెలుతురు)**




ఎమ్మెల్యేగా గెలిచా. లక్షల్లో జీతం తీసుకుంటా. ప్రతిపక్ష నేతగా ఉంటా. ఫాంహౌజ్‌లోనే పడుకుంటా. అసెంబ్లీకి రాను. ప్రజల్లోకి రాను. గజ్వేల్ సమస్యలు పట్టించుకోను. అంతా నా ఇష్టం. నన్ను ఎవర్రా అడిగేది. ఇలా దొరతనంతో విర్రవీగే రోజులు పోయాయి. ప్రజలు తిరగబడే గడియలు వచ్చాయి. కేసీఆర్ అయితే ఏంది? గులాబీ దళపతి అయితే మాకేంది? మా ఎమ్మెల్యే.. మమ్మల్ని పట్టించుకోడా? అంటూ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై తిరగబడుతున్నారు గజ్వేల్ ప్రజలు.అవును, ప్రజలకు విసుగొచ్చింది. గజ్వేల్ ఎమ్మెల్యేగా గెలిపించుకుని ఏడాది దాటేసింది. గడిచిన ఏడాదిలో ఒక్కటంటే ఒక్కసారి కూడా ఫాంహౌజ్ గడీ దాటి బయటకు వచ్చింది లేదు. స్థానిక ప్రజలను కలిసింది లేదు. వారి గోడు విన్నది లేదు. ఎమ్మెల్యేగా జీతం మాత్రం తీసుకుంటున్నారు. ఆ జీతం సొమ్ము 50 లక్షలకు పైనే ఉందని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు కూడా. ఆ ప్రకటన చూశాక.. గజ్వేల్ ప్రజల్లో అసహనం తలెత్తింది. మా పన్నులతో జీతం తీసుకుంటూ.. మా ఎమ్మెల్యేగా పదవి అనుభవిస్తూ.. మమ్మల్ని పట్టించుకోరా అంటూ.. గజ్వేల్ క్యాంప్ ఆఫీసును ముట్టడించారు స్థానికులు & మల్లన్నసాగర్ నిర్వాసితులు.కేసీఆర్ క్యాంప్ కార్యాలయానికి టూలెట్ బోర్డు తగిలించారు. అంటే, ఆఫీసుకు కేసీఆర్ రారు కాబట్టి ఖాళీగా ఉన్నట్టే. అందుకే టూలెట్ బోర్డు పెట్టారు. వాంటెడ్ గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ అంటూ మరో బోర్డు కూడా గేటుకు కట్టారు. కేసీఆర్ కనిపించడం లేదు. మిస్సింగ్. అందుకే, వాంటెడ్ కేసీఆర్ అంటూ గజ్వేల్ పబ్లిక్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రజలతో బీజేపీ శ్రేణులు కూడా కలిసిరావడంతో.. కేసీఆర్ క్యాంప్ ఆఫీసు దగ్గర రచ్చ రచ్చ అయింది. ఇష్యూ పొలిటికల్ టర్న్ తీసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు ఎంట్రీ ఇచ్చి.. బీజేపీ కార్యకర్తలను, ప్రజలను కంట్రోల్ చేశారు.గజ్వేల్ ఇంత జరుగుతుంటే.. ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త కూడా స్పందించలేదు. కేసీఆర్ అంటే పార్టీ కేడర్ కు కూడా విసుగు పుట్టేసింది. తమకు అందుబాటులో ఉండని లీడర్ తమకెందుకు అనే నిర్ణయానికి వచ్చేశారు. గులాబీ బాస్ పై సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. ఇప్పటికిప్పుడు గజ్వేల్ లో ఎన్నికలు వస్తే కేసీఆర్ కు డిపాజిట్ వచ్చుడు కూడా కష్టమే అంటున్నారు. అంతగా కేసీఆర్ పై వ్యతిరేకత నెలకొంది గజ్వేల్‌లో.గజ్వేల్‌లోనే అని కాదు. తెలంగాణ వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందంటున్నారు. ఎన్నికలు అయ్యాక కేసీఆర్ ముఖం చూసిన వారు ఏ కొద్దిమందో. పబ్లిక్ లోకి రావాలంటే భయపడుతున్నారో.. ఓటమితో ముఖం చెల్లడం లేదే ఏమో.. కేసీఆర్ ఉనికే లేదు. అటు అసెంబ్లీలో మాట్లాడరు.. ఇటు ప్రజాక్షేత్రంలోకి రారు. గత పాలనలో జరిగిన లక్షల కోట్ల అవినీతి.. చేసిన అప్పులు.. ఫోన్ ట్యాపింగ్ అరాచకాలు.. కరెంట్, రేస్ కార్ స్కాంలు.. ఇలా ఎన్ని విమర్శలు ముంచెత్తుతున్నా.. సీఎం రేవంత్ రెడ్డి ఎంతగా మాటలతో అటాక్ చేస్తున్నా.. కేసీఆర్ లో మాత్రం ఉలుకూలేదు.. పలుకూలేదు. అనేది నన్ను కాదులే అన్నట్టు ఫాంహౌజ్‌లో పడుంటున్నారు. ఆయన తరపున కేటీఆర్, హరీశ్ రావులు మైకుల ముందు మాట్లాడుతున్నా.. గత అరాచకాలపై గళం విప్పాల్సింది కేసీఆరేగా. కొడుకు, అల్లుడు కాదుగా.. అనేది అధికారపక్షం వెర్షన్. ఇలా పొలిటికల్ ఫైట్ ఎలా ఉన్నా.. ఇప్పుడు గజ్వేల్ ప్రజల్లోనూ తిరుగుబాటు వస్తుండటం.. కేసీఆర్ క్యాంప్ ఆఫీసు ముట్టడించడం చిన్నవిషయమేమీ కాదు. ఈ అలజడి ముందుముందు ఉప్పెనలా మారి తెలంగాణ వ్యాప్తంగా కేసీఆర్‌పై తిరుగుబాటు రావడం ఖాయంగా కనిపిస్తోంది.

# మహానగరానికి మంచినీటి గండం...

**హైదరాబాద్,మార్చి 20, ( వెలుతురు)**



విశ్వనగరం హైదరాబాద్‌లో తాగునీటి సమస్య రోజురోజుకీ తీవ్రమవుతోంది, ముఖ్యంగా వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో ఈ సమస్య మరింత ఆందోళనకరంగా మారుతోంది. నగరానికి నీటి సరఫరా ప్రధానంగా నాగార్జున సాగర్, మంజీరా, కృష్ణా, గోదావరి వంటి జలాశయాలపై ఆధారపడి ఉంది. అయితే, ఈ జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గడం, భూగర్భ జలాలు అడుగంటడం, అకాల వర్షాలు లేకపోవడం వంటి కారణాలతో తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. మార్చి నాటికి, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు అధికారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలను కోరుతున్నారు. జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీటి కంటే అదనంగా అందించే సామర్థ్యం లేదని తెలిపారు. భూగర్భ జలాలు తగ్గిన ప్రాంతాల్లో వాటర్ ట్యాంకర్ల డిమాండ్ పెరుగుతోందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు కాలనీల్లో ఇప్పటికే నీటి ఎద్దడి మొదలైందని, కొన్ని చోట్ల జలమండలి సరఫరా సరిపడక ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ మహానగరంలో భూగర్భ జలాలు అంతకంటే రెట్టింపు వేగంతో అడుగంటిపోతున్నాయి. తాజా సర్వే దీనికి సాక్ష్యంగా నిలుస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు వరకు సుమారు 948 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో జలమండలి సాంకేతిక నిపుణులతో నిర్వహించిన సర్వేలో, కేవలం 27 చదరపు కిలోమీటర్లు మినహా మిగిలిన 921 చదరపు కిలోమీటర్లలో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయిలో తగ్గిపోయినట్లు నివేదికలో తెలిపారు. హైటెక్ సిటీ, మాదాపూర్, శేరిలింగంపల్లి, కూకట్పల్లి మొదలైన 15 డివిజన్లలో అత్యధికంగా 4.5 లక్షల వాటర్ ట్యాంకర్లను 22,000 మంది పదేపదే బుక్ చేసుకున్నట్లు రికార్డులు వెల్లడించాయి. హైదరాబాద్ చరిత్రలో ఇంతవరకు ఎన్నడూ లేని విధంగా ట్యాంకర్లు ఇంత భారీ సంఖ్యలో బుక్ కావడం గమనించిన అధికారులు, భూగర్భ జలాలపై సర్వేలు చేపట్టారు. ఈ సర్వేలో ఆశ్చర్యకర వాస్తవాలు బయటపడ్డాయి. హైటెక్ సిటీ పరిసరాల్లోని ఐక్యా చుట్టూ దాదాపు 5 కిలోమీటర్ల వ్యాసార్థంలో వర్షపు నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి దాదాపు లేనట్లు అధికారులు గుర్తించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది వర్షపాతం ఎక్కువగా నమోదైనప్పటికీ, సిమెంట్ టాపింగ్‌లు, ఇంకుడు గుంతలు లేకపోవడంతో పడిన వర్షం నీరంతా డ్రైనేజీ రూపంలో మూసీ నదిలోకి వెళ్లిపోతోంది. ప్రతిరోజూ 11 వేల ట్యాంకర్లను నగరవాసులు బుక్ చేస్తున్నారు, ఇది గతంతో పోలిస్తే 100% కంటే ఎక్కువ డిమాండ్‌ను సూచిస్తోంది. హైటెక్ సిటీ, శేరిలింగంపల్లి, కూకట్పల్లి, నిజాంపేట్, ప్రగతి నగర్, మాదాపూర్, మణికొండ, ఎస్సార్ నగర్ వంటి ప్రాంతాల్లో ట్యాంకర్ల డిమాండ్ అత్యధికంగా ఉంది. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో అపార్ట్‌మెంట్లలోని బోర్లు పనిచేయడం లేదు, ఫలితంగా ఈ ప్రాంతాలు పూర్తిగా జలమండలి ట్యాంకర్లపై ఆధారపడుతున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు వరకు నీటి సరఫరా కోసం జలమండలి ప్రస్తుతం 81 వాటర్ ఫిల్లింగ్ స్టేషన్లను నిర్వహిస్తోంది. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరో 17 స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. 2024లో హైదరాబాద్ నగరానికి 586 ట్యాంకర్లతో సరఫరా జరిగితే, ప్రస్తుతం 678 ట్యాంకర్లను ఉపయోగిస్తోంది. ఈ అదనపు డిమాండ్‌ను తీర్చేందుకు జలమండలి సిబ్బందిని కూడా నియమించింది.ఈ సంక్షోభానికి పరిష్కారంగా, ప్రభుత్వం మిషన్ భగీరథపథకం ద్వారా నీటి సరఫరాను మెరుగుపరిచే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, వేసవిలో డిమాండ్ పెరిగే కొద్దీ ఒత్తిడి పెరుగుతోంది. అదనంగా, చెరువులు, కాలువల ఆక్రమణలు తొలగించడం, వర్షపు నీటి సంరక్షణను ప్రోత్సహించడం వంటి చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ, నీటి వినియోగంలో ప్రజల సహకారం లేకుండా ఈ సమస్యను అధిగమించడం కష్టమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తగా, నీటిని వృథా చేయకుండా ఉపయోగించడం, రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం, చిన్నపాటి నీటి నిల్వలను ఏర్పాటు చేసుకోవడం వంటివి ప్రజలు చేయాల్సి ఉంది. లేకపోతే, రాబోయే నెలల్లో హైదరాబాద్‌లో తాగునీటి ముప్పు తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉంది.

# బెజవాడలో సేవ్ బీసెంట్ రోడ్...

**విజయవాడ, మార్చి 20, ( వెలుతురు)**

విజయవాడలో ప్రధాన వాణిజ్య ప్రాంతమైన బీసెంట్ రోడ్డులో అనధికారిక వ్యాపారాలు రాజకీయ నాయకులకు కాసులు పండిస్తున్నాయి. మునిసిపల్ రోడ్డును హాకర్లకు అద్దెలకిస్తూ ప్రతి నెల లక్షలు పోగేసుకుంటున్నారు. ఈ దందా శృతి మించడంతో వ్యాపారులు సేవ్ బీసెంట్ రోడ్డు కాంపెయిన్ ప్రారంభించారు.విజయవాడ బీసెంట్ రోడ్డులో వ్యాపారులు ప్రారంభించిన సేవ్ బీసెంట్ రోడ్డు ఉద్యమం చర్చనీయాంశంగా మారింది. పేదల ఉపాధి మాటున సాగుతున్న దందాను తెరపైకి తెచ్చింది. దశాబ్దాలుగా సాగుతున్న వ్యవస్థీకృత దందాను బయటపెట్టింది. సొంత భవనాల్లో పరాయి వారిలా వ్యాపారాలు చేసుకునే దుస్థితి యజమానులదైతే, పొట్ట కూటి కోసం రోడ్లపై వ్యాపారాలకు కూడా అద్దె చెల్లించాల్సిన పరిస్థితి బడుగు జీవులది.విజయవాడ వీధుల్లో వ్యాపారాలు కూడా రోజుకు లక్షలు సంపాదించి పెడతాయంటే నమ్మశక్యం కాదు. ఈ లాభాలు వ్యాపారాలు చేసే వారికి కాకుండా వారికి అండగా ఉంటామని చెప్పే నేతలకు కావడం విశేషం. ఏళ్ల తరబడి వ్యవస్థీకృతంగా సాగుతోన్న ఈ దందాలో తాజాగా రాజకీయ పోరు మొదలైంది.విజయవాడలో ప్రధాన మార్గలైన ఏలూరు రోడ్డు-బందరు రోడ్డులను కలుపుతూ ఉండే బీసెంట్ రోడ్డులో వందలాది వాణిజ్య సంస్థలు ఉంటాయి.గుండు సూది మొదలుకుని వస్త్రాలు, ఆభరణాలు ఇలా ఏమి కావాలన్నా ఈ మార్కెట్‌కు వెళితే దొరుకుతాయి. రోడ్డుకు ఇరువైపులా ఉండే దుకాణాల ముందు మరో దందా ఉంటుంది. ఈ రోడ్డులో ప్రతి దుకాణం ముందు నాలుగైదు బుట్టలు, టేబుళ్లు, తోపుడు బళు ఉంటాయిబీసెంట్ రోడ్డులో ఉండే రద్దీతో పాటు ఆ తాత్కలిక దుకాణాలకు కూడా దశాబ్దాల చరిత్ర ఉంది. భవనాల్లో సాగే వ్యాపారాలకు మునిసిపల్, కమర్షియల్ టాక్సలు, ఎలక్ట్రికల్ బిల్లులు ఉంటే రోడ్లపై సాగే వ్యాపారాలకు ప్రజాప్రతినిధుల టాక్స్ ఉంటుంది. వ్యాపారం స్థాయిని బట్టి రోజు వారీ అద్దెను వసూలు చేస్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారాలను కొందరు కార్మిక సంఘాల నాయకులతో పాటు మాజీ ప్రజా ప్రతినిధి పంచేసుకుని.. వాటిని విభజించి తమ అనుచరులకు ప్రాంతాల వారీగా అప్పగించారు.ఇలా ఒక్కో వ్యాపారానికి రోజుకు రూ.500 నుంచి రూ.1500 వరకు అద్దె వసూలు చేస్తారు. దాదాపు కిలోమీటరు పొడవు ఉండే బీసెంట్ రోడ్డుకు ఇరువైపులా 200వందల మందికి పైగా చిరు వ్యాపారులు ఉంటారు.ఈ వీధి వ్యాపారులపై భవనాల్లో వ్యాపారాలు చేసే వారికి అక్కసుగా ఉన్నా వారి వెనుక ఉన్న నేతలకు భయపడి ఎవరు ప్రశ్నించే సాహసం కూడా చేసేవారు కాదు.బీసెంట్ రోడ్డుకు ఇరువైపులా రెండు మూడు ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన నేతలు సొమ్ము చేసుకోవడం కూటమి ప్రభుత్వంలో ఓ నాయకుడికి ఆగ్రహం కలిగించింది. తాము అధికారంలో ఉంటే ప్రతిపక్షంలో ఉన్న వారు దందా చేయడం ఏమిటని భావించడంతో తాజా రగడ మొదలైంది. ప్రజా ప్రతినిధి అండతో రోడ్డు మధ్యలో కొత్తగా తోపుడు బళ్లను ఏర్పాటు చేయించడంతో వివాదం మొదలైంది. మార్చి 12న కొత్తగా 20 తోపుడు బళ్లను రోడ్డు మధ్యలో ఏర్పాటు చేయడంతో వివాదం ముదిరింది.నిజానికి బీసెంట్ రోడ్డులో షోరూమ్‌లలో చేసే వ్యాపారాలకు, రోడ్లపై చేసే వ్యాపారాలకు సంబంధం ఉండదు. రోడ్లపై విక్రయించే వస్తువులు ప్రధానంగా పేదలు, మధ్య తరగతి వర్గాలకు అవసరమైనవి ఉంటాయి. దుస్తులు, చెప్పులు, పళ్లు, అలంకార వస్తువులు, ఫ్యాన్సీ వస్తువులు, గార్మెంట్స్ విక్రయాలు జరుగుతుంటాయి. చిరు వ్యాపారులకు ఉపాధి కావడంతో వ్యాపారులు కూడా సర్దుకుపోతూ వచ్చారు. చివరకు పరిస్థితి కాస్త ఒంటె, గుడారం తరహాలో తయారైందిఇన్నాళ్లు రెండు వరుసల వ్యాపారాలతో రోడ్డు అడుగు తీసి అడుగు వేయలేనంత రద్దీగా ఉంటే తాజాగా మూడో వరుసలో వ్యాపారాలు ప్రారంభించడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. ఈ వివాదం వెనుక ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు ఉండటంతో అధికారులు కూడా వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారు. మార్చి 12 నుంచి బీసెంట్ రోడ్డులో వ్యాపారాలపై పట్టు కోసం ఘర్షణలు జరుగుతున్నాయి. కొత్తగా 20 తోపుడు బళ్లను స్థానిక ప్రజా ప్రతినిధి అనుచరులు ఏర్పాటు చేయడంతో వివాదం మొదలైంది.రోడ్డు వ్యాపారాల వివాదంపై అధికారులకు పూర్తి సమాచారం ఉన్నా చోద్యం చూస్తున్నారు. ఈ రోడ్డులో అనధికారిక వసూళ్లలో విజయవాడ పోలీసులకు కూడా భాగం ఉండటంతో వివాద పరిష్కారం జోలికి పోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రోడ్లపై అనధికారిక వ్యాపారాలను తొలగిస్తే అందరి జేబులకు చిల్లు పడుతుందనే ఉద్దేశం నాయకులకు ఉంది. దీంతో ఎవరు వెనక్కి తగ్గడం లేదు. కొత్తగా వ్యాపారాల కోసం తీసుకొచ్చిన బళ్లపై దాడులు, ప్రతి దాడులు జరుగుతున్నాయి.బీసెంట్ రోడ్డు వివాదంపై వ్యాపారులు, భవన యజమానులు మంత్రి నారా లోకేష్‌ను ఆశ్రయించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. నారా లోకేష్ వివాద పరిష్కార బాధ్యతను విజయవాడ ఎంపీకి అప్పగించారు. పగలు, రాత్రి తేడా లేకుండా రోడ్లను పూర్తిగా ఆక్రమించి ఉంచడంతో దుకాణాలకు సరుకు తెచ్చుకునే పరిస్థితి కూడా లేదని వాపోతున్నారు.వీధి వ్యాపారుల నుంచి వసూళ్లు ప్రతి నెల రూ.40.50లక్షల వరకు ఉండటంతో వాటి మీద పట్టుకోసం పార్టీల మధ్య యుద్ధం జరుగుతోంది. పేరుకు పేదల బతుకు దెరువు ఉన్నా వాటి వెనుక రాజకీయ నాయకుల వసూళ్ల దందా ఉండటంతో ప్రభుత్వ యంత్రాంగం చూసి చూడనట్టు వ్యవహరిస్తోంది. వివాదం పరిష్కారమైనా ఉన్న దాంట్లో అందరి వాటాల లెక్క తేలినా చాలని భావిస్తున్నారు. మరోవైపు ఆక్రమణలు పెరిగి పోవడంతో వ్యాపారులు సేవ్ బీసెంట్ రోడ్డు అంటూ తమ దుకాణాల ముందు ప్రచారం చేస్తున్నారు. బ్రాండ్ ఏపీ అని ప్రచారం చేస్తోన్న ప్రభుత్వం అక్రమ వసూళ్ల దందాకు ఎలా ముగింపు పలుకుతుందో చూడాలి.

# కోతులు..బాబోయ్... కోతులు

**కరీంనగర్, మార్చి 20, ( వెలుతురు)**

ఇప్పుడు పంటలు సాగు చేయాలంటే రైతులు భయపడుతున్నారు. వరి మినహా.. ఇతర పంటలు సాగు చేయాలేకపోతున్నారు. ఇప్పుడు వరిపై కూడా దాడి చేస్తున్నాయి. వరి చేలపై దాడి చేస్తున్న వానరాలు, పొట్ట దశలోనే తింటున్నాయి. కోతులు భయానికి.. కూరగాయాలతో పాటు వేరుశనగ, మొక్కజొన్న, కందులు, పెసర్లు, మినుములు లాంటి పంటలు వేయలేకపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులకు కొత్త సమస్య తలెత్తుతోంది. దాదాపు 250కు పైగా గ్రామాల్లో కోతులు బెడద తీవ్రమైంది. ఇటీవల గ్రానైట్ తవ్వకాల కారణంగా కొండల్లో ఉండాల్సిన కోతులు గ్రామాల్లోకి చేరిపోయాయి. ఇక తిండి కోసం యుద్ధం చేస్తున్నాయి. ఈ రెండేళ్లలో వీటి సంతానం భారీగా పెరిగిపోయింది. మనుషుల కంటే.. కోతుల సంఖ్యనే ఎక్కువగా కనబడుతుంది.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గతంలో.. వేరుశనగ, మొక్కజొన్న, కంది, పెసర్లు, బబ్బెర్లు, మినుము, ఇతర ఆరుతడి పంటలను సాగు చేసేవారు. ఇటీవల మొక్కజొన్న మినహా మిగతా పంటలకు మద్దతు ధరను పెంచుతుంది కేంద్ర ప్రభుత్వం. అయితే ఈ పంటలను సాగు చేద్దామంటే, కోతులు ఇబ్బంది పెడుతున్నాయి. ఇలాంటి పంటలు సాగు చేసే అవకాశం ఉన్న ఎర్ర నేల భూములు కూడా.. నారుమల్లుగా మారిపోతున్నాయి. అంతేకాదు, ఇప్పుడు బీడుగా పెడుతున్నారు. భారీ వర్షం కురిస్తే మాత్రం నాటు వేయనున్నారు. ఆరు తడి పంటలు వేయాలంటేనే రైతులు జంకుతున్నారు.పంటపొలాలపై కోతులు దాడి చేసి నాశనం చేస్తున్నాయి. ఒక్క వేళా విత్తనాలు వేసిన వెంటనే తినేస్తున్నాయి. కష్టంగా కాపాడిన.. పంట చేతికి వచ్చే సమయంలో మళ్లీ దాడులు చేసే తినేస్తున్నాయి. దాదాపు ఇలాంటి పంటలను సాగు చేయడం మానేశారు రైతులు. ఒక కూరగాయల సాగు కూడా చేయడం లేదు. కూరగాయాలు చేతికొచ్చే సమయానికి.. మొత్తం తినేస్తున్నాయి కోతులు. చివరకు.. మిర్చిని కూడా తింపి కింద పడవేస్తున్నాయని రైతులు గోడు వెళ్లబోసుకుంటున్నారు. ముఖ్యంగా మానకొండూరు, తిమ్మాపూర్, శంకరపట్నం. చిగురుమామిడి, రామడుగు, గంగాధర, మల్యాల, కొడిమ్యాల తదితర మండలాల్లో అధికంగా ఉన్నాయి కోతులు.కోతుల భయానికి ఇతర పంటలు వేస్తున్నారు రైతులు. ఈ సంవత్సరం కోతుల ప్రభావం ఉన్న గ్రామాల్లో వరి మినహా.. ఇతర పంటలు వేయడం లేదు. పప్పుదినుసులకు మద్దతు ధర ఉన్నా.. సాగు చేసుకోలేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలోనే కోతులను పట్టుకుని దట్టమైన ప్రాంతాల్లో వదిలిపెట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు. కోతుల కారణంగా కూరగాయాల సాగుతో పాటు వరి మినహా.. ఇతర పంటలను సాగు చేసుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. కోతులను తరిమేసిన పంటలను కాపాడాలని రైతన్నలు వేడుకుంటున్నారు..

# కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్



**కరీంనగర్, మార్చి 20, ( వెలుతురు)**

మానకొండూర్ నియోజకవర్గంలో అధికార విపక్ష పార్టీలు కాంగ్రెస్– బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డెక్కారు. సిట్టింగ్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అవినీతికి పాల్పడుతున్నాడని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించడంతో, ఆరోపణలు నిరూపించాలని కాంగ్రెస్ నేతలు బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. బెజ్జంకి అంబేద్కర్ విగ్రహం సాక్షిగా చర్చకు రావాలని డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే అనుచరులతో పాటు కాంగ్రెస్ నాయకులు ఆరు మండలాల నుంచి బెజ్జంకి కి బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. కొందరు బెజ్జంకి అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని రసమయి రావాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్– బీఆర్ఎస్ హంగామాతో పోలీసులకు ముచ్చెమటలు పట్టించారు. కొందరు రసమయి ఫామ్ హౌస్ వైపు దూసుకెళ్లడంతో పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. ఓవైపు కాంగ్రెస్ కార్యకర్తలు మరోవైపు బిఆర్ఎస్ శ్రేణులు పరస్పర ఆరోపణలు విమర్శలతో ఆందోళన దిగడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు భారీగా మోహరించి ఎక్కడికక్కడ ఇరుపార్టీల నాయకులను కార్యకర్తలను అరెస్టు చేశారు.అధికారంలో ఉన్నప్పుడు అక్రమంగా కాలువ నీళ్లను గుండారంలో నిర్మించుకున్న ఫామ్ హౌస్ కు రసమయి తరలించుకుపోయాడని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. రసమయి తీరుపై ఆరు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పై చేసిన ఆరోపణలు నిరూపించకుంటే తరిమికొట్టక తప్పదని హెచ్చరించారు. బహిరంగ చర్చకు రాకుంటే ఫామ్ హౌస్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. నియోజకవర్గంలో తిరగకుండా చేస్తామన్నారు.మాజీ ఎమ్మెల్యే రసమయి తోపాటు బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ వైఖరిని ఎండ గట్టేందుకు సిద్ధం కాగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. బెజ్జంకి మండలం గుండారంలోని ఫామ్ హౌస్ లో ఉన్న రసమయిని గృహ నిర్బంధం చేశారు. కాంగ్రెస్ తీరు, ఎమ్మెల్యే వైఖరిపై రసమయి బాలకిషన్ ఆందోళన వ్యక్తం చేశారు. తాను చేసిన ఆరోపణలు నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని విచారణ జరిపిస్తే అన్ని బయటపడుతాయని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి 6 మండలాలకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు తన ఫామ్ హౌస్ పై దాడి చేసి తనను చంపేందుకు ఉసిగొలిపాడని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. కొద్దిరోజులుగా మానకొండూరు నియోజకవర్గం లో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మధ్యం మాటల యుద్ధం కొనసాగుతుంది. చివరకు బహిరంగ చర్చకు సవాళ్ళ పర్వం ఉద్రిక్తతకు దారి తీసింది. ఇరు పార్టీల శ్రేణులను అరెస్టు చేసిన పోలీసులు తాత్కాలికంగా ఆందోళనకు కట్టడి చేశారు. ఇరు పార్టీలు తగ్గేదేలేదంటు ఎంతటికైనా తెగించడంతో రాజకీయ పోరాటం ఎటువైపు దారి తీస్తుందోనని సర్వత్రా రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

# హమాస్‌కు మద్దతుగా సోషల్ మీడియా ప్రచారం

***అమెరికాలో భారత విద్యార్థి బాదర్ ఖాన్ అరెస్ట్***

**వాషింగ్టన్, మార్చి 20, ( వెలుతురు)**

పాలస్తీనా ఉగ్రవాద సంస్థ హమాస్ తరపున సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణలతో భారతీయ విద్యార్థి బాదర్‌ఖాన్ సూరిని అమెరికా భద్రతా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బాదర్ ఖాన్ వాషింగ్టన్‌లోని జార్జ్‌టౌన్ విశ్వవిద్యాలయంలో రీసెర్చర్‌గా ఉన్నారు. సోమవారం అర్ధరాత్రి వర్జినీయాలోని ఆయన నివాసం వద్ద ఫెడరల్ ఏజెంట్లు– ఆయన్ని అరెస్టు చేశారు. ఆయన వీసాను కూడా రద్దు చేసినట్లు– యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ–స్ (డిహెచ్ఎస్) తెలిపింది. సోషల్ మీడియాలో హమాస్‌కు మద్దతు ప్రచారం చేయడంతో.. అతన్ని అదుపులోకి తీసుకున్నామని, ఆయన్ని భారత్‌కు పంపించే ప్రయత్నాలు చేస్తున్నట్లు– డిహెచ్ఎస్ స్పష్టంచేసింది. కాగా, తన అరెస్టు, బహిష్కరణపై బాదర్‌ఖాన్ ఇమ్మిగ్రేషన్ కోర్టులో సవాల్ చేశారు. తన భార్య పాలస్తీనా మూలాలు ఉండడంతోనే అమెరికా ప్రభుత్వం ఈ చర్యలకు దిగిందని, తనకు ఎలాంటి నేర చరిత్ర లేదని బాదర్ ఖాన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. బాదర్‌ఖాన్ భారత్‌కు చెందిన వ్యక్తి. అయితే అతని స్వస్థలంకి సంబంధించిన వివరాలపై స్పష్టత లేదు. అయితే అతని విద్యాభ్యాసం భారత్‌లోనే గడిచినట్లు– తెలుస్తోంది. న్యూఢిల్లీలోని జామియా మిల్లియా ఇస్లామియా యూనివర్సిటీలో పీస్ అండ్ కాన్‌ఫ్లిక్ట్ స్టడీస్‌పైన పిహెచ్‌డి చేశారు. ఆ తర్వాత ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లో శాంతిస్థాపనకు సంబంధించిన అంశాలపై పరిశోధనలు చేశారు. అమెరికాకు వలస వెళ్లిన బాదర్.. మఫెజ్ అహమద్ యూసఫ్ అనే పాలస్తీనా మూలాలు ఉన్న అమెరికన్ పౌరురాలిని వివాహం చేసుకున్నారు. అయితే ఆమె తండ్రి హమాస్‌లో కీలక నేత అయిన అహ్మద్ యూసెఫ్‌గా డిహెచ్ఎస్ ప్రకటించింది.

# 61 లక్షల ట్రావెల్ అలవెన్స్...

**హైదరబాద్, మార్చి 20, ( వెలుతురు)**



తెలంగాణ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ కు నోటీసులు ఇచ్చేందుకు జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ సిద్ధమైంది. యూనివర్సిటీ నుంచి వాహన అద్దెకు తీసుకున్న నిధులపై అడిట్ విభాగం అభ్యంతరం తెలిపిది స్మితా సబర్వాల్ కు నోటీసులు ఇవ్వాలని యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారని సమాచారం. సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్‌ను అద్దె కారు వివాదం చుట్టుముట్టింది. ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్శిటికీ తన కారు అద్దె చెల్లింపు బిల్లులు పంపి డ్రా చేసుకున్నారని ఆడిట్‌లో తేలింది. కారుకు అద్దె పేరుతో యూనివర్శిటీ నుంచి రూ.61 లక్షల రూపాయలు బిల్లులు పెట్టి వసూలు చేసుకోవడంపై అభ్యంతరాలు మొదలయ్యాయి. ఇటీవల వర్శిటీలో నిధుల దుర్వినియోగం, అక్రమాలపై ప్రభుత్వం విచారణ జరిపిస్తోంది. ఈ విచారణలో స్మితా సభర్వాల్ కు రూ.61 లక్షలు చెల్లించినట్లు గుర్తించారు అధికారులు.వాహన అద్దె కింద తీసుకున్న రూ.61 లక్షల నిధులను తిరిగి చెల్లించాలని మరో రెండ్రోజుల్లో ఆమెకు అధికారులు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది.2016 నుంచి 2024 వరకు సీఎంవో అదనపు కార్యదర్శిగా పనిచేసిన స్మితా సబర్వాల్ 90 నెలలకు గాను వాహన అద్దె కింద రూ. 61 లక్షలు తీసుకున్నారు. ఈ నిధులపై అభ్యంతం వ్యక్తం చేసిన ఆడిట్ విభాగం...న్యాయ నిపుణుల సూచనల మేరకు ఆమెపై చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. స్మితా సభర్వాల్ తీసుకున్న కారు టీఎస్ 08 ఈసీ 6345 వాహనం నాన్ టాక్స్ కాదు. ఎల్లో ప్లేట్ వాహనం కూడా కాదు. ఈ వాహనం ప్రైవేటు వ్యక్తిగత వాహనం. పవన్‌కుమార్ పేరిట ఉన్నట్లు ఆడిట్ విచారణలో తేలింది. సీఎంవో ఉన్న సమయంలో స్మితా సభర్వాల్ కార్యాలయం నుంచి ప్రతి నెలా వాహనం అద్దె రశీదులు రావడంతో వర్సిటీ యాజమాన్యం డబ్బులు చెల్లించినట్లు తేల్చింది.ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ పని తీరుపై తీవ్రమైన విమర్శలు వచ్చాయి. ఇటీవల జరిపిన విచారణలో కొన్ని అవకతవకలు జరిగినట్టు తేలాయి. అందులో స్మిత సబర్వాల్ అద్దె కారు వ్యవహారం కూడా ఉంది. స్మితా సభర్వాల్ వాహనం అద్దెపై ఆడిట్ అభ్యంతరం చేయడం నిజమేనని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ తెలిపారు.ఏజీ ఆడిట్ ఆధారంగా అంతర్గత విచారణ జరిపించామని స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని విశ్వవిద్యాలయం పాలకవర్గం దృష్టికి వచ్చిందన్నారు. సమావేశంలో దీనిపై విస్తృతంగా చర్చించామని తెలిపారు. దీనిపై సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సమర్పించనున్నామని వర్సిటీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం, న్యాయ నిపుణుల సూచనల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నాయి.యూనివర్శిటీ అడిటింగ్ లో స్మితాసబర్వాల్ కు సంబంధించిన ఓ విషయం బయటపడింది. స్మితా సబర్వాల్ నెలకు రూ.63 వేలు వాహన అలెవెన్స్ తీసుకున్నట్లు అడిట్ అధికారులు గుర్తించారు. యూనివర్శిటీ నుంచి వెహికల్ అలవెన్స్ కింద మొత్తం 90 నెలలకు రూ.61 లక్షలు తీసుకోవడంపై ఆడిట్ అధికారుల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంపై యూనివర్సిటీ బోర్డు మీటింగ్?లో అధికారులు చర్చించారు. స్మితా సబర్వాల్ వర్సిటీ నుంచి తీసుకున్న డబ్బులు తిరిగి రాబట్టాలని బోర్డు మీటింగ్ లో నిర్ణయించినట్లు సమాచారం.ఈ విషయంపై ప్రభుత్వానికి రెండు మూడు రోజుల్లో పూర్తి నివేదిక అందించనున్నారు. అనంతరం స్మితా సబర్వాల్? కు నోటీసులు జారీ చేసి నిధులు తిరిగి రాబట్టాలని వర్సిటీ అధికారులు యోచిస్తోన్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ హయాంలో కీలక పదవుల్లో ఉన్న స్మితా సబర్వాల్ ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలు విషయంలో విచారణ ఎదుర్కొంటున్నారు. తాజాగా యూనివర్శిటీ నిధుల వ్యవహారంలో స్మితా సబర్వాల్ పేరు వినిపిస్తుంది.

# క్రాస్ రోడ్స్ లో తీన్మార్ మల్లన్న




**హైదరాబాద్, మార్చి 20, ( వెలుతురు)**

తీన్ మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్. కాంగ్రెస్ పార్టీ నుంచి తాజాగా బహిష్కరణకు గురైన ఎమ్మెల్సీ. కులగణన సర్వేని బహిరంగంగా తగులబెట్టి అధిష్టానం ఆగ్రహనికి గురైన మల్లన్న, తేగేవరకూ లాగి చివరకు అధికార కాంగ్రెస్‌కు దూరమయ్యారు. కానీ ఎమ్మెల్సీ పదవికి మాత్రం రాజీనామా చేయబోనంటూ, అలా కంటిన్యూ అవుతున్నారు. ఇంతవరకూ అంతా బాగానే ఉంది. అయితే తాజా పరిణామాలు చూస్తుంటే ఈ ఎమ్మెల్సీ మల్లన్న, ఆ తీన్‌మార్ మల్లన్నేనా అనేంతలా పరిస్థితులు మారిపోయాయి. లేకా పరిస్థితులకు అనుకూలంగా మల్లన్న మారిపోయారా అనిపిస్తోంది ఆయనను దగ్గరగా గమనిస్తున్నవారికి. తాజాగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ తీర్మానం చేసింది. మండలికి పంపిన బిల్లు సైతం ఆమోదం పొందింది. అయితే ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే..ఏ కులగణన సర్వే తప్పుల తడక అంటూ రేవంత్ రెడ్డి సర్కార్‌పై దుమ్మెత్తిపోశాడో మల్లన్న, అదే కులగణన సర్వే ఆధారంగా బీసీలకు కేటాయించిన 42శాతం రిజర్వేషన్లకు మాత్రం మద్దతు తెలిపేశారు. బీసీ జనాభా సర్వేలో తగ్గించారు. లక్షల మంది బీసీలు, బతికున్న చనిపోయినట్లుగా సర్వేలో తప్పుడు లెక్కలు చూపించారు అంటూ రోజుల తరబడి ప్రచారం చేసిన మల్లన్నకు ఇప్పుడు ఏమైంది. కులగణన సర్వేపై ఆగ్రహంతో ఆ ప్రతులు కాల్చివేసి, బహిరంగంగా చేసిన విమర్శలే కదా మల్లన్నను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ అయ్యేలా చేసింది. జరిగిన నష్టం జరిగిపోయిన తరువాత ఇప్పుడు మళ్లీ సర్వే ఆధారంగా కేటాయించిన రిజర్వేషన్లపై మల్లన్న ఎందుకు మెత్తబడ్డారు. బీసీలకు మద్ధతుగా ఒక్క గొంతు అరచి గీపెట్టుకున్నా ఫలితం లేదు అనుకుని సర్దుకుపోయారా, లేక ఒకవేళ తాను బిల్లును వ్యతిరేకిస్తే ఎవరైతే తన బలంగా భావించి రాజకీయాల్లో సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నాడో అటువంటి బిసిలను దూరం చేసుకుంటే రాజకీయం మనుగడ కష్టమని భావించారా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. అడిగింది ఎలాగో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇవ్వదు, ఇచ్చిన దానితోనే సర్దుకుపోదామని వెనక్కి తగ్గారు అనే వాదలు కూడా ఉన్నాయి. ఇలా మల్లన్న నాలుక మడతపెట్టడంపై రాజకీయ ప్రయోజనాలు ఎలా ఉన్నా... బిసిలకు వ్యతిరేకత లేకండా సేఫ్ గేమ్ అడుతున్నారని అర్ధమవుతోంది. తాజాగా కేటిఆర్‌ను మల్లన్న అసెంబ్లీ లాబీలో కలవడం పెనుదుమారం రేపింది. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నన్నాళ్లు రోజూ కేసిఆర్, కేటీఆర్,హరీష్‌రావు ఇలా గత ప్రభుత్వాన్ని తిట్టినతిట్టు తిట్టకుండా తన సోషల్ మీడియా వేదికపై దుమ్మెత్తిపోశారు మల్లన్న. ఆయన చేసిన ఆరోపణలు అన్నీఇన్నీ కాదు, ఒక్కమాటలో చెప్పాలంటే గత ప్రభుత్వం కూలిపోవడంలో మల్లన్న విమర్శలు సైతం కొంతవరకూ పని చేశాయి. ఇప్పుడు కేటీఆర్‌ను కలిసిన మల్లను చూస్తుంటే తీన్‌మార్ మల్లనేనా అనిపిస్తోంది. బిసి బిల్లుకు బిఆర్ఎస్ మద్ధతు కోరడంతోపాటు జంతర్‌మంతర్ దీక్షకు రావాలంటూ కేటీఆర్‌ను ఆహ్వానించడం, గతం గతః అన్నట్లు కేటీఆర్ సైతం నవ్వుతూ మల్లన్నతో మంతనాలు చేయడం చూస్తున్నవారు సైతం షాకైయ్యారు. బిఆర్ఎస్ మద్ధతు ఎలాగో కాంగ్రెస్ కోరుతుంది. కానీ పని గట్టుకుని మల్లన్న కేటీఆర్‌ను కలవడం చూస్తుంటే బిఆర్ఎస్‌కు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారా అనే టాక్ కూడా వినిపిస్తోంది. ఇదిలా ఉంటే మల్లన్న తాజాగా వ్యహరిస్తున్న తీరుపై అనేక సందేహాలు లేకపోలేదు. రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన మల్లన్న ఉన్నట్లుండి ఎందుకిలా మారిపోయారు. బిఆర్ఎస్‌ను పొట్టుపొట్టున తిట్టి, రేవంత్కు జాన్ జిగిరి అయ్యాడు. మరి ఉన్నట్లుండి ఇలా రేవంత్‌కు రామ్‌రామ్ చెప్పి బిఆర్ఎస్ నేతలతో మంతనాలు చేయడానికి అంత వ్యక్తిగత కారణాలు లేవు. అలా అని బిసిల కోసమే అంటే ఇప్పుడు ఇచ్చిన రిజర్వేషన్‌తో సరిపెట్టకుంటూ సై అంటున్నారు. ఇలా ఇవన్నీ చూస్తుంటే రేవంత్ రెడ్డి చెప్పినట్లు మల్లన్న పొలిటికల్ గేమ్ ఆడుతున్నారు అందుకే కటీఫ్ చెప్పినట్లే చెప్పి, కార్యాచరణ మాత్రం అమలు చేస్తున్నారానే విమర్శలు వినిపిస్తున్నాయి.


# హైడ్రాకు హైకోర్టు తలంటు...

## పెద్దవాళ్లవి మీకు కనపించవా...



**హైదరబాద్, మార్చి 20, ( వెలుతురు)**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం హైడ్రా వ్యవస్థను తీసుకొచ్చారు. ఇప్పటికే వందల అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు నేలమట్టం చేశారు. అయితే హైడ్రా పూర్తిగా పక్షపాతంగా వ్యవహరిస్తుందని.. డబ్బున్న బిల్డర్లను వదిలేసి పేదల ఇండ్లను కూల్చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. పలు సందర్భాల్లో హైకోర్టు హైడ్రా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా మరోసారి హైడ్రాపై తెలంగాణ హైకోర్టు ఫైరయిందిపేదలకు చెందిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంతో సరిపెట్టడం కాదని.. పెద్దల నిర్మాణాలను తాకి చూడాలని హైడ్రాను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేసింది. పేదలకు వర్తించే చట్టాలు పెద్దలకు వర్తించవా? అని నిలదీసింది. సంపన్నులకు ఏమైనా ప్రత్యేక చట్టాలున్నాయా అని ప్రశ్నించింది. రికివాడల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసి పేపర్లలో ఫొటోలు వేయించుకోవడం కాదని.. సంపన్నులు ఉండే దుర్గం చెరువు, మియాపూర్ చెరువుల్లో ఆక్రమణలనూ తొలగించాలని.. అప్పుడే ప్రజాప్రయోజనాలను పరిరక్షించినట్లవుతుందని అన్నారుహైదరాబాద్ శివారు రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్‌లోని పలు సర్వే నంబర్లలో ఉన్న 6.10 ఎకరాల స్థలానికి సంబంధించి అక్రమ నిర్మాణాలంటూ స్థానిక ఎమ్మార్వో జారీ చేసిన నోటీసులను సవాలు చేస్తూ షామ్స్ ఫాతిమాఖాన్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వక్ఫ్ బోర్డు సీఈవో రాసిన లేఖ ఆధారంగా వాల్టా చట్టం కింద ఎమ్మార్వో నోటీసులు జారీ చేయటం చెల్లదని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ప్రభుత్వ న్యాయవాది కలుగజేసుకొని.. మీరాలం చెరువు ఆక్రమణలపై ఇప్పటికే ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైందన్నారు. ఆ పిటిషన్‌లోని ఉత్తర్వుల ప్రకారం సదరు సర్వే నెంబర్లలోని ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.దీనిపై న్యాయమూర్తి జస్టిస్ భాస్కర్ రెడ్డి స్పందిస్తూ.. ఒకప్పుడు హైదరాబాద్ సిటీ ఆఫ్ లేక్స్‌గా ఉండేదని.. అప్పుడు 2,200 చెరువులుంటే ప్రస్తుతం 180 కూడా లేవని అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం చెరువుల పరిరక్షణకు హైడ్రా చర్యలు తీసుకుంటోందని.. కాకపోతే మురికివాడల్లోని పేదల అక్రమ నిర్మాణాలనే కాకుండా పెద్దలు చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చాలని సూచించింది. అప్పుడే ప్రజలకు మేలు చేసినట్లవుతుందన్నారు. మీరాలం చెరువుకు సంబంధించి పిటిషనర్ అభ్యంతరాలు లేవనెత్తగా.. ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్త సర్వే నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. ఆ భూమి వక్ఫ్‌బోర్డుదని తేలితే ఆక్రమణల తొలగింపు బాధ్యతలను హైడ్రాకు కాకుండా వక్ఫ్‌బోర్డుకు వదిలేయాలంటూ పిటిషన్‌పై విచారణను హైకోర్టు మూసేసింది.




# మాతృత్వపు మాధుర్యం ఆస్వాదిస్తున్నా

## తల్లిగా షూటింగ్‌లో పాల్గొనడం సవాలే అంటున్న దీపిక

బాలీవుడ్ నటి దీపికా పదుకొణె గతేడాది ఆడబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. తన బిడ్డతో కొంతకాలంగా సరదాగా గడిపిన దీపికా తిరిగి షూటింగ్‌లలో పాల్గొనేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిగా తన కుమార్తెతో సమయం గడపడం, చిత్రీకరణలో పాల్గొనడం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఒక తల్లిగా చిత్రీకరణలో పాల్గొనడం అనేది ఎప్పుడూ సవాలే. ప్రస్తుతం నేను నా జీవితంలో మాతృత్వపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నాను. ఇకపై షూటింగ్‌లలో పాల్గొనేందుకు సిద్ధమవ్వాలి. నా కుమార్తెకు తల్లిగా నా బాధ్యతలను నిర్వర్తిస్తూనే చిత్రీకరణల్లో పాల్గొనాలి. ఈ విషయంలో సలహాలు ఇచ్చేందుకు ఎంతోమంది మహిళలు ఉన్నారని నాకు తెలుసు. కానీ, ఇది నాకు అతిపెద్ద సవాలుగా కనిపిస్తోంది. దీన్ని ఎలా ఎదుర్కోవాలో ఆలోచిస్తున్నాను. కచ్చితంగా దీన్ని ఎదుర్కొంటాననే నమ్మకం నాకు ఉంది. మాతృత్వం అనేది గొప్ప అనుభూతి. ఇది నేను ఎంచుకొనే సినిమాలపై ప్రభావం చూపుతుందని నాకు తెలుసు. నేను తల్లి కాకముందు కూడా సినిమాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకున్నాను. ఇకపై కూడా అలానే తీసుకుంటాను' అని దీపికా చెప్పారు. దీపికా చివరిసారిగా 'సింగం అగైన్' లో శక్తిమంతమైన పాత్రలో కనిపించారు. రోహిత్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గణ్, కరీనాకపూర్‌ఖాన్, రణ్‌వీర్‌సింగ్, అక్షయ్‌కుమార్‌లు కీలకపాత్రలు పోషించారు. దీనితో పాటు- గతేడాది 'కల్కి 2898 ఏడీ'లో సుమతి పాత్రలో కనిపించి సందడి చేశారు. ప్రస్తుతం దీని సీక్వెల్ పనులు జరుగుతున్నాయి.

# బాలీవుడ్‌కు ఫిక్స్ అయిన తాప్సీ

సొట్ట బుగ్గల సుందరి తాప్సీ పన్నుకు యాక్టింగ్ లైఫ్, కెరీర్ ఇచ్చిందే సౌత్ ఇండస్ట్రీ. ముఖ్యంగా టాలీవుడ్ ఆమెకు స్టార్డ్ డమ్ ఇచ్చింది. ఝుమ్మందినాదంతో ఎంట్రీ ఇచ్చిన ఈ ఢిల్లీ డాల్ ప్రభాస్, ధనుష్, వెంకటేశ్, గోపీచంద్, రవితేజ, మోహన్ లాల్, అజిత్ లాంటి సౌత్ స్టార్లతో జోడీ కట్టింది. అంతలో బాలీవుడ్ రమ్మంటే అక్కడకు వెళ్లిపోయింది. ఇక అప్పటి నుండి మేడమ్‌లో ఒరిజినాలిటీ- బయటకు వచ్చింది. నార్త్ బెల్ట్‌కు వెళ్లి టాలీవుడ్‌పై నోరు పారేసుకోవడంతో స్టార్స్‌తో నటించే ఛాన్స్ పోగొట్టు-కున్నట్లయ్యింది. బాలీవుడ్ వెళ్లాక లేడీ ఓరియెంట్ చిత్రాలతో పాపులర్ అయ్యింది తాప్సీ. పింక్, నామ్ షబానా, తప్పడ్, హసీనా దిల్ రుబా, బద్లా లాంటి సినిమాలో ఆమె ఇమేజ్ ఎక్కడికో వెళ్లిపోయింది. ఈ మధ్యలో తెలుగులో సినిమాలు చేసింది కానీ అవి పెద్దగా ఆడలేదు. ఆనందో బ్రహ్మ తర్వాత చేసిన ఏ తెలుగు సినిమా హిట్ కాలేదు. 2022 తర్వాత మిషన్ ఇంపాజిబుల్ చేశాక టాలీవుడ్ వైపు తొంగి చూడలేదు సొట్టబుగ్గలసుందరి. పూర్తి సేవలు బీటౌన్‌కే అందిస్తోంది. కెరీర్ స్టార్ట్ చేసిన దశాబ్దం దాటిన నార్త్ బెల్ట్‌లో త్రీ ఖాన్స్‌లో కేవలం షారూఖ్‌తో జోడీ కట్టింది తాప్సీ. సీనియర్ల కంటే జూనియర్లే బెటర్ అనుకుందేమో ఎక్కువగా యంగ్ హీరోలతో యాక్ట్ చేసింది. ప్రస్తుతం ఆమె చేతిలో రెండు ప్రాజెక్టులున్నాయి. ప్రతీక్ గాంధీ సరసన హో లడకీ హై కహాన్. ఇస్వాక్ సింగ్‌తో గాంధారీ చేస్తోంది బ్యూటీ. రీసెంట్లీ- గాంధారీ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. త్వరలో నెట్ ఫ్లిక్స్‌లో ప్రసారం కానుంది. మరీ బాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉన్న తాప్సీ.. ఇక టాలీవుడ్ కు టాటా చెప్పేసినట్లేనా..అన్న ప్రచారం సాగుతోంది.



# తమన్‌ను అన్ ఫాలో అవుతున్న చరణ్

### అదంతా ఉత్తిదే అని తేల్చిన రామ్‌చరణ్

స్టార్ హీరో రామ్ చరణ్ సంగీత దర్శకుడు తమన్‌ను సోషల్ మీడియాలో అన్‌ఫాలో అయ్యారనే వార్త రెండు రోజుల నుంచి వైరలవుతోన్న విషయం తెలిసిందే. తాజాగా దీనిపై చరణ్ టీమ్ ఓ ఆంగ్ల మీడియాకు క్లారిటీ ఇచ్చింది. ఆ వార్తల్లో నిజం లేదని వెల్లడించింది. రామ్‌చరణ్ మొదటినుంచి సోషల్ మీడియాలో తక్కువ మందిని మాత్రమే ఫాలో అవుతున్నారు. ఆయన కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే ఆయన ఫాలో అయ్యే వారిలో ఉంటారు. చరణ్ సంగీత దర్శకుడు తమన్‌ను అన్‌ఫాలో అయ్యారనే వార్తల్లో నిజం లేదని తెలిపింది. దీంతో ఈ రూమర్స్‌కు చెక్ పడింది. అసలేం జరిగిందంటే.. ఇటీవల తమన్ ఓ ఇంటర్వ్యూలో 'గేమ్ ఛేంజర్' పాటల వ్యూస్ గురించి మాట్లాడారు. యూట్యూబ్‌లో ఈ పాటలకు ఎక్కువ వ్యూస్ రాలేదన్నారు. 'గేమ్ ఛేంజర్' పాటలు అనుకున్న మేర అంచనాలను చేరుకోలేకపోయాయి. ఎందుకంటే అందులోని ఏ పాటలోనూ హుక్ స్టెప్ లేదు. దీంతో ఆడియన్స్‌కు రీచ్ కాలేదు. 'రా మచ్చా..', 'నానా హైరానా', 'జరగండి జరగండి..' ఈ పాటల్లో ఒక్క దాంట్లో కూడా హుక్ స్టెప్ లేదు. అందుకే వ్యూస్ రాలేదు. ఒక్క పాటలో మంచి స్టెప్ ఉంటే ప్రేక్షకులు దానికి కనెక్ట్ అవుతారని అన్నారు. ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి.




# జాక్ చిత్రం నుంచి కిస్ సాంగ్ విడుదల

### బొమ్మరిల్లు భాస్కర్ దమ్మున్న దర్శకుడన్న సిద్ధూ

సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా.. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'జాక్' . వైష్ణవి చైతన్య కథానాయిక. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మాణంలో ఏప్రిల్ 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలోని కిస్ సాంగ్‌ను గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆసక్తికర విషయాలు పంచుకుంది. ప్రతి మనిషికి ఒక గోల్ ఉంటుంది. దాన్ని ఎలా సాధిస్తామనేది ముఖ్యం. అదే ఈ సినిమాలో చూపించారు. ఆడియన్స్‌కు వినోదాన్ని పంచడమే మా ముఖ్య ఉద్దేశం. 'ఆరెంజ్' సినిమాలో ఒక పాత్రలో నటించాను. ఇన్నేళ్ల తర్వాత బొమ్మరిల్లు భాస్కర్‌తో పని చేయడం అప్పటి రోజుల్ని గుర్తు చేసిందని సిద్ధూ జొన్నలగడ్డ అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ ప్రతి హీరో కెరీర్‌లో ఒక ప్రత్యేక పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది. నా కెరీర్‌కు టిల్లు పాత్ర అలా గుర్తుండిపోతుంది. రామ్‌చరణ్‌తో కలిసి 'ఆరెంజ్' సినిమాలో నటించాను. భవిష్యత్తులో అవకాశం వస్తే కచ్చితంగా చేస్తాను. ఆయనంటే నాకు చాలా ఇష్టం. నేను దర్శకుడి ప్రతిభ చూస్తాను. ఆయన హిట్ సినిమాలు తీస్తున్నారా, లేదా అని నేనెప్పుడూ ఆలోచించలేదు. బొమ్మరిల్లు భాస్కర్ తీసిన ప్రతి సినిమా కొత్తగానే ఉంటుంది. ఆ నమ్మకంతోనే ఈ సినిమా చేశానని అన్నారు.

# రజనీ స్ఫూర్తితో లూసిఫర్‌లో సన్నివేశం

మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'లూసిఫర్2: ఎంపురాన్. పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో ముస్తాబవుతోంది. 2019లో విడుదలై బ్లాక్‌బస్టర్ సొంతం చేసుకున్న 'లూసిఫర్'కు సీక్వెల్‌గా ఇది రానుంది. తాజాగా 'లూసిఫర్'లోని ఓ సన్నివేశం గురించి పృథ్వీరాజ్ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. లూసిఫర్' సినిమా మొత్తానికి మోహన్‌లాల్ ఎంట్రీ సన్నివేశం హైలైట్‌గా నిలిచింది. ఆ సన్నివేశానికి రజనీకాంత్ స్ఫూర్తి అని దర్శకుడు తెలిపారు. 'మోహన్‌లాల్ అంటే ఎవరో చెప్పడానికి లూసిఫర్‌లో ఒక్క సన్నివేశం సరిపోతుంది. ఆ ఎంట్రీ సీన్ మొత్తాన్ని రజనీకాంత్ గురించి విన్న కథను స్ఫూర్తిగా తీసుకొని తెరకెక్కించాను. రజనీ నివాసం ఉండే పోయెస్ గార్డెన్ వీధిలో ఎప్పుడూ ఎలా ఉంటుందో ఒక వార్తా కథనంలో చదివాను. ఆ కథనాన్ని చదివిన తర్వాత రజనీకాంత్‌ని స్ఫూర్తిగా తీసుకొని ఒక సీన్ రాశాను. అదే మోహన్‌లాల్ ఎంట్రీ- సీన్. సినిమాలో దానికి మంచి ఆదరణ లభించిందని చెప్పారు. రజనీకాంత్‌కు పృథ్వీరాజ్ వీరాభిమాని అని తెలిసిందే. గతంలోనూ ఎన్నో సందర్భాల్లో రజనీకాంత్‌పై తనకున్న అభిమానాన్ని వ్యక్తంచేశారు. 'లూసిఫర్ 2' -ట్రైలర్‌ను కూడా ఆయన మొదట రజనీకాంత్‌కు చూపించారు. రజనీ ఈ ట్రైలర్ చూసి తననెంతో ప్రశంసించారని ఆ మాటలు ఎప్పటికీ మర్చిపోలేనని ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. తాను రజనీ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు- చెప్పారు. ఒకసారి ఆ అవకాశం వచ్చినా డేట్స్ సర్దుబాటు- చేయలేక డైరెక్ట్ చేయలేకపోయినట్లు- తెలిపారు.






# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

- టెల్‌అవీవ్‌పై ఇజ్రాయిల్ వైమానిక దాడులు
- తాజాగా 70 మంది మృతి చెందినట్లు అంచనా



**గాజా,మార్చి20( వెలుతురు):**
ఇజ్రాయెల్, హమాస్ ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియా మళ్లీ రణరంగంగా మారింది. ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన భీకర దాడుల్లో 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. తాజాగా టెల్‌అవీవ్ దళాలు మరోసారి వైమానిక దాడులతో విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో అనేకమంది మృతి చెందినట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం గాజాపై ఐడీఎఫ్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో దాదాపు 70 మంది మృతి చెందినట్లు- స్థానిక అధికారులు తెలిపారు. ఇందులో ఓ మహిళతో సహా అనేక మంది చిన్నారులు ఉన్నట్లు- వెల్లడించారు. ఇక, ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్ గాజాకు తీవ్ర హెచ్చరికలు చేశారు. బందీలందరినీ తిరిగివ్వడానికి ఇదే చివరి అవకాశమని లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటు-ందని పేర్కొన్నారు. మరోవైపు.. నెట్జారిమ్ నడవాలో కొంత భూభాగాన్ని టెల్‌అవీవ్ స్వాధీనం చేసుకుంది. ఇక్కడినుంచి పాలస్తీనావాసుల కదలికలను నియంత్రించే వెసులుబాటు- దానికి దక్కింది. మంగళవారం గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. ఈ దాడుల్లో 400 మందికి పైగా మృతిచెందగా.. అనేకమంది గాయపడ్డారు. మృతుల్లో చిన్నారులు, మహిళలే ఎక్కువమంది ఉన్నారు. ఇజ్రాయెల్- హమాస్‌ల మధ్య తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందంలో మార్పులు చేయడానికి హమాస్ తిరస్కరించడంతోనే దాడులకు ఆదేశించానని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తెలిపారు. బందీలను విడుదల చేయడానికి హమాస్ పదేపదే నిరాకరిస్తోందని, యుద్ధ లక్ష్యాలను సాధించడానికి గాజాలోని హమాస్ స్థావరాలే లక్ష్యంగా ఐడీఎఫ్ దాడులు చేస్తోందని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇజ్రాయెల్ ఇప్పటినుంచి హమాస్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటు-ందని తెలిపారు. ఈ దాడులను హమాస్ తీవ్రంగా ఖండించింది. టెల్‌అవీవ్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి బందీల ప్రాణాలను ప్రమాదంలో పడేసిందని పేర్కొంది. ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని మిలిటెంట్ సంస్థ హెచ్చరించింది.

# ఛత్తీస్‌ఘడ్‌లో మరోమారు కాల్పుల మోత

- పలువురు మావోలు మరణించినట్లు సమాచారం



**రాయపూర్,మార్చి20( వెలుతురు):**
ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మరోసారి కాల్పులతో దద్దరిల్లుతోంది. గురువారం బీజాపూర్- దంతెవాడ సరిహద్దులో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో పలువురు మావోయిస్టులు మృతి చెందారని సమాచారం. బీజాపూర్ - దంతెవాడ జిల్లాల సరిహద్దులో ఉన్న దట్టమైన అడవుల్లో భద్రతా బలగాలు నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్‌ను ప్రారంభించాయి. ఇందులో భాగంగా జిల్లాల నుంచి సంయుక్త బలగాలు అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య భారీ ఎదురుకాల్పులు జరుగుతున్నాయి. ఈ కాల్పుల్లో మావోయిస్టులకు భారీ నష్టం వాటిల్లినట్లు- పోలీసులు వర్గాలు తెలిపాయి. బీజాపూర్ జిల్లాలోని గంగలూరు ప్రాంతంలో పెద్దఎత్తున మావోయిస్టులు ఉన్నారని సమాచారం అందడంతో బలగాలను పంపినట్లు- ఎస్పీ జితేంద్రయాదవ్ వెల్లడించారు. ఇప్పటికీ కాల్పులు కొనసాగుతున్నాయని, భద్రతా సిబ్బంది వచ్చిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. మరోవైపు నారాయణపూర్ జిల్లాలో ఐఈడీ పేలడంతో సిబ్బందిలో ఒకరు గాయపడ్డారు.

# బెట్టింగ్ యాప్స్‌లో కీలక పరిణామం

- టాలీవుడ్ ప్రముఖులపై కేసు నమోదు
- రానా, విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్‌లపై కేసు

**హైదరాబాద్,మార్చి20( వెలుతురు):**



బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ యాప్‌లను ప్రమోట్ చేసిన వారిలో ఉన్న ప్రముఖ నటీనటులపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నటీనటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు సహా మొత్తం 25 మంది ఈ జాబితాలో ఉన్నారు. సినీ ప్రముఖుల జాబితాలో రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్ ఉన్నారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లలో అనన్య నాగళ్ల, సిరి హనుమంతు, శ్రీముఖి, వర్షిణి సౌందరరాజన్, వాసంతి కృష్ణన్, శోభా శెట్టి, అమృత చౌదరి, నయని పావని, నేహా పఠాన్, పండు, పద్మావతి, ఇమ్రాన్‌ఖాన్, విష్ణు ప్రియ, హర్ష సాయి, బయ్యా సన్నీ యాదవ్, యాంకర్ శ్యామల, టేస్టీ తేజ, రీతూ చౌదరి, బండారు సుప్రీత ఉన్నారు. మియాపూర్ వాసి ప్రమోద్ శర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దాదాపు 25 మందిపై సైబారాబాద్‌కి చెందిన మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసి యువతను చెడగొడుతున్నారని మియాపూర్‌కి చెందిన ప్రమోద్ శర్మ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ప్రమోషన్లను అరికట్టేందు కు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఫిర్యాదును స్వీకరించిన మియాపూర్ పోలీసులు.. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన ప్రముఖ తెలుగు నటులు రానా దగ్గుబాటితో పాటు మంచు లక్ష్మి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, ప్రణీత, శ్రీముఖి, రీతూ చౌదరి, యాంకర్ శ్యామల, అనన్య నాగళ్ల తదితరులపై కేసు నమోదు చేశారు.

# దొంగల్లాగా రావాల్సిన అవసరమేముంది

- దొంగతనంగా సంతకాలు చేసి వెళితే ఎలా
- సభకు రాకుండా..సంతకాలు చేయడం సబబేనా
- ప్రజలు ఎన్నుకుంది ఇందుకేనా?
- అసెంబ్లీలో వైకాపా సభ్యుల తీరుపై స్పీకర్ అసహనం

**అమరావతి,మార్చి20( వెలుతురు):**
వైకాపాకు చెందిన ఎమ్మెల్యేలు శాసనసభకు రాకుండా సంతకాలు చేస్తుండటంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా ఎమ్మెల్యేలు సభకు హాజరవడం మీరెవరైనా చూశారా? అంటూ సభ్యులను స్పీకర్ ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన సభ్యులు సభకు సగౌరవంగా హాజరుకావాల్సి ఉందన్నారు. వైకాపా సభ్యులు ఎవరికీ కనపడకుండా దొంగచాటుగా వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేయాల్సిన పనేముందని అసహనం వ్యక్తం చేశారు. అలా వచ్చి వెళ్లడం వారి గౌరవాన్ని పెంచదన్నారు. ఎన్నికైన వారు సభకు రావాలి. ప్రజల సమస్యలపై చర్చించాలి. ప్రజలు ఎన్నుకుందే అందుకు అని గుర్తించాలని స్పీకర్ అన్నారు. ఈ మేరకు అసెంబ్లీలో సభ్యుల హాజరుపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు కీలక ప్రకటన చేశారు. ఈ సమావేశంలో 25 ప్రశ్నలకు సమాధానాలు రాలేదని అన్నారు. ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నలు వేయడం వల్ల మరో ఇద్దరు మెంబర్లు అడగడానికి ఇబ్బంది వస్తోందన్నారు. ఇది సమంజసం కాదని.. ప్రశ్నలు అడగడానికి వారు సభలో ఉండడం లేదని.. ఇది చాలా దురదృష్టకరమని అన్నారు. సభ్యులు సభకు రావాలని, ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయిన సభ్యులు సగౌరవంగా సభకు రావాలని సూచించారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ సభ్యుల తీరుపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ సభ్యులు దొంగల్లా సభకు వస్తున్నారని, సంతకాలు పెట్టి వెళుతున్నారని మండిపడ్డారు. ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. రిజిష్టర్‌లో సంతకాలు చేసిన వారు సభలో తనకు కనిపించలేదని అయ్యన్న పాత్రుడు అన్నారు. ప్రజా ప్రతినిధులుగా ప్రజలు మిమ్మల్ని ఎన్నుకున్నారని, మొఖం చాటేయడం ఎందుకని సభాపతి అయ్యన్న వైఎస్సార్‌సీపీ సభ్యులను ఉద్దేశించి ప్రశ్నించారు. దొంగల్లా వచ్చి సంతకాలు చేసి వెళ్లడం ఏంటన్నారు. హాజరు పట్టికలో సంతకాలు చేసి సభకు రాకపోవడం వారి గౌరవాన్ని పెంచదన్నారు. వై బాల నాగిరెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, రేగం మత్స్యలింగం, విరూపాక్షి, దాసరి సుధ, అమరనాధ రెడ్డి, విశ్వేశరరాజులు తదితరులు ఇలా సంతకాలు చేసి వెళ్లిపోతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగం తరువాత వేర్వేరు రోజుల్లో వారు సంతకాలు చేసి వెళ్లినట్టు- తెలుస్తోందన్నారు. మీకు ఓట్లేసిన ప్రజలకు ఇలా చేసి తలవంపులు తేవద్దని కోరుతున్నామని అయ్యన్న పాత్రుడు అన్నారు. దొంగల్లా వచ్చి సంతకాలు పెట్టాల్సిన అవసరం వైఎస్సార్‌సీపీ సభ్యులకు లేదని, వారు గౌరవంగా సభకు వచ్చి మాట్లాడవచ్చు కదా అని స్పీకర్ అయ్యన్న అన్నారు. ప్రశ్నలు అడిగి కొంతమంది సభ్యులు సభలో లేకుండా వెళ్లిపోతున్నారని, దీని వలన అసలు ప్రశ్నలు అడగాల్సిన సభ్యులు అవకాశం కోల్పోతున్నారని ఆయన అన్నారు. ఇటువంటి సంప్రదాయం మంచిది కాదన్నారు. అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకాలు చేసిన 7 గురి ఎమ్మెల్యేల పేర్లను సభాపతి అయ్యన్న పాత్రుడు సభలో చదివి వినిపించారు. వైకాపా సభ్యులు బాలనాగిరెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, మత్స్యలింగం, విరూపాక్ష, విశ్వేశ్వరరాజు, ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, దాసరి సుధ తదితరులు సంతకాలు చేసినట్లు తేలిందని స్పీకర్ చెప్పారు. గవర్నర్ ప్రసంగం తర్వాత వీరెవరూ సభకు హాజరు కాలేదన్నారు. వేర్వేరు తేదీల్లో వీరు రిజిష్టర్‌లో సంతకాలు చేసినట్టు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. హాజరుపట్టిలో వారి సంతకాలు ఉన్నా వాళ్లు సభకు వచ్చినట్టు స్పీకర్‌గా తాను గుర్తించలేదన్నారు. ఓటేసి గెలిపించిన ప్రజలకు తలవంపులు తేవొద్దంటూ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు.



# వేసవిలో ప్రజల దాహర్తి తీర్చడంలో భాగస్వాములు కండి..

- గుక్కెడు చల్లటి నీరు అందించి దాహర్తిని తీర్చండి..
- శిరీష్మ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం..
- దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.





**విజయవాడ,మార్చి20( వెలుతురు):**
వేసవిలో గుక్కెడు చల్లటి త్రాగు నీరుని అందించే పుణ్య కార్యక్రమం ప్రతి ఒక్కరూ భాగస్వాములై ప్రజల దాహర్తి తీర్చేందుకు ముందుకు రావాలని చలసాని శిరీష్మ కుటుంభ్యుల సేవలను స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని దాతల సహకారంతో జిల్లా వ్యాప్తంగా చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు చల్లటి నీరు, మజ్జిగ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. చలసాని శిరీష్మ జ్ఞాపకార్థం కుటుంభ్యుల ఆధ్వర్యంలో స్థానిక రాఘవయ్య పార్కు సమీపంలో ఏర్పాటు చేసిన ఉచిత త్రాగునీరు ఆర్వో ప్లాంట్ మరియు వైద్య శిబిరాలను గురువారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉన్నయాని వాతావారణ శాఖ అధికారులు సూచిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు దాహర్తిని తీర్చడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమన్నారు. రాజధానికి కేంద్ర బిందువైన విజయవాడ నగరానికి నిత్యం అనేక ప్రాంతాల నుండి వేలాదిమంది ప్రజలు విచ్చేస్తారన్నారు. వేసవి ప్రజలకు గుక్కెడు చల్లటి త్రాగునీరు అందించడం మంచి పుణ్య కార్యక్రమం అవుతుందన్నారు. త్రాగునీరు అందించేందుకు పెద్దగా ఖర్చు చేయాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్కరూ వారి ఇల్లు లేదా వ్యాపార సంస్థ వద్ద మట్టి కుండలను, కూలింగ్ టిన్నులను ఏర్పాటు చేసుకుని దాహంతో ఉన్న వారికి చల్లటి నీరు మజ్జిగలను పంపిణీ చేయాలని ఇది ఎంతో పుణ్య కార్యక్రమం అని కలెక్టర్ తెలిపారు. వేసవి వేడిని దృష్టిలో పెట్టుకుని ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలు, ఆవాసా గ్రామలలో సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకాలు, రక్షిత నీటి సరఫరా పథకాలు, పంపింగ్ పథకాలు, చేతిపంపులు ఉన్నాయని వీటికి అవసరమైన మరమత్తులు చేసి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడం ద్వారా ఇబ్బందులు అధిగమించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ ఆర్వో ప్లాంట్స్ ద్వారా ప్రజలకు త్రాగునీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రజలకే కాదు పశుపక్ష్యాదులకూ కూడా తాగునీటికి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. బస్టాండ్లు, ఆసుపత్రులు, రహదారుల కూడళ్లు తదితర ప్రదేశాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నామని ఇందుకు అవసరమైతే దాతల సహకారం తీసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే దాతలకు జిల్లా యంత్రాంగం పక్షాన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రజలు ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో సిబ్బందికి అవగాహన కల్పించడంతో పాటు వడదెబ్బ బాధితులకు తక్షణ చికిత్స అందించేలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఏపిఎన్‌జివో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. విద్యాసాగర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహర్తిని తీర్చేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు అనేక చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలన్న జిల్లా కలెక్టర్ పిలుపు మేరకు నగరంలోని రద్దీ ప్రాంతాలలో ఏపిఎన్‌జివో అసోసియేషన్ పక్ష్యాన చలివేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న శిరీష్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రధాన వ్యాపార కూడలి ప్రాతంలో రక్షిత మంచి నీటి పథకాన్ని ఏర్పాటు చేసి చల్లటి త్రాగునీటి మజ్జిగను పంపిణీ చేయడం ఆదర్శప్రాయంగా నిలుస్తుందన్నారు. చలసాని శిరీష్మ తండ్రి వాటర్ ప్లాంట్ నిర్వహకులు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలలో శిరీష్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరును అందించాలనే లక్ష్యంతో రక్షిత మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేసి 24 గంటలు చల్లటి త్రాగునీటిని అందజేస్తున్నామన్నారు. నిరుపేదలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి అవసరమైన మందులను సరఫరా చేయడం జరిగిందన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి, కమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో గిరిజనలకు అవసరమైన పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రారంభ కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు డా. రామ శేషయ్య, సామాజిక విశ్లేషకులు టి. లక్ష్మీనారాయణ, సామంతపూడి చైతన్య, ఎన్.నారాయణ, ఏపిఎన్‌జివో నాయకులు డి.సత్యనారాయణ రెడ్డి, పి. రమేష్, సివిఆర్ ప్రసాద్, నజీర్‌రుదీన్ తదితరులు పాల్గొన్నారు.

# బెట్టింగ్యాప్స్ కేసులో విచారణ

- పంజగుట్ట పోలీసుల విచారణకు విష్ణుప్రియ
- సెల్‌ఫోన్ సీజ్ చేసిన పోలీసులు

**హైదరాబాద్,మార్చి20( వెలుతురు):**
బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ వ్యవహారంలో యాంకర్ విష్ణుప్రియను మూడు గంటల పాటు- పోలీసులు విచారించారు. ఆమె స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డు చేశారు. విష్ణుప్రియ మొబైల్‌ను పంజాగుట్ట పోలీసులు సీజ్ చేశారు. బెట్టింగ్ యాప్స్ కేసులో గురువారం ఆరుమంది విచారణకు హాజరుకావాల్సి ఉంది. కానీ కేవలం విష్ణుప్రియ మాత్రమే పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. విష్ణుప్రియను కూడా రెండు రోజుల క్రితమే విచారణకు హాజరుకావాలని నోటీ-సులు ఇచ్చారు పోలీసులు. అయితే వ్యక్తిగత కారణాల వల్ల విచారణకు హాజరుకాలేకపోతున్నానని, రెండు రోజులు తనకు సమయం ఇవ్వాలని విష్ణుప్రియ పోలీసులను కోరారు. ఇందుకు పోలీసులు అనుమతి ఇవ్వడంతో గురువారం విష్ణుప్రియ వ్యక్తిగతంగా పోలీసుల ఎదుట విచారణకు




హాజరయ్యారు. ఉదయం 10:15 గంటలకు విష్ణుప్రియ పంజాగుట్ట పోలీసుల ఎదుట విచారణకు హాజరవగా.. దాదాపు మూడు గంటల పాటు- విచారించిన పోలీసులు ఆమె స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. విష్ణుప్రియతో పాటు- ఆమె తరపున న్యాయవాది విచారణకు హాజరయ్యారు. ఇక విచారణలో భాగంగా.. బెట్టింగ్ యాప్ ప్రమోషన్‌లో భారీగా డబ్బులు తీసుకున్నట్లు- విష్ణుప్రియ ఒప్పుకున్నారు. మొత్తం 15 బెట్టింగ్ యాప్‌లకు ఆమె ప్రమోషన్స్ చేశారు. ఇంస్టాగ్రామ్ వేదిక ద్వారా బెట్టింగ్ ప్రమోషన్ చేశారు. ఇప్పటికే విష్ణుప్రియ బ్యాంకు స్టేట్‌మెంట్‌ను పోలీసులు తీసుకున్నారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్‌కు సంబంధించి విష్ణుప్రియకు సంబంధించిన పోస్టింగ్‌లను ఇప్పటికే పంజాగుట్ట పోలీసులు గుర్తించారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే విధంగా ఆమె సోషల్ మీడియాలో విపరీతంగా పోస్టింగ్‌లు పెట్టడం, ఆ యాప్‌ల్లో డబ్బులు పెట్టి సంపాదించవచ్చని డైరెక్ట్‌గా చాలా మందిని బెట్టింగ్ వైపుకు మళ్లించే విధంగా విష్ణుప్రియ పోస్టింగ్‌లు పెట్టారు. వాటిపైనే మూడు గంటల పాటు పోలీసులు సుదీర్ఘంగా విచారణ జరిపారు. ఈ కేసులో నిందితురాలుగా ఉన్న విష్ణుప్రియ మొబైల్‌ను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఎప్పుడు విచారణకు పిలిచినా అందుబాటు-లో ఉండాలని పంజాగుట్ట పోలీసులు ఆదేశించారు. పంజాగుట్టలో నమోదైన ఎఫ్ఐఆర్‌లో ఇప్పటికే 11 మందిని నిందితులుగా చేర్చారు పోలీసులు. వారందరికీ కూడా వ్యక్తిగతంగా నోటీ-సులు జారీ చేశారు. రోజువారి విచారణలో భాగంగా ముగ్గురు ముగ్గురు చొప్పున విచారణకు రావాలని ఆదేశించినప్పటికీ కేవలం ఇద్దరు మాత్రమే విచారణకు హాజరయ్యారు. టేస్టీ తేజ విచారణకు హాజరయ్యారు. సోషల్‌మీడియాలో బెట్టింగ్ యాప్‌లపై పోస్టులు పెట్టిన కానిస్టేబుల్ కిరణ్ గౌడ్ కూడా పోలీసుల ఎదుట వ్యక్తిగతంగా విచారణకు రాగా.. మూడు గంటల పాటు- పోలీసులు అతడిని విచారించి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com